ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి


# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY


అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

శనివారం 05 సెప్టెంబర్ 2026 | Saturday 05 Septembar 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 145 | Vol.No 28 Issue No .145 | www.visionandhra.in



## కేబినెట్‌లోకి రాములమ్మ..!?

- మంత్రి పదవి కోసం హైకమాండ్‌తో చర్చలు
- సుముఖంగా ఉన్న కాంగ్రెస్ అధిష్ఠానం!

హైదరాబాద్, సెప్టెంబర్4 : తెలంగాణ రాజకీయాల్లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన నేపథ్యంలో ఆమె స్థానంలో మరో మహిళా నేతను కేబినెట్‌లోకి తీసుకునే అవకాశంపై కాంగ్రెస్ హైకమాండ్ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సినీ నటి విజయశాంతి పేరు తెరపైకి వచ్చింది. ఆమె మంత్రి పదవి కోసం హైకమాండ్‌తో చర్చలు జరుపుతున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. కొండా మిగతా2లో..



## డిగ్రీ, గురుకుల భవన నిర్మాణాలను పరిశీలించిన సీఎం

### మద్దూరు మున్సిపల్ కేంద్రంలో రేవంత్ పర్యటన

హైదరాబాద్,సెప్టెంబర్3 : తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ పరిధిలోని మద్దూరు మున్సిపల్ కేంద్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో విచ్చేసిన ఆయన, మద్దూరులో రూపుదిద్దుకుంటున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గురుకుల భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాల భవనాన్ని మార్చి నెలలోగా వేగవంతంగా పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు తరగతులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాల పురోగతిని పరిశీలించిన రేవంత్ రెడ్డి... కళాశాల ప్రాంగణాన్ని మరింత విశాలంగా తీర్చిదిద్దేందుకు పక్కనే ఉన్న స్థలాన్ని వెంటనే సర్వే చేసి భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మిగతా2లో..

## తెలంగాణలో కొత్తగా చేయూత పింఛన్లు

- ఈ నెల 15 వరకు దరఖాస్తులు స్వీకరణ



హైదరాబాద్, సెప్టెంబర్4 : తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తులకు సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు సమయంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు క్లారిటీ ఇచ్చారు. ధ్రువీకరణ పత్రాలను మిగతా2లో..

## నిర్మాణాల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనుల పురోగతిని పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి
- వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటుకు ఆదేశాలు
- నియోజకవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష



వికారాబాద్ జిల్లా, సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర): రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనుల పురోగతిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వివిధ విద్యా సంస్థల భవన సముదాయాల నిర్మాణాలను ఒక్కొక్కటిగా పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌లో భాగంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల, వెటర్నరీ కళాశాల, మిగతా2లో..

## కేసీఆర్ చాలా మంచోడు

- హుందాగా రిసీవ్ చేసుకునేవారు, • కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్,సెప్టెంబర్3 : మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌కు గురైన కొండా సురేఖ వరుస ఇంటర్వ్యూలతో కాంగ్రెస్ సర్కార్‌పై, పార్టీ అంతర్గత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆమె ప్రశంసల వర్షం కురిపించడం... ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కేసీఆర్ వ్యవహారశైలి ఎలా ఉండేదన్న ప్రశ్నకు సురేఖ స్పందిస్తూ... "కేసీఆర్ గారు చాలా మంచి వ్యక్తి. మిగతా2లో..

## హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవు

- సురేఖ తొలగింపుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్,సెప్టెంబర్3 : తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం బాధ కలిగించేదే అయినా, పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉందని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అధిష్ఠానం ఈ చర్యలు తీసుకుందని వివరించారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తుచేశారు. వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. "కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు" మిగతా2లో..

## రేవంత్ రెడ్డిని ఆపకపోతే మీరు ఇంట్లో కూర్చోవాల్సిందే

- బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు నేను ముందే చెప్పాను..
- ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, సెప్టెంబర్4 : "కేసీఆర్‌కు ముందే చెప్పాను. రేవంత్ రెడ్డిని ఆపకపోతే మీరు ఇంట్లో కూర్చోవాల్సిందే" అని ఎంఐఎం నేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం సైదాబాద్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తాము గతంలో మిగతా2లో..

## సురేఖను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం

- రాజగోపాల్‌రెడ్డిని కూడా బీఆర్ఎస్‌లోకి తీసుకోం, • మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, సెప్టెంబర్4 : మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఆమె బీఆర్ఎస్ లో చేరుతారని ఓవైపు, బీజేపీలో చేరుతారని మరోవైపు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖ కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరవచ్చనే ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కొండా సురేఖను మిగతా2లో..

## కొండా సురేఖను తొలగించారు.. పొంగులేటి సంగతి ఏమిటి?:,

- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్,సెప్టెంబర్3 : తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మిగతా2లో..

## జలాశయాల్లో తగినంత నీళ్లు లేవు

- ఉన్న నీటిని పొదుపుగా వాడుకోండి
- విద్యుత్ ఉత్పత్తి కోసమే నీటిని వాడొద్దు
- పోతిరెడ్డిపాడు నుంచి నీటి నియంత్రించాలి
- తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ సూచన
- నీటి పంపకాల్లో కుదరని ఏకాభిప్రాయం..
- వాడీవేడిగా కేఆర్ఎంబీ సమావేశం
- మరోసారి వాయిదా పడ్డ కృష్ణాబోర్డు భేటీ
- 50 శాతం తెలంగాణ వాటా అడిగాం
- తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు



న్యూఢిల్లీ, సెప్టెంబర్4 : తెలుగురాష్ట్రాలకు కేఆర్?ఎంబీ కీలక సూచనలు చేసింది. విద్యుత్ ఉత్పత్తి కోసమే నీటిని ప్రాజెక్టుల నుంచి దిగువకు విడుదల చేయొద్దని పేర్కొంది. పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను నియంత్రించాలంది. రెండు రాష్ట్రాల(ఏపీ, తెలంగాణ) నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని, ఉమ్మడి జలాశయాల్లో నీరు తక్కువగా ఉన్నందువల్ల పొదుపుగా వాడుకోవాలని సూచన చేసింది. కష్టకాలంలో తాగునీటికే ప్రాధాన్యం ఇవ్వాలని విభజన చట్టం నిర్దేశిస్తోందని కేఆర్?ఎంబీ స్పష్టం చేసింది. కృష్ణా జలాల అంశంపై ప్రతిష్టంభన వీడలేదు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ మిగతా2లో..

## పల్లె చెరువులకు కొత్త కళ

- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ. 50 కోట్లతో 105 చెరువుల ఆధునీకరణ
- ఇప్పటికే 26 చెరువులకు పునరుజ్జీవం
- భూగర్భ జలాల పెంపు.. సమగ్ర అభివృద్ధే ధ్యేయం
- వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ ఎయిర్ జిమ్‌లు, చిల్డ్రన్ పార్కులతో కొత్త రూపు
- సెప్టెంబర్ నెలాఖరుకల్లా పనులు పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం





మంగళగిరి, సెప్టెంబర్ 4 : సాగు నీటి వనరుల సంరక్షణ నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల వరకు సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రత్యేక కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధిపై లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉప ముఖ్యమంత్రివర్యుల చొరవకు 'ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన' పథకం తోడవడంతో రాష్ట్రవ్యాప్తంగా మంచినీటి చెరువులు, సరస్సుల పునరుజ్జీవనానికి కొత్త ఊపు వచ్చింది. శ్రీ పవన్ కళ్యాణ్ గారి దార్శనికత, అభివృద్ధి పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతతో చెరువులకు కొత్త జీవం పోయడమే కాకుండా, వాటిని మరింత సమర్థవంతమైన సాగునీటి వనరులుగా తీర్చిదిద్దే దిశగా విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. చెరువుల ఆధునీకరణ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడం, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటం, మిగతా2లో..

## డిగ్రీ, గురుకుల భవన నిర్మాణాలను పరిశీలించిన సీఎం

ప్రియాంకను ఆదేశించారు. ఇదే సమయంలో గురుకుల భవన నిర్మాణానికి తమ అమూల్యమైన సొంత భూములను ఉచితంగా అందించిన దాతల ఉదారతను అభినందిస్తూ, వారికి వెంటనే 'ఇందిరమ్మ ఇళ్లు' మంజూరు చేయాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.

## నిర్మాణాల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు 400 పడకల ఆసుపత్రి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, విద్యార్థుల హాస్టళ్ల భవన సముదాయాలను సీఎం పరిశీలించారు. ఎడ్యుకేషన్ హబ్‌లోని అన్ని నిర్మాణ పనులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సీఎం సూచించారు. నిర్మాణాల్లో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, సాంకేతిక ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు, ఆ నీటిని ల్యాండ్‌స్కేపింగ్ పనులకు వినియోగించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నియోజకవర్గంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు, ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, మౌలిక వసతులు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

## కేసీఆర్ చాలా మంచోడు

తమను ఎప్పుడు కలిసినా ఎంతో గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారు" అని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీలో పనిచేసినన్ని రోజులు కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు రాలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం అడిగిన వెంటనే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. నాడు కొండా మురళికి ఎమ్మెల్సీ పీఠం దక్కకుండా పార్టీలోని కడియం శ్రీహరి వంటి కొందరు సీనియర్ నేతలు అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, కానీ కేసీఆర్ స్వయంగా జోక్యం చేసుకుని మిగిలిన వారి నామినేషన్లను ఉపసంహరింపజేసి మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చూశారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తీవ్ర అసంతృప్తితో, బర్తరఫ్ వేటుతో బయటకు వచ్చిన కొండా సురేఖ.. కేసీఆర్ పాలనను, ఆయన వ్యక్తిత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తడం వెనుక రాజకీయ ప్రాధాన్యత ఉందనే విశ్లేషణలు మొదలయ్యాయి. కేసీఆర్‌పై సురేఖ చేసిన సానుకూల వ్యాఖ్యల నేపథ్యంలో కొండా దంపతులు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి... బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందా? అనే ప్రచారం జోరందుకుంది.

## హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవు

అని ఆయన అన్నారు. అయితే, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తాయని సూచనప్రాయంగా చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.

## తెలంగాణలో కొత్తగా చేయూత పింఛన్లు

దరఖాస్తుల పరిశీలన సమయంలో మాత్రం కచ్చితంగా సమర్పించాలని సూచించారు. గీత కార్మికులకు అబ్కారీశాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరణ పత్రం లేకున్నా ఆధార్, రేషన్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవచ్చు.ఒంటరి మహిళలకు తహసీల్దారు ధ్రువీకరణ పత్రం కావాలి.. దివ్యాంగులకు సదరం, యూడీఐడీ, చేనేత కార్మికులకు సంబంధిత శాఖ ఏడీ ధ్రువీకరణ పత్రం ఉండాలి. దరఖాస్తు సమయంలో ఈ ధ్రువీకరణ పత్రం లేకపోయినా పర్లేదని.. పరిశీలన సమయంలో మాత్రం సమర్పించాలని సూచించారు. గతంలో పింఛన్లు వచ్చి, ఆ తర్వాత ఆయా కారణాలతో ఆగిపోయిన వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. పరిశీలన సమయంలో మాత్రం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువును కూడా పొడిగించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి జులై 31తోనే గడువు ముగిసింది.. కానీ సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు చేయని చాలామంది ఉన్నారు.. వారి అభ్యర్థన మేరకు గడువు పొడిగించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా 2.50 లక్షల మందికి కొత్త పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించింది. చేయూత పథకం కింద కొత్త సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆగస్టు 9వ తేదీ నుంచి 5 కేటగిరిల్లో దరఖాస్తులు తీసుకుంటున్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి ఎంపిక ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్లు నిర్వహిస్తారు. రాష్ట్రంలో చేయూత పథకం కింద కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆగస్టు 30 వరకు మొత్తం 4.34 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా 2.64 లక్షల మంది వితంతువుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. అయితే ప్రభుత్వం గడువు పెంచడంతో మరో 50వేలకుపైగా దరఖాస్తులు వస్తాయని అచంనా వేస్తున్నారు,

## రేవంత్ రెడ్డిని ఆపకపోతే మీరు ఇంట్లో కూర్చోవాల్సిందే

బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇచ్చామని, అది నిజం అన్నారు. కానీ తాను పదే పదే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కూడా చెబుతూనే ఉండేవాడినన్నారు. రేవంత్ రెడ్డి దూకుడును అడ్డుకోండి.. లేకపోతే మీరంతా ఇళ్లలోనే కూర్చోవాల్సి వస్తుందని చెప్తుండేవాడనన్నారు. "ఇప్పుడు ముఖ్యమైన విషయం ఏమిటంటే... సీఎం సాబ్, మీరు కాస్త మరీ ఎక్కువ మర్యాదస్తుడిగామారిపోయారు. కాస్త మీ పాత దూకుడు చూపించండి, ప్రజల్లోకి రండి. మిమ్మల్ని ఏ విషయం ఆపుతోందో నాకైతే అర్థం కావడం లేదు. హనుమంతరావు సాబ్, మీరేమైనా చెబుతారా వచ్చి? నేను చెప్పింది తప్పు కాదు కదా? మీరు కూడా నాతో ఏకీభవిస్తున్నారు కదా... మీరు ఒప్పుకుంటున్నారు... మీరొక సీనియర్ నాయకులు, మీరే ఒప్పుకున్నారంటే ఇక అంతే, నేను సరైన మాటే చెప్పాను. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్ మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని, యావత్ తెలంగాణ రాష్ట్రం సంపూర్ణ ప్రగతి సాధించాలని మేము మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము" అని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఆయన సోదరుడు, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీపై ప్రశంసలు కురిపించారు. దేశభక్తి విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఓవైసీ ఏమీ తక్కువ కాదన్నారు. అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం దేశానికి వ్యతిరేకమనే ప్రచారం కేవలం కొందరి దుష్ప్రచారం మాత్రమేనన్నారు. సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారి తీశాయి. అసదుద్దీన్ ఓవైసీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. తాను సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్బరుద్దీన్ ఓవైసీ, అసదుద్దీన్ ఓవైసీలతో కలిసి పాతబస్తీ అభివృద్ధిపై చర్చించినట్లు చెప్పారు. గతంలో ఎంతమంది సీఎంలు ఓల్డ్ సిటీకి వచ్చారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. పాతబస్తీ అభివృద్ధికి అసదుద్దీన్ ఓవైసీ ఏ ప్రతిపాదన తీసుకొచ్చినా పరిశీలించి నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తున్నట్లు చెప్పారు.

## కొండా సురేఖను తొలగించారు..

ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

## కేబినెట్‌లోకి రాములమ్మ..!?

సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడంతో ప్రస్తుతం రేవంత్ రెడ్డి కేబినెట్‌లో సీతక్క ఒక్కరే మహిళా మంత్రిగా ఉన్నారు. దీంతో సురేఖ స్థానంలో మరో మహిళా నేతకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ తరఫున పలువురు మహిళా ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ.. విజయశాంతికి అవకాశంఇవ్వాలనే ఆలోచన రాష్ట్ర నాయకత్వంలో ఉన్నట్లు తెలుస్తోంది. పాలకుర్తి ఎమ్మెల్యే మమిడాల యశస్వినీ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. తెలంగాణ రాజకీయాల్లో ఫైర్‌బ్రాండ్ నేతగా విజయశాంతి గుర్తింపు పొందారు. గతంలో బీఆర్ఎస్‌లో ఎంపీగా పనిచేసిన ఆమెకు ఆ పార్టీ రాజకీయాలు, నేతల వ్యవహారశైలిపై మంచి అవగాహన ఉందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొనే విషయంలో విజయశాంతి వంటి బలమైన వాయిస్ కేబినెట్‌లో ఉంటే పార్టీకి ప్రయోజనం చేకూరుతుందని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ నిర్ణయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా సమాధానం ఇవ్వగల నేతగా ఆమెను పరిగణిస్తున్నట్లు సమాచారం. మంత్రి పదవిపై చర్చల నేపథ్యంలో విజయశాంతి ఢిల్లీకి వెళ్లనున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. హైకమాండ్ పెద్దలను కలిసి తన రాజకీయ భవిష్యత్తు, మంత్రి పదవిపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ విజయశాంతికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. పార్టీపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయకుండా.. అప్పుడప్పుడు రాజకీయ అంశాలపై తనదైన శైలిలో స్పందిస్తూ వస్తున్నారు. దీంతో ఆమెకు మంత్రివర్గంలో అవకాశం ఇస్తే పార్టీకి మరింత బలమైన స్వరం లభిస్తుందని రాష్ట్ర నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. అన్నింటికంటే ఆసక్తికరంగా.. విజయశాంతి కేబినెట్‌లో చేరితే హోంశాఖ కావాలని కోరుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. మరోవైపు కేబినెట్‌లోకి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను తీసుకునే అంశం కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కేబినెట్‌లో రెండు ఖాళీలు ఉండగా.. తాజాగా కొండా సురేఖ బర్తరఫ్‌తో మొత్తం ఇద్దరు లేదా ముగ్గురు కొత్త ముఖాలను మంత్రివర్గంలోకి తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు సీనియర్ మంత్రుల శాఖలను మార్చే అవకాశాలపై కూడా కాంగ్రెస్ నాయకత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే విజయశాంతికి నిజంగానే మంత్రి పదవి దక్కుతుందా.. దక్కితే ఆమె కోరుకుంటున్న హోంశాఖనే కేటాయిస్తారా.. అనే అంశాలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## జలాశయాల్లో తగినంత నీళ్లు లేవు

సమావేశంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పూర్తి స్థాయి బోర్డు సమావేశంలో తేల్చాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని నీటి నిల్వలపై చర్చించేందుకు హైదరాబాద్ జలసౌధలో జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ కాంబోజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీ నరసింహమూర్తితో పాటు రెండు రాష్ట్రాలకు చెందిన ఇంజినీర్లు హాజరయ్యారు. ప్రస్తుత నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, శ్రీశైలం--నాగార్జునసాగర్ జలాశయాల పరిస్థితి, నీటి విడుదలపై సమావేశంలో చర్చ జరిగింది. కృష్ణా జలాల పంపిణీపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మరోసారి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రెండు రాష్ట్రాలు తమ వాదనలు బలంగా వినిపించడంతో సమావేశాలు వాడివేడిగా సాగింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సహా ఇతర మార్గాల ద్వారా ఎక్కువ నీటిని తరలించుకుంటున్నారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. శ్రీశైలం వద్ద తెలంగాణ జలవిద్యుత్ ఉత్పత్తి చేసి దిగువకు నీటిని వాడుకుంటున్నారని ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. నీటి వాటా విషయంలో ఇరు రాష్ట్రాలు తమ తమ వాదనలకే కట్టుబడటంతో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఈ అంశాలను సెప్టెంబర్ నాలుగో వారంలో నిర్వహించే బోర్డు పూర్తి స్థాయి సమావేశంలో విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా తెలంగాణ తరుపున పాల్గొన్న ఈఎన్సీ సభ్యుడు రమేష్ బాబు మాట్లాడుతూ తాగునీటిపై త్రిసభ్య కమిటీ సమావేశంలో చర్చ జరిగిందని వివరించారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం చేరో 50శాతం వాటా తీసుకోవాలని తెలంగాణ కోరగా ఏపీ పాత పద్ధతిన 66:34 వాటా లెక్కన పంపిణి చేయాలని డిమాండ్ చేసిందని వెల్లడించారు. 66:34 నిష్పత్తి డిమాండ్ ను మూడేళ్లుగా తాము అంగీకరించడం లేదని తెలిపారు. ఇప్పటికే పోతిరెడ్డిపాడు నుంచి ఏపీ నిబంధనలకు విరుద్ధంగా నీళ్లను తీసుకపోతోందని, ఇప్పుడు వెలిగొండ నుంచి కూడా నీరు తీసుకుంటున్నారని వివరించారు. మొత్తం తెలంగాణ 200 టీఎంసీలు, ఏపీ 100 టీఎంసీలను అడిగిందని అన్నారు. సెప్టెంబర్ నాలుగో వారంలో జరిగే బోర్డు సమావేశంలో పూర్తి స్థాయిలో చర్చిస్తామని పేర్కొన్నారు. ఏపీ ఈఎన్సీ సభ్యుడు నరసింహమూర్తి మాట్లాడుతూ త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదన్నారు. 66:34 నిష్పత్తిలో ఏపీ, తెలంగాణకు నీటి విడుదల ఉత్తర్వులు ఇవ్వాలని కోరామని తెలిపారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం 50:50 నిష్పత్తిలో ఇవ్వాలని తెలంగాణ కోరిందని, వచ్చే ఆగస్టు వరకు 104 టీఎంసీలు కావాలని కోరామని వివరించారు. తెలంగాణ 200 టీఎంసీలు కావాలని కోరిందని, ఆ ప్రతిపాదన సహేతుకం కాదని చెప్పామని వెల్లడించారు. తెలంగాణ అవసరం లేకున్నా శ్రీశైలం వద్ద విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని సమావేశంలో ఆరోపించామన్నారు. తమ వాటా నుంచే పోతిరెడ్డి పాడు, వెలిగొండ ద్వారా నీరు తీసుకుంటున్నామని, ఎవరి వాటా అడగడం లేదని తెలిపారు. రాయలసీమతో పాటు మార్కాపురం, పల్నాడు, ఇతర జిల్లాలకు తాగునీటి అవసరాల కోసం నీరు ఇవ్వాల్సి ఉందని ఆయన అన్నారు.

# సురేఖను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం

బీఆర్ఎస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదని, ఆమెను ఆఖరికి తెలంగాణ భవన్ గేటును కూడా తాకనివ్వబోమని తేల్చిచెప్పారు. పార్టీని వీడి అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేతలను తిరిగి చేర్చుకోబోమని.. వారిలో ఒకరిద్దరికి తప్ప మిగతా ఎవరికీ గులాబీ తలుపులు తెరిచేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో, కాంగ్రెస్ నుంచి ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారంటూ ఆయన సరికొత్త బాంబు పేల్చారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై కూడా జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజగోపాల్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నా ఆయనను బీఆర్ఎస్‌లోకి తీసుకోమని చెప్పారు. ఒకవేళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆయనకు మంత్రి పదవి కట్టబెడితే అది పూర్తిగా డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని సంచలన ఆరోపణలు చేశారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన తీవ్ర ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేసిన ఆయన... రాబోయే శాసనసభ సమావేశాల్లో కాంగ్రెస్ వైఫల్యాలను, ముఖ్యంగా 22ఏ భూముల స్కామ్‌ను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పక్కా వ్యూహాలతో సిద్ధంగా ఉందని వెల్లడించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నా.. ఆయనను తమ పార్టీలోకి తీసుకోబోమని జగదీశ్‌రెడ్డి వెల్లడించారు. ఎన్నికలకు ముందు కోమటిరెడ్డి సోదరులు బీఆర్ఎస్‌లోకి రావాలని ప్రయత్నాలు చేశారని పేర్కొన్న మాజీ మంత్రి.. అయినప్పటికీ ఆ ప్రయత్నాలను తమ పార్టీ తిరస్కరించిందని గుర్తుచేశారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని జగదీశ్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో పలువురు నేతలు బీఆర్ఎస్‌పై, పార్టీ నాయకత్వంపై నేరుగా విమర్శలు చేశారని.. అలాంటి వారిని తిరిగి పార్టీలోకి తీసుకునే విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన జగదీశ్‌రెడ్డి.. సంచలన వ్యాఖ్యలు చేశారు. బర్తరఫ్ చేయాల్సింది కొండా సురేఖను కాదని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సీఎం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వంపై కొండా కుటుంబం అవినీతి ఆరోపణలు చేసిందని.. వాటిపై చర్యలు తీసుకోకుండా కొండా సురేఖపై చర్యలు తీసుకున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, కుంభకోణాలకు పాల్పడుతోందని తాము ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఆధారాలు పంపించామని పేర్కొన్నారు. అయితే ఇవన్నీ బీఆర్ఎస్ నేత చేసిన ఆరోపణలేనని, వాటిపై సంబంధిత సంస్థల అధికారిక నిర్ధారణ వెలువడలేదని గమనించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులుగా ప్రజలను మోసం చేస్తోందని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఆ పార్టీ తీవ్ర అంతర్గత సంక్షోభంలో ఉందని విమర్శించారు. తెలంగాణలో ప్రస్తుతం గోదావరి, కృష్ణా నదుల్లో నీటి లభ్యత ఉన్నందున కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో జరిగిన ఈడీ సోదాలపై కూడా ఆయన ప్రశ్నలు సంధించారు. ఆ దాడులపై ఈడీ ఎందుకు స్పష్టమైన ప్రకటన చేయలేదని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ మంత్రులకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మద్దతు ఉందని ఆరోపించారు. శాసనసభ ఎథిక్స్ కమిటీ నిజాయితీగా వ్యవహరించాలని జగదీశ్‌రెడ్డి కోరారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల నాటికి పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరగకపోయినా.. రెండు తెలుగు రాష్ట్రాల్లో డీలిమిటేషన్ జరిగే అవకాశం ఉందని జగదీశ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, డీలిమిటేషన్ ద్వారా ఆ రాజకీయ పరిస్థితి నుంచి బయటపడవచ్చని చంద్రబాబు భావిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

## పల్లె చెరువులకు కొత్త కళ

సాగునీటి సామర్థ్యాన్ని బలోపేతం చేయడంతోపాటు గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన, ఆహ్లాదకరమైన జీవన వాతావరణాన్ని అందించాలన్న సమగ్ర లక్ష్యంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయి.

**105 చెరువులు... రూ. 50 కోట్ల అంచనా వ్యయంతో పనులు**

రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం మొత్తం అనుగుణంగా పనులను చేపడుతున్నారు. ఈ కార్యక్రమం పూర్తయితే చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతోపాటు సాగు నీటి వనరులు మరింత బలోపేతం కానున్నాయి. అలాగే భూగర్భ జలాల వృద్ధికి తోడ్పడనున్నాయి. చెరువులకు కొత్త రూపు.. ప్రజలకు కొత్త సౌకర్యాలుచెరువుల ఆధునీకరణ ప్రక్రియలో భాగంగా చెరువు గట్ల బలోపేతం, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు, ప్రవేశ ద్వారాల నిర్మాణం, సోలార్ లైట్ల ఏర్పాటు, సిట్టింగ్ బెంచ్‌ల ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కుల ఏర్పాటు చేయడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ ఎయిర్ జిమ్ పరికరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు చెరువుల సుందరీకరణ పనులకు ప్రాధాన్యం ఇస్తూ, వాటిని ప్రజల విశ్రాంతి, ఆరోగ్యం, వినోదానికి అనువైన కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే చిత్తూరు జిల్లా, కుప్పం నియోజకవర్గం పరిధిలోని వెదుళ్ల చెరువు, కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని పండూరు చెరువు, గుంటూరు జిల్లా వెంగళాయపాలెం చెరువు, అనంతపురం జిల్లాలో గుడిశెలపల్లి చెరువు, నెల్లూరు జిల్లాలోని వింజమూరు, శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం తదితర చెరువులు పూర్తి స్థాయి అభివృద్ధి పనులు పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి, రాష్ట్రంలో అమలుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు.

## రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలి.

- మల్లికార్జున్ ఖర్గే ని అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- కుల వివక్షకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ పోరాడుతోంది
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



కామారెడ్డి, సెప్టెంబర్4 : కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేరిపై కుల వివక్షకు పాల్పడిన ఘటనను ప్రశ్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పై కేంద్ర ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి , డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. దేశంలో కుల వివక్షకు, అంటరానితనానికి, మనిషిని మనిషిగా తక్కువ చేసి చూసే విధానాలకు స్థానం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని గంగా జలాలతో శుద్ధి చేశారంటూ వచ్చిన ఘటన తీవ్రంగా ఖండించదగినదని అన్నారు. ఖర్గే ఒక దళిత నాయకుడు కావడం వల్ల ఆయన పాల్గొన్న ప్రదేశాన్ని శుద్ధి చేయాల్సిన పరిస్థితి వచ్చిందని భావించడం అత్యంత దురదృష్టకరం. ఇది కేవలం ఖర్గే ని అవమానించడం కాదు.. రాజ్యాంగాన్ని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను అవమానించడమే అని షబ్బీర్ అలీ అన్నారు. కులం మనిషి పుట్టుకను నిర్ణయించవచ్చు కానీ అతని గౌరవాన్ని నిర్ణయించదు. ప్రతి భారతీయుడికి ఆత్మగౌరవంతో జీవించే హక్కు ఉంది. రాజ్యాంగం ఇచ్చిన సమానత్వాన్ని ఎవరూ కాలరాయలేరుఅని అన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ గొంతును అక్రమ కేసులతో అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని షబ్బీర్ అలీ ఆరోపించారు. ప్రజల తరఫున ప్రశ్నించడం రాహుల్ గాంధీ హక్కు. ప్రశ్నించే గొంతును కేసులతో భయపెట్టాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరింత బలంగా ప్రజల మధ్య నిలబడతారు. రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి" అని డిమాండ్ చేశారు. ఖర్గే ని అవమానించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

కేసీఆర్ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలి

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ఇప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా కూడా ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారు. ప్రజల కోసం పనిచేయని నాయకుడికి ప్రతిపక్ష నాయకుడి పదవి ఎందుకు ప్రజల సమస్యలను పట్టించుకోని కేసీఆర్ వెంటనే ప్రతిపక్ష నాయకుడి పదవికి రాజీనామా చేయాలి" అని షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. కామారెడ్డి ప్రజలను కేసీఆర్ క్షమాపణ కోరాలని అన్నారు. కామారెడ్డి నుంచి పోటీ చేసిన కేసీఆర్.. ఈ ప్రాంత ప్రజలకు ఏం చేశారు వారి సమస్యల గురించి అసెంబ్లీలో ఏం మాట్లాడారు ప్రజలకు చెప్పాలి. వరదలు, భారీ వర్షాలతో ప్రజలు తీవ్రంగా నష్టపోయిన సమయంలో బాధితులను పరామర్శించడానికి కూడా కేసీఆర్ రాలేదు. కేటీఆర్ రాలేదు. బీఆర్ఎస్ నాయకత్వం ప్రజల పక్కన నిలబడలేదు" అని విమర్శించారు. "బీఆర్ఎస్ ఖాతాలో వందల కోట్ల రూపాయల నిధులు ఉన్నాయని చెబుతున్నారు. కామారెడ్డిలో పోటీ చేసిన కేసీఆర్ ఆ నిధుల నుంచి ఈ ప్రాంత ప్రజలకు ఎంత సహాయం చేశారు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా. ప్రజలు దీనిపై సమాధానం కోరుతున్నారు" అని షబ్బీర్ అలీ ప్రశ్నించారు.

వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల మన్ననలు పొందుతున్నాయని షబ్బీర్ అలీ అన్నారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏమి చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో ఏమి చేసింది ప్రజల ముందే చర్చకు మేము సిద్ధంగా ఉన్నాం. పదేళ్ల బీఆర్ఎస్ పాలనను, కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను అభివృద్ధి, సంక్షేమం, విద్య, వైద్యం, రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమం వంటి అన్ని అంశాల్లో పోల్చుకుందాం" అని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులకు మద్దతు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇళ్లు, స్మార్ట్ రేషన్ కార్డులు, విద్యా సంస్థల అభివృద్ధి, ఆరోగ్య రంగంలో మౌలిక వసతుల బలోపేతం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే మా లక్ష్యం" అని షబ్బీర్ అలీ అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఐరేని సందీప్, పీసీసీ జనరల్ సెక్రటరీ ఇంద్రకరణ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, ఖంఆూ చైర్మన్లు గూడెం శ్రీనివాస్ రెడ్డి, అంతంపల్లి సుధాకర్ రెడ్డి, భీమ్ రెడ్డి, నవసిలాల్ నాయక్ , అనంత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షు నరేందర్ రెడ్డి, పాత రాజు, అంకం కృష్ణారావు, ఆశబోయిన శ్రీనివాస్ , రాజా గౌడ్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, బౌజఎ నాయకులు, మహిళా కాంగ్రెస్, ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# సుభాష్ చంద్ర కేసులో ఏం జరుగుతోంది

మీడియా దిగ్గజం, ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియలో కీలక పరిణామం చోటు చేసుకుంది.రూ.22006.57 కోట్ల క్లెయిమ్‌లకు గాను కేవలం రూ.6.5 కోట్ల చెల్లింపు ప్రణాళికకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఈ దివాలా ప్రణాళికకు డివిజన్ బెంచ్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో ఎన్ సీ ఎల్ టీ ప్రెసిడెంట్ జస్టిస్ అనుపిందర్ సింగ్ గ్రేవాల్ నేతృత్వంలో 5 మంది సభ్యుల ప్రత్యేక రాజ్యాంగ బెంచ్ ఏర్పాటు చేశారు. ఎన్‌సీఎల్‌టీ చరిత్రలోనే ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి ఐదుగురు సభ్యుల ప్రత్యేక బెంచ్ సెప్టెంబర్ 1, 2026న ఈ కేసులో నోటీసులు జారీ చేసింది. అశోక్ కుమార్ భరద్వాజ్, రీనా సిన్హాలతో కూడిన రెండవ నంబర్ ఎన్‌సీఎల్‌టీ డివిజన్ బెంచ్ ఈ దివాలా ప్రణాళికపై ఏకాభిప్రాయానికి రాలేకపోయింది. మూడో సభ్యుడైన నిలేశ్ శర్మ ఇచ్చిన స్వతంత్ర ఉత్తర్వు సైతం డివిజన్ బెంచ్‌లోని ఇద్దరితో విభేదించడంతో మేజారిటీ తీర్పు లేనందున ఎటువంటి తుది ఉత్తర్వులు ఇవ్వలేమని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. మెజారిటీ అభిప్రాయం రాకపోవడంతో కేసును ఎన్ సీ ఎల్ టీ ప్రెసిడెంట్‌కు పంపారు.కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 419 (5) ప్రకారం చరిత్రలోనే మొదటిసారిగా 5 మంది సభ్యుల ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో జస్టిస్ అనుపిందర్ సింగ్ గ్రేవాల్, జ్యుడీషిల్ సభ్యులు బచు వెంకట్ బలరామ్ దాస్, మహేంద్ర ఖండేల్వాల్, టెక్నికల్ మెంబర్స్ అతుల్ చతుర్వేది, రవీంద్ర చతుర్వేదిలు ఉన్నారు. సుభాష్ చంద్ర వ్యక్తిగత హామీలపై రూ.22,006.57 కోట్ల రుణాలకు సంబంధించి రుణ దాతల క్లెయిమ్‌లపై ఆయన దివాలా పరిష్కార ప్రణాళికకు వెళ్లారు. ఈ క్రమంలో కేవలం రూ.6.5 కోట్లు చెల్లించేందుకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపినట్లు వార్తలు వచ్చాయి. రూ.22 వేల కోట్లకు పైగా అప్పును రూ.6.5 కోట్లతో సెటిల్ చేసేందుకు 80.81 శాతం ఓటింగ్ ఉన్న రుణదాతలు ఆమోదం తెలిపారు. అయితే ఇది దాదాపు 99.97 శాతం రుణాల రద్దుకు దారితీస్తోంది.ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి 19.19 శాతం ఓటింగ్ కలిగిన సంస్థలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలో ఇన్సాల్వెన్సీ అప్పీలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాయి. సుభాష్ చంద్ర, అతని గ్రూప్ చాలా ఏళ్లుగా ఆర్థిక సంక్షోభంతో ఇబ్బంది పడుతోంది. వారి రుణ భారం క్రమంగా పెరుగుతూ వస్తోంది. కంపెనీలు తమ రుణాలను తిరిగి చెల్లించలేకపోయినప్పుడు విషయం కోర్టుకు చేరింది.

నివేదికల ప్రకారం, ఎస్సెల్ గ్రూప్‌కు సుమారు ?22,006 కోట్ల భారీ అప్పు ఉంది. దీన్ని పరిష్కరించడానికి, సుభాష్ చంద్ర కేవలం ?6.5 కోట్ల తిరిగి చెల్లింపు ప్లాన్ ఇచ్చారు. దీనిని ట్రైబ్యునల్ ఆమోదించింది. అంటే రుణాలు ఇచ్చిన బ్యాంకులు తమ రుణాలపై భారీగా నష్టపోవాల్సి ఉంటుంది. ఈ కీలక నిర్ణయం ఆమోదానికి దారితీసిన న్యాయ ప్రక్రియ కూడా చాలా ఆసక్తికరంగా ఉంది. సెప్టెంబర్ 2025లో, ఎన్ సీ ఎల్ టీ కి చెందిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం మధ్య రెండు విభిన్న అభిప్రాయాలు వెలువడ్డాయి. తదనంతరం, ఫిబ్రవరి 2026లో, ఈ విషయాన్ని ట్రైబ్యునల్ మూడో న్యాయ సభ్యుడైన నిలేష్ శర్మకు నివేదించారు. ఆయన ఈ ప్రణాళికను ఆమోదిస్తూ తన నిర్ణయాత్మక తీర్పును వెలువరించారు. అంతకుముందు, నవంబర్ 2024లో, రుణదాతల కమిటీ 80.814 శాతం ఓట్లతో ఈ ప్రణాళికను ఆమోదించింది. దివాలా, బ్యాంక్రప్టసీ కోడ్ ప్రకారం, ఏ ప్రణాళిక ఆమోదానికైనా 75 శాతం మెజారిటీ అవసరం,ప్రజలు తరచుగా ఎన్‌సిఎల్‌టిని ఒక కంపెనీగా భావిస్తుంటారు. కానీ వాస్తవానికి ఇది ఒక ప్రత్యేకమైన పాక్షిక-న్యాయ సంస్థ. దీని పూర్తి పేరు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్. దీనిని కేంద్ర ప్రభుత్వం, కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 408 కింద, 2016 జూన్ 1న అధికారికంగా ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలోని జస్టిస్ వి. బాలకృష్ణ ఎరాడి కమిటీ సిఫార్సుల ఆధారంగా ఈ సంస్థను ఏర్పాటు చేశారు. సాధారణ కోర్టుల ద్వారా కాకుండా, ఒక ప్రత్యేక వేదిక ద్వారా భారత్‌లో వ్యాపార, కార్పొరేట్ వివాదాల పరిష్కారాన్ని వేగవంతం చేయడమే దీని ప్రాథమిక ఉద్దేశ్యం.కార్పొరేట్ ప్రపంచానికి సంబంధించి ఎన్‌సిఎల్‌టి కి విస్తృత శ్రేణి అధికారాలు, బాధ్యతలు ఉన్నాయి. ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐః‌అ, 2016) ప్రకారం, కంపెనీలను దివాలా తీసినట్లు ప్రకటించడం లేదా వాటి రుణాలను పరిష్కరించడం వంటి విషయాలను ఇది విచారిస్తుంది. అంతేకాకుండా, రెండు లేదా అంతకంటే ఎక్కువ కంపెనీల మధ్య విలీనాలు, ఒక కంపెనీని విభజించడం లేదా కార్పొరేట్ పునర్నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాలను కూడా ఇది ఆమోదిస్తుంది. వాటాదారులు, కంపెనీ యాజమాన్యం మధ్య వివాదాలను, లేదా నష్టాల్లో ఉన్న కంపెనీ చట్టపరమైన లిక్విడేషన్‌ను కూడా ఎన్‌సిఎల్‌టి పర్యవేక్షిస్తుంది.క్లెయిమ్‌లోని ప్రతి ?100కి రికవరీ మొత్తం కేవలం మూడు పైసలు మాత్రమే. ఈ కేసు ఒక ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తుతోంది..దివాలాలను పరిష్కరించడానికి, రుణాలను వసూలు చేయడానికి ఒక ఆధునిక చట్రాన్ని సృష్టించేందుకు దివాలా, బ్యాంక్రప్టసీ కోడ్, 2016ను రూపొందించారు. ఈ చట్టం కంపెనీలకు, కార్పొరేట్ రుణగ్రహీతలకు పూర్తిగా వర్తిస్తుంది. అయితే, వ్యక్తులు, భాగస్వామ్య



సంస్థల దివాలా, బ్యాంక్రప్టసీకి సంబంధించిన ఐబిసిలోని పార్ట్ 3, సాధారణ ప్రజల కోసం ఇంకా పూర్తిగా అమలు కాలేదు.ఒక ముఖ్యమైన మినహాయింపు ఉంది. ఐబిసి ??ప్రకారం, ఒక కంపెనీ లేదా భాగస్వామ్య సంస్థ తీసుకున్న కార్పొరేట్ రుణానికి ఒక వ్యక్తి వ్యక్తిగత హామీ ఇచ్చి, ఆ తర్వాత రుణగ్రహీత చెల్లింపులో విఫలమైతే, ఆ వ్యక్తి దివాలా ప్రక్రియను ఎదుర్కోవలసి వస్తుంది. అందుకే పెద్ద కార్పొరేట్ రుణాలకు సంబంధించిన కేసులలో వ్యక్తిగత దివాలా ప్రక్రియలను ప్రారంభించవచ్చు. అప్పుల్లో ఉన్న వ్యక్తి కేవలం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లి దివాలా ప్రకటించుకోలేరు. వారు సాధారణంగా సంబంధిత న్యాయస్థానానికి వెళ్లి, అధికారిక న్యాయ ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది. అప్పులు తీసుకున్న వ్యక్తి ఒక న్యాయవాది సహాయంతో దివాలా కోసం దరఖాస్తు చేసుకోవాలి. అప్పులు ఇచ్చిన సంస్థలు, చెల్లించాల్సిన అప్పులు, ఆస్తులు, ఆదాయంతో సహా తమ ఆర్థిక పరిస్థితికి సంబంధించిన సమాచారాన్ని అందించాలి. ఆ వ్యక్తి తాము నిజంగా తమ ఆర్థిక బాధ్యతలను నెరవేర్చలేకపోతున్నామని, తమ అప్పులు చెల్లించే సామర్థ్యానికి మించి ఉన్నాయని నిరూపించుకోవాలి. ఆ తర్వాత న్యాయస్థానం కేసును విచారిస్తుంది, సంబంధిత పార్టీల వాదనలు వింటుంది. అవసరమైన విచారణలు జరుపుతుంది.దివాలా ప్రకటించడం అంటే కేవలం అప్పుల నుంచి విముక్తి పొందడం మాత్రమే కాదు. ఇది ఒక వ్యక్తి ఆస్తులు, ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్ అవకాశాలపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. ఇందులో అత్యంత ముఖ్యమైన పరిణామం వ్యక్తిగత ఆస్తుల అమ్మకం. అప్పటి పరిస్థితులు, వర్తించే చట్టాలను బట్టి, ఇల్లు, కారు లేదా ఆభరణాలు వంటి ఆస్తులను దివాలా ప్రక్రియలో చేర్చి, రుణదాతలకు చెల్లించడానికి ఉపయోగించవచ్చు. కొన్ని ముఖ్యమైన వస్తువులను కాపాడుకోగలిగినప్పటికీ, దివాలా అంటే ఒక వ్యక్తి తన ఆస్తులన్నింటినీ ఉంచుకొని, అప్పులన్నీ తీరిపోతాయని కాదు. ఒక వ్యక్తి ఆర్థిక ప్రతిష్ట కూడా తీవ్రంగా దెబ్బ తింటుంది. ఫలితంగా భవిష్యత్తులో రుణాలు పొందే సామర్థ్యంపై తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. దీనివల్ల సాంప్రదాయ బ్యాంకింగ్ క్రెడిట్ సేవలను పొందడం కష్టమవుతుంది.

# దుమ్మురేపుతున్న అవకాడో సేల్స్



హైదరాబాద్, సెప్టెంబర్ 4 : నరేంద్ర మోడీ.. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో విపరీతంగా యాక్టివ్ గా ఉంటున్నారు. రకరకాల వీడియోలను ఆయన పోస్ట్ చేస్తున్నారు. యువతరానికి ఆయన దగ్గర కావడానికి మరింత ప్రయత్నాలు చేస్తున్నారు. తద్వారా జెన్ జెడ్ కోపాన్ని చల్లార్చుతున్నారు. ఆ వీడియోలో నరేంద్ర మోడీ రాజకీయాల గురించి మాట్లాడలేదు. ఇతర వ్యవహారాల గురించి చర్చించలేదు. జస్ట్ ఒక పండు గురించి చెప్పారు. అది కూడా అవకాడో పండు గురించి.. ఆ పండు తింటే ఆరోగ్యం బాగుంటుందని ఆయన చెప్పుకొచ్చారు.. వాస్తవానికి నరేంద్ర మోడీ చెప్పిన ఆ పండు మనదేశంలో కొన్ని ప్రాంతాలలో మాత్రమే పండుతుంది. ఇటీవల కాలంలో ఔత్సాహిక రైతులు ఆ పంటను సాగు చేస్తున్నారు. కాకపోతే దిగుబడి గొప్పగా రావడం లేదు.అవకాడో వెస్ట్రన్ దేశాలలో విపరీతంగా పండుతూ ఉంటుంది. అమెరికా నుంచి మొదలు పెడితే రష్యా వరకు చాలా దేశాలు ఈ పండును ఇతర దేశాలకు ఎగమతి చేస్తూ ఉంటాయి. అవకాడో పండు మార్కెట్ విలువ కోట్లలో ఉంటుంది. ఒక నివేదిక ప్రకారం పాశ్చాత్య దేశాలకు సంబంధించిన వారు అవకాడో పండును బ్రేక్ఫాస్ట్.. డిన్నర్ లో ఎక్కువగా వాడుతూ ఉంటారు. పార్టీలు జరిగినప్పుడు ఈ పండుతో రకరకాల వంటకాలు చేసుకొని ఆస్వాదించుకుంటూ తింటారు.అవకాడో పండులు యాంటీ యాక్సిడెంట్లు.. లైకో పీన్.. బీటా కెరోటిన్ వంటివి విపరీతంగా ఉంటాయి. అవకాటిని బి అనే లిపిడ్ ఇందులో అధికంగా ఉంటుంది. ఇది ల్యూకేమియా కణాలను నాశనం చేస్తూ ఉంటుంది. గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మెదడు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. జ్ఞాపకశక్తిని పెంపొందిస్తుంది. ఈ పండు వాడటం వల్ల అల్జీమర్స్ వంటి రోగాలు రాకుండా ఉంటాయి.. అందువల్లే పాశ్చాత్య దేశాలకు సంబంధించిన వారు ఈ పండును విరివిగా తింటూ ఉంటారు. జన్ జెడ్ తరానికి అర్థమయ్యే విధంగా నరేంద్ర మోడీ ఆ వీడియోలో అవకాడో పండు గురించి చెప్పడం విశేషం. అయితే అవకాడో పంట ఉత్పత్తిని పెంచడానికి, సాగును ప్రోత్సహించడానికి కేంద్రం భారీగా కేటాయింపులు చేస్తుండటం విశేషం. మోడీ వీడియో ద్వారా ఈ పంట సాగు మనదేశంలో పెరిగే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పంట సాగు చేసే రైతులకు భారీగా లాభాలు వస్తాయని చెబుతున్నారు.

# కొండా రాజకీయం... ఇప్పుడే మొదలు

హైదరాబాద్, సెప్టెంబర్ 4 : తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం పెద్ద చర్చగా మారింది. మంత్రి పదవిలో ఉన్న సురేఖను సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ నుంచి తప్పించారు. గవర్నర్ కూడా దీనికి ఆమోదం తెలిపారు. ఆ తర్వాత కొండా సురేఖ శాఖలు సీఎం దగ్గరకు చేరాయి. విమర్శలు, వివరణలు, రిపోర్టుల తర్జనభర్జన తర్వాత.. కొండా సురేఖ ఎపిసోడ్‌కు ఎండ్ కార్డ్ పడింది.. దీంతో ఒక్కసారిగా కొండా కుటుంబం రాజకీయ భవిష్యత్తుపై చర్చ మొదలైంది.ఈ గొడవ ఒక్కరోజులో మొదలైంది కాదు. కొండా సురేఖ కూతురు సుష్మిత పటేల్ సీఎం రేవంత్‌రెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేయడంతో అసలు గొడవ మొదలైంది. ముఖ్యంగా పరకాల సీటు విషయంలోనే కొండా కుటుంబానికి, రేవంత్‌రెడ్డి వర్గానికి మధ్య దూరం పెరిగిందనే చర్చ ఉందిపరకాల సీటు విషయంలో సుష్మితకు ఆసక్తి ఉందనే వార్తలు వచ్చాయి. కానీ అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డినే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని రేవంత్‌రెడ్డి చెప్పడంతో సమస్య మరింత పెరిగింది. సురేఖ మాత్రం కూతురు చేసిన మాటలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని చెబుతున్నారు. కూతురు పెద్దదైందని, ఆమె మాటలకు తాను బాధ్యత వహించాల్సిన అవసరం లేదని ఆమె వాదిస్తున్నారు. కానీ కాంగ్రెస్ పెద్దలు మాత్రం పార్టీ విషయంలో క్రమశిక్షణ తప్పక పాటించాల్సిందే అన్న చందంగా వ్యవహరించారు.పరకాల పేరు ఈ గొడవలో పదేపదే వినిపించడం వెనుక రాజకీయ లెక్క ఉంది. కొండా కుటుంబానికి వరంగల్ ప్రాంతంలో చాలా ఏళ్లుగా రాజకీయ పరిచయాలు ఉన్నాయి. అదే సమయంలో రేవంత్‌రెడ్డి అక్కడ తనకు నమ్మకమైన నాయకులను ముందుకు తీసుకెళ్లాలని చూస్తున్నారు. ఇద్దరి దారులు వేర్వేరుగా కనిపించడంతో దూరం పెరిగిందనే మాట వినిపిస్తోంది. సురేఖ కూడా తనను ప్రభుత్వం పక్కన పెడుతోందని గతంలో కొన్ని సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేశారనే వార్తలు వచ్చాయి. అందుకే కూతురు చేసిన వ్యాఖ్యలు ఒక్కటే కారణం కాదని, ముందే కొంత దూరం పెరిగి ఉండొచ్చని రాజకీయంగా చర్చ జరుగుతోంది. అయితే ఇది రాజకీయ అంచనా మాత్రమే.కొండా సురేఖ కూడా మౌనంగా ఉండలేదు. తనను కావాలనే పక్కన పెట్టారని, తనపై కుట్ర జరిగిందని ఆమె ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు, పొంగులేటి



శ్రీనివాస్‌రెడ్డి తదితరులపై కూడా ఆమె ఆరోపణలు చేశారు. అయితే ఇవన్నీ సురేఖ చేసిన ఆరోపణలే. వాటిని నిజమని నిర్ధారించే ఆధారాలు బయటకు రాలేదు. కాంగ్రెస్ మాత్రం పార్టీ నిర్ణయానికి కట్టుబడి ముందుకు వెళ్లింది. దీంతో మంత్రి పదవి పోయింది.ఇక్కడే అసలు రాజకీయం కనిపిస్తోంది. ఇది కేవలం ఒక మంత్రి పదవి పోయిన వ్యవహారం మాత్రమే కాదు. పార్టీలో ఎవరికి ఎంత బలం ఉంది, ఎవరితో ఎవరు కలిసి నడుస్తున్నారు, వచ్చే ఎన్నికల నాటికి ఎవరి మాట ఎంత వరకు చెల్లుతుంది అన్న లెక్కలు కూడా ఇందులో ఉన్నాయి.ఈ వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన ఆరోపణలు కూడా కలకలం రేపాయి. డబ్బుల పంపకానికి సంబంధించిన గొడవ వల్లే సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించారని ఆయన ఆరోపించారు. అవినీతి కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని కూడా ఆయన అన్నారు. అయితే రాజాసింగ్ చెప్పింది ఆరోపణ మాత్రమే. దానికి ఇప్పటివరకు బలమైన ఆధారం బయటకు రాలేదు. సురేఖ కూడా తనపై అలాంటి ఆరోపణలు లేవని చెబుతున్నారు. కాబట్టి ఈ మాటలను రాజకీయ ఆరోపణలుగానే చూడాలి.సురేఖను తప్పించిన తర్వాత ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన పదవుల్లో బీసీ మహిళలకు చోటు కల్పించింది. గద్వాల్ విజయలక్ష్మి, నేరెళ్ల శారద, జీ. సుధారాణిలకు కీలక బాధ్యతలు ఇచ్చారు. ఈ మార్పులను కొందరు రాజకీయంగా చూస్తున్నారు. బీసీ వర్గాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఏర్పడే ప్రభావాన్ని సర్దుబాటు చేసే ప్రయత్నంగా కొందరు భావిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఇదే కారణంతో ఈ నియామకాలు చేసిందని అధికారికంగా చెప్పలేదు.తెలంగాణలో మంత్రి పదవిలో ఉండగానే బయటకు వెళ్లాల్సి వచ్చిన సందర్భాలు గతంలోను ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో 2015లో తాటికొండ రాజయ్యను మంత్రి పదవి నుంచి తప్పించారు. ఆ తర్వాత 2021లో ఈటల రాజేందర్‌ను కూడా కేబినెట్ నుంచి తొలగించారు. ఈటలపై భూముల విషయంలో ఆరోపణలు రావడంతో ఆయన శాఖను తీసుకుని, ఆ తర్వాత కేబినెట్ నుంచి బయటకు పంపారు. ఈ ఆరోపణలను ఈటల ఖండించారు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కూడా ఆయన అప్పట్లో చెప్పారు. ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం కూడా అదే వరుసలో మరో రాజకీయ ఘటనగా మారింది. అయితే మూడు ఘటనలకు మూడు వేర్వేరు కారణాలు ఉన్నాయి. అందుకే వాటిని ఒకే గాటన కట్టడం సరికాదు.మంత్రి పదవి పోయిందంటే కొండా కుటుంబం రాజకీయంగా అయిపోయిందని చెప్పలేం. వరంగల్ ప్రాంతంలో కొండా కుటుంబానికి ఇంకా పరిచయాలు, అనుచరులు ఉన్నారు. సురేఖకు కూడా తనకంటూ రాజకీయ బలం ఉంది. అందుకే ఇప్పుడు అందరి చూపు కొండా కుటుంబం తర్వాత ఏం చేస్తుందనే దానిపైనే ఉంది. కాంగ్రెస్‌లోనే ఉండి ముందుకు వెళ్తారా, కొంతకాలం మౌనంగా ఉంటారా, లేక మరో దారి చూసుకుంటారా అన్నది కాలమే చెప్పాలి.మొత్తానికి కూతురు చేసిన వ్యాఖ్యలతో మొదలైన గొడవ, పరకాల సీటు దగ్గర పెరిగిన దూరం, పార్టీలో పెరిగిన గ్యాప్, చివరకు మంత్రి పదవి పోయే వరకు వెళ్లింది. కానీ ఇంతటితో కొండా సురేఖ రాజకీయ కథ ముగియలేదు. కుర్చీ పోయింది. ఇక కొండా కుటుంబం వేసే తర్వాతి అడుగే తెలంగాణ రాజకీయాల్లో అసలు ఆసక్తికరమైన అంశంగా మారనుంది.

# సవాళ్లలో వేడెక్కిన రాజకీయం



మెదక్, సెప్టెంబర్ 4, : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యర్థి బీఆర్‌ఎస్‌పై విసిరిన కేసీఆర్ రాజీనామా డిమాండ్ తెలంగాణ రాజకీయాల్లో కొత్త వేడిని రాజేసింది. ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారనే విమర్శలతో కేసీఆర్‌ను ఆత్మరక్షణలోకి నెట్టేందుకు కాంగ్రెస్ ఈ పావు కదిపినప్పటికీ, ఇది పొరపాటున నిజమైతే ఉత్పన్నమయ్యే పరిణామాలు అధికార పక్షానికి సవాలుగా మారే అవకాశముంది. కేసీఆర్ నిజంగానే గజ్వేల్ నియోజకవర్గానికి రాజీనామా చేసి ఉపఎన్నికను ఆహ్వానిస్తే, అది కాంగ్రెస్ ప్రభుత్వ ప్రస్తుత పాలనపై ఒక ప్రత్యక్ష రెఫరెండం గా మారే ప్రమాదం ఉంది.తెలంగాణ రాజకీయ చరిత్రను తిరగేస్తే కేసీఆర్‌కు ఉపఎన్నికల వ్యూహం కొత్తేమీ కాదు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాలంలో కేసీఆర్ రాజీనామాలను ఒక రాజకీయ ఆయుధంగా మలచుకుని, సెంటిమెంట్‌ను రగిలించి విజయం సాధించేవారు. ప్రతీ ఉపఎన్నికను తన ఆధిపత్య నిరూపణకు వేదికగా వాడుకున్న అనుభవం ఆయనది. నేడు కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఉత్పన్నమవుతున్న ఉచిత హామీల అమలు ఆలస్యం, రైతు భరోసా, మౌలిక వసతుల సమస్యల ప్రతికూలతలను ఆసరాగా చేసుకుని కేసీఆర్ గనుక సవాల్‌ను స్వీకరిస్తే, పరిస్థితి కాంగ్రెస్‌కు కత్తిమీద సాము లా మారడం ఖాయం.ఒకవేళ గజ్వేల్ ఉపఎన్నిక అనివార్యమైతే, అది రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చివేస్తుంది. గత లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో పుంజుకుని ప్రధాన ప్రతిపక్ష స్థానం వైపు వేగంగా అడుగులు వేస్తున్న భారతీయ జనతా పార్టీ ఒక్కసారిగా రేసులో వెనుకబడిపోయే అవకాశం ఉంటుంది. సమరం నేరుగా కాంగ్రెస్ వర్సెస్ బీఆర్‌ఎస్ గా రూపాంతరం చెందుతుంది. ఇది గులాబీ దళానికి పోగొట్టుకున్న క్యాడర్ ఉత్సాహాన్ని తిరిగి తెచ్చిపెట్టడమే కాకుండా, బిజెపి ప్రాబల్యాన్ని తాత్కాలికంగా పక్కకు నెట్టి మళ్లీ ప్రధాన పోరు తమదేనని నిరూపించుకోవడానికి ఒక సువర్ణావకాశం అవుతుంది.అయితే కాంగ్రెస్ పార్టీ ఈ సవాల్‌ను తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేదు. అధికారంలో ఉన్నందున ప్రభుత్వ సర్వ శక్తులూ ఉపయోగిస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం కేసీఆర్ ఈ సాహసం చేయరనే ధీమాతోనే ఈ విమర్శలు గుప్పించారు. ఒకవేళ ఉపఎన్నిక వస్తే, గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఓడించడమే లక్ష్యంగా కాంగ్రెస్ భారీ వ్యూహరచన చేస్తుంది. అయితే, అధికారంలో ఉండి ఉపఎన్నికలో ఎదురుదెబ్బ తగిలితే ప్రభుత్వ ప్రతిష్ట దారుణంగా దెబ్బతింటుందనే ఆందోళన కూడా కాంగ్రెస్ పెద్దల్లో అంతర్లీనంగా ఉందనడంలో సందేహం లేదు.కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకుంటారా అనేది అతిపెద్ద ప్రశ్నార్థకం. ప్రస్తుత పరిస్థితుల్లో ఉపఎన్నికకు వెళ్లడం బీఆర్‌ఎస్‌కు క్లిష్టమైన సవాలే. గెలిస్తే ఒక్కసారిగా పార్టీ గ్రాఫ్ ఆకాశాన్ని తాకుతుంది. కానీ పొరపాటున అధికార కాంగ్రెస్ చేతిలో పరాజయం ఎదురైతే బీఆర్‌ఎస్ ఉనికికే అది ప్రమాదకరంగా మారుతుంది. గత సార్వత్రిక ఎన్నికల దెబ్బ నుంచి పార్టీ పూర్తిగా కోలుకోని నేపథ్యంలో, అంతటి పెద్ద సాహసానికి కేసీఆర్ రెడీ అవుతారా అన్నది సందేహమే. రేవంత్ రెడ్డి సవాల్‌తో తెలంగాణ రాజకీయం మరింత రసవత్తరంగా మారింది. కేసీఆర్ రాజీనామా చేసి ఉపఎన్నిక బాట పడితే, అది కేవలం ఒక నియోజకవర్గానికే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీల భవిష్యత్తును, రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహాలను తేల్చే అగ్నిపరీక్షగా మారడం ఖాయం గులాబీ బాస్‌ను నైతికంగా ఆత్మరక్షణలోకి నెట్టి, కేడర్‌లో నైరాశ్యాన్ని మరింత పెంచాలనేది అధికార పక్షం వ్యూహంగా కనిపిస్తున్నప్పటికీ, రాజకీయ విశ్లేషకులు మాత్రం దీన్ని కాంగ్రెస్ వేస్తున్న అతి పెద్ద జూదంగానే భావిస్తున్నారు. కేసీఆర్ ఒకవేళ ఊహించని విధంగా ఈ సవాల్‌ను స్వీకరిస్తే, అది రేవంత్ రెడ్డి సర్కారుకు ముళ్లబాటగా మారే ప్రమాదముంది.సార్వత్రిక ఎన్నికల్లో విజయం, అధికార యంత్రాంగం చేతిలో ఉండటం రేవంత్ రెడ్డిలో దూకుడును, విపరీతమైన ఆత్మవిశ్వాసాన్ని పెంచాయనడంలో సందేహం లేదు. 'కేసీఆర్ ఎలాగూ రాజీనామా చేసే సాహసం చేయరు' అన్న గుడ్డి ధీమాతోనే కాంగ్రెస్ ఈ డిమాండ్‌ను తెరపైకి తెచ్చినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే రాజకీయాల్లో అతి విశ్వాసం ఎప్పుడూ ప్రమాదకరమే. ఒకవేళ కేసీఆర్ గజ్వేల్‌కు రాజీనామా చేసి ఉపఎన్నికను ఆహ్వానిస్తే, ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి నేటివరకు రేవంత్ పాలనపై అది నేరుగా ప్రజా రెఫరెండంగా మారుతుంది.ప్రస్తుతం క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని సంక్షోభాలను ఎదుర్కొంటోంది. ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, రైతు భరోసా నిధుల విడుదల, రైతు రుణమాఫీ ప్రక్రియలోని సాంకేతిక చిక్కులు, పింఛన్ల పెంపు వంటి అంశాలపై ప్రజల్లో అసహనం మొదలవుతోంది. పాలనాపరమైన ఈ ఒత్తిళ్లను బేరీజు వేసుకోకుండా కేసీఆర్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే లక్ష్యంగా రాజీనామా డిమాండ్ చేయడం రేవంత్ వ్యూహాత్మక తప్పిదమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.తెలంగాణ ఉద్యమ చరిత్రలో కేసీఆర్ రాజీనామాలను ఒక రాజకీయ బ్రహ్మాస్త్రంగా మలచుకున్న నాయకుడు. 2004 నుంచి 2014 వరకు ఎంపీ, ఎమ్మెల్యే పదవులకు కేసీఆర్, ఆయన సహచరులు పదేపదే రాజీనామాలు చేసి, ఉద్యమ సెంటిమెంట్‌తో ఉపఎన్నికల్లో అఖండ విజయాలు సాధించిన రికార్డు ఉంది. ప్రజా వ్యతిరేకత కాస్త మొదలవుతున్న సమయంలో కేసీఆర్ గనుక బరిలోకి దిగితే, "తెలంగాణ తెచ్చిన నన్ను అధికార కాంగ్రెస్ అణగదొక్కాలని చూస్తోంది" అన్న సెంటిమెంట్‌ను రగిలించే అవకాశం ఉందిగజ్వేల్ కేసీఆర్‌కు కంచుకోట. హ్యాట్రిక్ విజయాలు సాధించిన ఆ నియోజకవర్గంలో ఆయనకు గట్టి పట్టుంది. పైగా గత ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ పార్టీ మూడే స్థానంలో నిలిచింది. ఈ ఉపఎన్నిక అనివార్యమైతే, అది కాంగ్రెస్‌కు కత్తిమీద సాములా మారుతుంది. అధికార పక్షంగా సర్వశక్తులూ ఒడ్డి కేసీఆర్‌ను ఓడించేందుకు రేవంత్ సర్కారు ప్రయత్నించినా, ఫలితం ఏమాత్రం తేడా కొట్టినా ఆ ప్రభావం నేరుగా రేవంత్ రెడ్డి సీఎం కుర్చీపై, కాంగ్రెస్ ప్రభుత్వ మనుగడపై పడుతుంది.లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో భారతీయ జనతా పార్టీ గణనీయంగా పుంజుకుని, తామే ప్రధాన ప్రతిపక్షమనే భావనను కలిగించే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ సైతం బీజేపీనే ప్రధాన శత్రువుగా చిత్రీకరిస్తూ బీఆర్‌ఎస్‌ను కాలగర్భంలో కలిపేసే వ్యూహాన్ని అమలు చేస్తోంది. కానీ గజ్వేల్ ఉపఎన్నిక జరిగితే, దృశ్యం ఒక్కసారిగా మారిపోతుంది. బీజేపీని పూర్తిగా పక్కకు నెట్టేసి, రాజకీయం అంతా కాంగ్రెస్ వర్సెస్ బీఆర్‌ఎస్ అన్నట్లుగా మారుతుంది. ఉపఎన్నికలో కేసీఆర్ విజయం సాధిస్తే, అది నిస్తేజంలో ఉన్న గులాబీ కేడర్‌కు బూస్టర్ డోస్ ఇవ్వడమే కాకుండా, రాష్ట్రంలో తమ ప్రాబల్యాన్ని పునరుద్ధరించుకోవడానికి సువర్ణావకాశాన్ని ఇస్తుంది. అదే జరిగితే, రేవంత్ రెడ్డి స్వయంగా కోరి కష్టాలు కొనితెచ్చుకున్నట్లవుతుంది. అయితే, ఉపఎన్నికలో ఒకవేళ ఓడిపోతే బీఆర్‌ఎస్ ఉనికికే ముప్పు వస్తుందన్న భయం కేసీఆర్‌కు కూడా ఉంది. కానీ కేసీఆర్ రాజకీయ చదరంగంలో ఎలాంటి నిర్ణయమైనా ఆకస్మికంగా తీసుకుంటూ ఉంటారు. రేవంత్ రెడ్డి విసిరిన ఈ సవాల్ కేసీఆర్‌ను దెబ్బతీయడం కంటే, కాంగ్రెస్ పార్టీని ఒక క్లిష్టమైన రాజకీయ సుడిగుండంలోకి నెట్టే ప్రమాదమే ఎక్కువగా కనిపిస్తోంది. రేవంత్ విసిరిన ఈ పాచిక కేసీఆర్ స్వీకరిస్తే, తెలంగాణ రాజకీయం భీకర సమరానికి వేదిక కావడం ఖాయం.

# చిన్నన్నకు పెద్ద అవమానం..!

- యువజన కాంగ్రెస్ నేత నుంచి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి వరకు
- నలభై ఏండ్ల ప్రస్థానం నట్టేట్ల ముంచిన్రుడ
- పార్టీ లైన్ తప్పటంతో హైకమాండ్ చర్యలు
- ప్రశ్నార్థకంగా మారిన చిన్నారెడ్డి రాజకీయ భవిష్యత్





వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 4(విజన్ ఆంధ్ర)

వనపర్తి నియోజక వర్గంలో విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీ తో జిల్లెల చిన్నారెడ్డి తన అనుబంధాన్ని పెనవేసుకున్నారు. పార్టీ తో పాటు ఆయన ఎదుగుతూ రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్రవేసుకున్నారు. తాను అనుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఆశయం కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ని సైతం ఎదురించి పోరాటం చేశారు. నలభై రెండు మంది తెలంగాణ ఎమ్మెల్యేలను కూడగట్టి టీపీసీసీ పేరుతో డిల్లీ లో తెలంగాణ వాణీ వినిపించారు. దీంతో వైస్సార్ ఆగ్రహానికి గురై మంత్రి గా అవకాశం కోల్పోయారు. ఆ తరువాత తెలంగాణ లోని పెండింగ్ ప్రాజెక్ట్ లన్నీ మంజూరు చేయించుకున్న తరువాత మళ్ళీ వైస్సార్ తో కలిసి రాష్ట్ర కేబినెట్ లో చేరి సమైక్య రాష్ట్రంలో 14 నెలల పాటు గ్రామీణాభివృద్ధి శాఖ పగ్గాలు చేపట్టారు. ఇలా ఎంతో మంది ముఖ్యమంత్రులతో చిన్నారెడ్డి పనిచేస్తూ తాను అనుకున్న వాటిని సాధించుకున్నారు.

### కాలానుగుణంగా మారని నేత

గత 40 దశాబ్దాలుగా చిన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీ జెండాను భుజాలపై మోస్తూ ఆ పార్టీ తోపాటు తాను ఎదుగుతూ వచ్చారు. ముఖ్యంగా వనపర్తి నియోజకవర్గంలో చిన్నారెడ్డి తనదైన శైలిలో విలువలతో కూడిన రాజకీయాలకు నిలువుటద్దంగా నిలిచారు. ఎవరిపై నేరుగా దూషణలు చేయకుండా పరోక్ష విమర్శలతో ప్రతిపక్ష పార్టీల మెప్పు సైతం ఆయన పొందగలిగారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడి తో కూడా ఆయన కాంగ్రెస్ పార్టీ లో కలిసి పనిచేయటంతో రాజకీయాల్లో అపార అనుభవం సంపాదించారు. కాంగ్రెస్ పార్టీలో ఇటీవలి కాలంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. కాలనుగుణంగా మారుతున్న మార్పులను ఆయన గమనించలేకపోవడం, ఆయన మారకపోవడం చిన్నారెడ్డి పతనానికి మొదటి అడుగు పడింది. ప్రస్తుత రాజకీయ రణరంగంలో డబ్బు ప్రధాన పాత్ర పోషిస్తుండడం, బరిలో దిగే నాయకుడు రూ. లక్ష ఖర్చు పెట్టి పది లక్షలు సంపాదించే మార్గాన్ని అనుసరించాలన్న ప్రాథమిక సూత్రాన్ని చిన్నారెడ్డి గ్రహించలేక పోయారు.సముద్రం లాంటి కాంగ్రెస్ పార్టీలో తన సీనియార్టీ మాత్రమే పనిచేయదని కాలనుగుణంగా రాజకీయంలో మారకపోవడం చిన్నారెడ్డి కి పెద్ద మైనస్ గా మారిపోయింది. ఎంతో సీనియార్టీ ఉందని చెప్పుకోవడంతో పాటు వనపర్తి నియోజక వర్గ అభివృద్ధికి తాను ఏం చేశాడో ప్రజల్లో కూడా చెప్పుకోదగ్గ అంశాలు లేక పోవడంతో నియోజక వర్గ ప్రజలు సైతం కొత్త నీటి కోసం ఎదురు చూశారు.అంతే కాకుండా బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకతతో పాటు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి లాంటి వ్యక్తి ని డీకొట్టాలంటే మార్పు తప్పదని నియోజక వర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం మార్పు కోరుకోవడం వనపర్తి నియోజకవర్గంలో అప్పట్లో సంచలనంగా మారింది.రాజకీయ వార్తలు చదవండి

### వనపర్తి టికెట్ మార్పుతో అంచనాలు తలకిందులు

వనపర్తి నియోజకవర్గంలో తనను కాదని అధిష్టానం మరొకరికి టికెట్ ఇస్తుందని కలలో కూడా ఊహించలేదు. అలాంటి పరిస్థితి లో అనూహ్యంగా 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కొత్తవారికి ప్రాధాన్యత ఇస్తూ వచ్చింది. సీనియర్లను కాదని చాల చోట్ల అసెంబ్లీ టికెట్లు కొత్త వారికి కేటాయించింది. వనపర్తి విషయానికొస్తే చిన్నారెడ్డి కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటూ వచ్చారు. మొదట చిన్నారెడ్డి కి టికెట్ ఇస్తున్నట్లు ప్రకటించినా ఆ తర్వాత అప్పటి పరిస్థితుల్లో చేసిన సర్వే ఫలితాల ఆధారంగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన మేఘారెడ్డికి టికెట్ ఇవ్వాల్సి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మేఘారెడ్డి అభ్యర్థిత్వాన్ని అంగీకరించి ఆయన గెలుపు కోసం పని చేసిన చిన్నారెడ్డి ఆ తరువాత పదెపదే తనకు టికెట్ ఇవ్వలేదని ప్రస్తావించటం, ఏకంగా ఏఐసీసీ పై ఆరోపణలు చేయటం వెనక చిన్నారెడ్డి వ్యూహం ఏంటో ఎవ్వరికి అర్థం కావడం లేదు. తాను ఎలాంటి వ్యాఖ్యలు చేసినా కాంగ్రెస్ హై కమాండ్ చర్యలు తీసుకోలేరని అనుకున్నారాడ? ఉద్దేశ పూర్వకంగా పార్టీ లైన్ దాటాలని అనుకున్నారా..? ఏదో ఒక కారణంతోనే వ్యూహాత్మకంగా వ్యవహరించారా అన్నది అందరిలో ఉన్నసందేహాలే. కాని ఎంతో సీనియర్ నాయకులైనా పార్టీ లైన్ దాటితే చర్యలు ఉంటాయన్న సంకేతాన్ని మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డి విషయంలో కాంగ్రెస్ హైకమాండ్ స్పష్టం చేసింది.తన వ్యాఖ్యలతో కేబినెట్ హోదా స్థాయి పదవిని మాత్రం చిన్నారెడ్డి కోల్పోవాల్సి వచ్చింది.ఈ నేపథ్యంలో చిన్నారెడ్డి రాజకీయాల్లో ఎదురీదుతూ తన ప్రాబల్యాన్ని నిలుపుకుంటారా? లేక వయోభారంతో ప్రస్తుత అవమానాన్ని భరిస్తూ రాజకీయాల నుండి తప్పుకుంటారా? చిన్నారెడ్డిని నమ్ముకున్న కార్యకర్తల పరిస్థితి ఏంటన్న అంశం కూడా ప్రస్తుతం వనపర్తి నియోజక వర్గంలో చర్చనీయంగా మారింది.



# ప్రేమకు నిదర్శనం... అనుబంధానికి ఆదర్శం!

## కంటికి రెప్పై... ప్రతి అడుగులో తోడై!

వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 4(విజన్ ఆంధ్ర)

కాలం వేగంగా మారుతోంది. చిన్న చిన్న కారణాలకే మానవ అనుబంధాలు దారి తప్పుతున్నాయి. స్వల్ప మనస్పర్థలకే బంధాలు తెగిపోతున్న ఈ రోజుల్లో, ఆ దంపతుల జీవన ప్రయాణం నిజమైన ప్రేమకు, నమ్మకానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. భర్తకు కళ్ళు లేవని తెలిసి కూడా ఆ భార్య ఆయన చేయి వదల్లేదు. అతనికి దారి కనిపించకపోతే... తానో దారిగా మారి ముందుండి నడిపిస్తోంది.

### అడుగులో అడుగై... గుండెల్లో ధైర్యమై...

ఆమె అతనికి కేవలం చేయి అందించి నడిపించడం లేదు... అతని జీవితాన్నే తన చేతుల్లో పెట్టుకుని బాధ్యతగా నడిపిస్తోంది. భర్త ప్రతి అడుగులోనూ నీడలా తోడుంటూ, ఎదురయ్యే ప్రతి కష్టంలోనూ కొండంత ధైర్యాన్ని నింపుతోంది. కళ్ళు లేని అతని జీవితానికి తానో కాంతిరేఖలా మారి వెలుగులు పంచుతోంది.

### బంధం అంటే ఇదిగో ఇలా ఉండాలి!

ఆమె అతనికి చూపుగా మారింది అన్నది ఎంత నిజమో... “అనుబంధం అంటే ఎలా ఉండాలి“ అనే జీవిత సత్యాన్ని ఈ సమాజానికి చాటిచెబుతోందన్నది అంతే నిజం. క్లిష్ట పరిస్థితుల్లోనూ చెరగని చిరునవ్వుతో భర్తకు తోడుగా నిలుస్తున్న ఈ భార్యాభర్తల బంధం మానవత్వానికి మహోన్నత శిఖరం. ఆమె కేవలం ఒక భార్య మాత్రమే కాదు... చూపు లేని భర్త జీవితాన్ని సరికొత్త వెలుగుల వైపు నడిపిస్తున్న ‘దారి చూపిన దేవత‘.

# తెలంగాణ మేర కుల రాష్ట్ర కమిటీ ఎన్నిక



హైదరాబాద్, సెప్టెంబర్ 4:లి బాగ్‌లింగంపల్లి, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం నాడు మేర కుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ మేర సంఘం రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత కొన్నేళ్లుగా ఎన్నో ఆటంకాలతో పరిష్కారం కాని ఎన్నికల సమస్యను సభ్యుల సహకార, సమన్వయంతో ఎన్నిక ప్రక్రియ సజావుగా జరిగింది. అధ్యక్షుడిగా కీర్తి రాజగోపాల్, ప్రధాన కార్యదర్శిగా శీలం కోటి రవి, గౌరవ అధ్యక్షులు గా కరాటే కృష్ణ, కోశాధికారిగా సింగు విష్ణు, జాయింట్ సెక్రెటరీ మరియు అధికార ప్రతినిధి గా మునగాల రాము గార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర మేర కార్పొరేషన్ చైర్మన్ సంఘ వెంకటరాజం , వైస్ చైర్మన్ మాడిశెట్టి లక్ష్మీనారాయణ గార్ల ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ప్రక్రియ జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలు, జోన్లు, పట్టణాల నుంచి మేర సంఘాల మాజీ, ప్రస్తుత అధ్యక్ష, కార్యదర్శులు, మేధావులు, పెద్దలు పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ సంఘ వెంకట రాజ్యం మాట్లాడుతూ సమన్వయంతో జాతిని ఏకం చేసేవాడే, వివాదాలకు దూరంగా ఉండేవాడే నిజమైన నాయకుడని అన్నారు. అనంతరం మేర సంగం లో పరిస్కారం కానీ అనేక సమస్యల పై చర్చించడం జరిగింది. ఉప్పల్ భగాయత్‌లో వివిధ కులాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్న నేపథ్యంలో మేర ఆత్మగౌరవ భవన నిర్మాణంపైనా, అలాగే వివిధ కుల కార్పొరేషన్లకు చైర్మన్లతో పాటు డైరెక్టర్ల నియామకంపైనా సమావేశంలో చర్చించారు.



# నేడు వనపర్తికి మంత్రి సీతక్క రాక

- రూ.69 కోట్ల హ్యామ్ రోడ్ల పనులకు పైలాన్ ఆవిష్కరణ
- కాంగ్రెస్ శ్రేణులతో భారీ ర్యాలీ..
- వనపర్తి రాజీవ్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 4(విజన్ ఆంధ్ర)

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క శనివారం వనపర్తి జిల్లాకు రానున్నట్లు వనపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో హ్యామ్ ప్రాజెక్టులో భాగంగా రూ.69 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రోడ్లకు సంబంధించిన పైలాన్‌ను ఆమె ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి తదితరులు పాల్గొననున్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు వనపర్తి క్యాంపు కార్యాలయం నుంచి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. కొల్లాపూర్ నుంచి వనపర్తికి చేరుకునే మంత్రి సీతక్కకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలకనున్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా, గాంధీ చౌక్ మీదుగా చిట్యాల రోడ్డులో ఏర్పాటు చేసిన హ్యామ్ ప్రాజెక్టు పైలాన్ స్థలానికి భారీ ర్యాలీగా చేరుకోనున్నారు. పైలాన్ ఆవిష్కరణ అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా రాజీవ్ చౌరస్తాకు చేరుకుని కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కావడం లేదని వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం పిలుపునిచ్చాయి. మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మార్కెట్ యార్డు ప్రతినిధులు, పీసీసీ సభ్యులు, సింగిల్ విండో అధ్యక్షులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.





# వనపర్తి మాస్టార్‌కు.. ‘జపాన్’ పిలుపు!

## విదేశీ విద్యా పర్యటనకు ఎంపికైన పి.మురళీకృష్ణ

### నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజన్ ఆంధ్ర దినపత్రిక ప్రత్యేక కథనం



వనపర్తి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 4(విజన్ ఆంధ్ర) : తరగతి గదిలో సృజనాత్మక బోధనకు ప్రాధాన్యమిచ్చే ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం దక్కింది. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం యాపర్ల ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ (గా+లు) పి.మురళీకృష్ణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక జపాన్ విద్యా అధ్యయన పర్యటనకు ఎంపికయ్యారు. సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రారంభమయ్యే ఈ పర్యటనకు వనపర్తి జిల్లా నుంచి ఎంపికైన ఏకైక ఉపాధ్యాయుడు ఆయనే కావడం విశేషం.







### అధ్యయనం చేసే ప్రధాన అంశాలు

జపాన్ పాఠశాలల్లో అమలవుతున్న ఆధునిక విద్యా విధానాలను నేరుగా పరిశీలించి అధ్యయనం చేయడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. ప్రాథమిక స్థాయి నుంచే సాంకేతికతపై విద్యార్థులకు ఆసక్తి పెంచే బోధనా రీతులు. స్వీయ క్రమశిక్షణ, నిత్య జీవితంలో అవసరమయ్యే నైపుణ్యాల శిక్షణ.. ప్రయోగాత్మక విధానాల ద్వారా విజ్ఞాన శాస్త్రాన్ని అందించే పద్ధతులు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, సాంకేతిక అవగాహనను పెంపొందించేందుకు జపాన్ పర్యటన ఎంతగానో ఉపయోగపడుతుందని మురళీకృష్ణ తెలిపారు. అక్కడి ఉత్తమ బోధనా పద్ధతులను అధ్యయనం చేసి మన పాఠశాలల్లో అమలు చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. ఉపాధ్యాయ దినోత్సవం నాడే ఈ పర్యటన ప్రారంభం కావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ మిత్రులు ఆయనకు అభినందనలు తెలిపారు.





# శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న పి. శ్రీశైలం యాదవ్

**- భక్తిశ్రద్ధలతో వేడుకలు.. ప్రజలకు జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపిన 293వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు**



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర): శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని సురారం డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో 293వ జీహెచ్ఎంసీ సురారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి. శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ.. శ్రీకృష్ణ పరమాత్ముని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో శాంతి, సంతోషం, ఆయురారోగ్యాలు, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించిన నిర్వాహకులు, కాలనీ సభ్యులు, యువతను ఆయన అభినందించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పి. శ్రీను, సత్యనారాయణ, యాదగిరి, బాలమల్లేష్, గోపాల్ , భక్తులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు హిందువుల ఐక్యతకు ప్రతీక

**- ఉత్సవాలను ఘనంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలి**

**- మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు**





కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర): సనాతన హిందూ ధర్మంలో వినాయక చవితి, 11 రోజుల గణేష్ ఉత్సవాలు హిందువుల ఐక్యత, సామరస్యానికి ప్రతీకలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల సతీష్ అన్నారు. రాబోయే గణేష్ ఉత్సవాలను కుత్బుల్లాపూర్ అసెంబ్లీ పరిధిలో ఘనంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. చింతల్‌లోని జై కన్వెన్షన్ బ్యాంక్వెట్ హాల్‌లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో డివిజన్ కమిటీల విస్తృతస్థాయి సమావేశం ఆకుల సతీష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సమితి సెంట్రల్ కమిటీ సెక్రటరీ రమేష్ బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

***హిందువులంతా సంఘటితం కావాలి***

హైదరాబాద్‌లో గత 49 సంవత్సరాలుగా గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కీలకంగా పనిచేస్తోందని రమేష్ బాబు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దేవాలయాలు, గణేష్ మండపాల నిర్వాహకులు, వివిధ హిందూ సంఘాలు, కాలనీ పెద్దలతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. అన్ని డివిజన్లలో కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి, ఉత్సవాల నిర్వహణలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని ఆయన పిలుపునిచ్చారు. భక్తి, శాంతి, సామరస్యంతో గణేష్ ఉత్సవాలను నిర్వహించి హిందూ ఐక్యతను చాటాలని కోరారు.

***9 నిమజ్జన పాయింట్ల వద్ద ప్రత్యేక బాధ్యతలు***

ఆకుల సతీష్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా మండప నిర్వాహకులు, అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ గణేష్ ఉత్సవాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ పరిధిలో 8 మంది కో-కన్వీనర్లు, 11 మంది డివిజన్ కన్వీనర్లు, డివిజన్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే 9 నిమజ్జన పాయింట్ల వద్ద ప్రత్యేక బాధ్యులను నియమించి అధికారులతో సమన్వయం చేస్తున్నామని తెలిపారు.

***10లోగా ఏర్పాట్లు పూర్తి చేయాలి***

గణేష్ ఉత్సవాల సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన ఏర్పాట్లను ఈ నెల 10వ తేదీలోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరినట్లు ఆకుల సతీష్ తెలిపారు. గణేష్ మండపాల ఏర్పాటు, విద్యుత్, పోలీస్ అనుమతుల విషయంలో నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా నిర్వాహకులు, అధికారులు, స్థానిక ప్రజలు పరస్పరం సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అసెంబ్లీ కో-కన్వీనర్లు జై శంకర్, కట్ట కుమార్, పులి బలరాం, గరిగే శేఖర్, అరుణ్ రావు, మల్లారెడ్డి, మహిళా ఇన్‌చార్జ్ సుహాసిని శక్తి, లీగల్ ఇన్‌చార్జ్ శివానంద్, కో-ఇన్‌చార్జ్ కోడి ఆదిత్య, డివిజన్ కన్వీనర్లు పోలబోయిన శ్రీనివాస్, కృష్ణారెడ్డి, సతీష్ సాగర్, నాగరాజు, విఘ్నేష్ ముదిరాజు, రామ్ సాయి యాదవ్, శంకర్, పరుశు వేణు, మాధవులు, శరత్ గౌడ్, పెద్దలు కంది శ్రీరాములు, వేణుగోపాల్, వేణు గౌడ్, వివిధ డివిజన్ల కో-కన్వీనర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిమ్స్ లో వైద్య చికిత్సకు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ ఎల్వోసీ అందజేత...



నిజామాబాద్ సెప్టెంబర్04:(విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నియోజకవర్గంలో పేదవారికి నిమ్స్ లో చికిత్స పొందేందుకు ఎల్వోసీ అందజేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎల్వోసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులైన వారికి ఎల్ఓసి ఇప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. నగరంలోని వర్ని రోడ్ కు చెందిన సుధీర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారన్నారు. దీంతో నిమ్స్ లో చికిత్స కోసం రూ.5 లక్షల ఎల్వోసీ వారి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. పార్టీలకతీతంగా పేదల ప్రాణాలను కాపాడటమే తన లక్ష్యమన్నారు. అలాగే హైదరాబాదులోని బీ బీ నగర్ ఎయిమ్స్ లో అత్యాధునిక సేవలు అందుబాటు వచ్చాయన్నారు. పేదలు దీర్ఘకాలిక వైద్య సమస్యలు ఉన్నవారు, అత్యవసర శస్త్రసికిత్సలు అవసరమైన వారు ఎయిమ్స్ కి వెళ్లాలని సూచించారు.

# అభివృద్ధి వెయ్యి రోజుల్లోనే చేసి చూపించాం

**- అభివృద్ధిని ఓర్వలేకే ప్రతిపక్షాల అసత్య ఆరోపణలు**

**- జిల్లా డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి**




గద్వాల సెప్టెంబర్ 4( విజన్ ఆంధ్ర బ్యూరో) : గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల్లోనే చేసి చూపించిందని,ఈ అభివృద్ధిని ఓర్వలేకనే ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని డీసీసీ ప్రజా బంగ్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నూటికి 90 శాతం అమలు చేసిందని తెలిపారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో ప్రజలకు జరిగిన మేలేమీ లేదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు,ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందించే ప్రక్రియను చేపట్టిందని తెలిపారు.గ్రామాల్లో ప్రధాన సమస్యగా ఉన్న అంతర్గత రహదారుల నిర్మాణంతో పాటు, మండల ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న ప్రధాన రహదారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కోట్లా రూపాయల నిధులతో రోడ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపిందని రాజీవ్ రెడ్డి వివరించారు.అలాగే ఉన్నత విద్యను పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత కోసం పోలీస్, ఫారెస్ట్ తదితర శాఖల్లో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిపక్షాలు రాజకీయ కోణంలో చూడకుండా ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ఇకనైనా అసత్య ఆరోపణలు మానుకొని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.దకాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు గమనిస్తున్నారని రాజీవ్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్లు గట్టు గౌస్, మద్దిలేటి,జనరల్ సెక్రటరీలు శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్, సంకాపురం రాముడు, మధు నాయుడు,కాకులారం నర్సింహులు,నగేష్,టిపిసిసి సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ధరూర్ రవి,నరేందర్,ఉప్పల్ తిమ్మరెడ్డి,ఆయా మండల అధ్యక్షులు,ఎర్రవల్లి నర్సిరెడ్డి,లక్ష్మేందర్ రెడ్డి, ఆంజనేయులు,రాజు, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ పోరు బాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు




అలంపూర్ సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర) : బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాట ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 మోసాలు 1000 రోజుల విఫల పాలన పై అలంపూర్ శాసనసభ్యులు విజయుడు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు శుక్రవారం అలంపూర్ చౌరస్తా, ఎర్రవల్లి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ పోరు బాట కార్యక్రమంలో భాగంగా భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అలంపూర్ చౌరస్తా, ఎర్రవల్లి మండల కేంద్రంలో భారీ నిరసన సదస్సు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ చేస్తుంది దోపిడి పాలన

**- మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు**



మంచిర్యాల సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర) కాంగ్రెస్ ప్రభుత్వ। ప్రజా రక్షణ పేరుతో బక్షిస్తుంద నీ మంచిర్యాల కలెక్టరేట్ ను 10వేలమందితో ముట్టడిస్తాం 22ఏ భూములు నిషేధత ఆంక్షల తో ప్రజల జీవితాలు విధ్వంసం జరుగుతుందనీ నిషేధిత సర్వే భూమి లో సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని తొలగించి మిగతావారి ని ఇక్కట్లు పెట్టడం ఏంటి నీ మంచిర్యాలలో 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం పై మండి పడ్డారు వ్యవసాయెతర ఇళ్ల స్థలాలు 10 వేల బాధితులు ఇబ్బందులు పడుతున్న వైనం సీఎం రేవంత్ కు చట్టం వర్తించదా అని ఎద్దేవా చేశారు మామూలు ప్రజల పై రెవెన్యూ మంత్రి పొంగులేటి దాష్టిక చర్య అని బాధితులు పక్షాన గులాబీ పార్టీ పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు సింగరేణి కార్మికులను అన్ని విధాల నిండా ముంచారు వెయ్యి రోజుల పాలన మోసాలు కుట్రలు దాడులు వంచన హస్తం పాలన సాగుతుంద నీ కలెక్టర్ ఆర్డిఓ ఎమ్మార్వో జాబితాను తయారు।చేయడం పై మండి పడ్డారు వెంటనే నిషేధ జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేశారు మంచిర్యాలలో బాధితుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో మండిపడ్డరూ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు మంచిర్యాల కేంద్రంలోని కూరల మార్కెట్లో గులాబీ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో మీడియా తో హరీష్ రావు మాట్లాడారు ఈకార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు రాష్ట్ర నాయకులు విజిత్ రావు తదితరులు పాల్గొన్నారు

# శ్రీకృష్ణుడి బోధనలు స్ఫూర్తిదాయకం

**- బండారి లక్ష్మారెడ్డి**

**- ధర్మం, శాంతి, సౌభ్రాతృత్వం కోసం ఆచరించాలి**

**- జమ్మిగడ్డలో రాధాకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు**



కాప్రా/సెప్టెంబర్ 4(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : శ్రీకృష్ణుడి జీవితం, బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ధర్మాన్ని కాపాడుతూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణుడి బోధనలను ఆచరించాలని సూచించారు. కాప్రా సర్కిల్ డాక్టర్. ఏ.ఎస్.రావునగర్ డివిజన్ పరిధిలోని జేమ్మిగడ్డలో శ్రీ రాధాకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో రమేశ్ యాదవ్ శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, తదితరులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బి.ఎల్.ఆర్. మాట్లాడుతూ రాధాకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. శ్రీకృష్ణుడి బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమని మాజీ కార్పొరేటర్లు పేర్కొన్నారు. ధర్మం, సత్యం, న్యాయం కోసం పోరాడే స్ఫూర్తిని శ్రీకృష్ణుడి జీవితం అందిస్తుందని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏటా నిర్వహించడం ద్వారా యువతలో మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని అన్నారు.దసంఘం అభివృద్ధికి, స్థానిక ప్రజల సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వేడుకలను విజయవంతం చేసిన శ్రీ రాధాకృష్ణ యాదవ సంఘం సభ్యులను పలువురు ప్రముఖులు అభినందించారు. జైజవాన్ కాలనీ తిరుమలయ్య యాదవ్ సహకారంతో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాధా కృష్ణ యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**- అల్వాల్ సీఐ ప్రశాంత్**



అల్వాల్, విజన్ ఆంధ్ర , సెప్టెంబర్ 4: రానున్న గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అల్వాల్ సీఐ ప్రశాంత్ కోరారు.శుక్రవారం ఓల్డ్ అల్వాల్ లోని విబిఆర్ గార్డెన్‌లో గణేష్ మండప నిర్వాహకుల తో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపు, నిమజ్జనం సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పోలీసులకు సహకరించాలని కోరారు.డీజేలు, లౌడ్ స్పీకర్ల వినియోగంలో నిబంధనలు పాటించాలని, అర్ధరాత్రి తర్వాత శబ్ద కాలుష్యం ఉండకూడదని తెలిపారు. ప్రతి యూత్ అసోసియేషన్ తమకు కేటాయించిన ప్రాంతంలో శాంతిభద్రతలకు కట్టుబడి ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రాఘవేంద్ర రెడ్డి రామకృష్ణ వివిధ కాలనీల గణేష్ మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

# పెంచిన పెన్షన్లను అర్హులకు అందించాలి



మందమర్రి, సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన పెన్షన్ పథకాన్ని తక్షణమే అర్హులైన లబ్ధిదారులకు అందించాలని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల దగా పాలనను ఎండగడుతూ స్థానిక రామకృష్ణాపూర్ సింగరేణి సిఈఆర్ క్లబ్ వేదికగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో బాల్క సుమన్ మాట్లాడారు. మోసపూరితమైన హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి వివేక్ వెంకటస్వామినీ నిలదీయాలన్నారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా నాయకురాలు తుల ఉమా,పద్మ,క్యాతన్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ గోడిసెల సంధ్యారాణి,వార్డు కౌన్సిలర్లు,పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంటావార్పు



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 4(విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తి గాంధీచౌక్‌లో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలస రమేష్‌గౌడ్, వనపర్తి మండల అధ్యక్షుడు కే. మాణిక్యం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే వాటిలో అనేక హామీలు ఇంకా అమలు కాలేదని ఆరోపించారు. వృద్ధులు, వికలాంగుల పెన్షన్లు పెంచడంతో పాటు మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, విద్యార్థినులకు స్కూటీలు తదితర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో లేకపోయినా వితంతువులు, హెచ్ఐవీ బాధితులకు ఆసరా పెన్షన్లు అందించిందని నాయకులు గుర్తుచేశారు. పేదలు, వృద్ధులు, ఇతర అర్హులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఆసరా పెన్షన్లను పెంచినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెన్షన్లను మరింత పెంచుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, వెయ్యి రోజులు గడిచినా ఆ హామీ అమలు కాలేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఇకనైనా ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కాజీపేట సోమిడి 62 డివిజన్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కాజీపేట న్యూస్ ( విజన్ ఆంధ్ర ) సోమిడి 62వ డివిజన్‌లో శ్రీ రాధాకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా అభిషేక కార్యక్రమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జక్కుల రమ రవీందర్ యాదవ్ దంపతుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ నిర్వహించారు. అనంతరం చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే ఆడపడుచులు, మహిళలు నిర్వహించిన నృత్య కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణం శ్రీకృష్ణ నామస్మరణతో, భక్తి ఉత్సాహంతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో కాజీపేట యాదవ సంఘం పెద్దలు, యాదవ సోదరీమణులు, మహిళలు, 62వ డివిజన్ కాలనీవాసులు, చిన్నారులు మరియు శ్రీ రాధాకృష్ణ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులందరూ శ్రీ రాధాకృష్ణుల ఆశీస్సులు పొంది, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రైతు కంట కన్నీరు తుడిచేవరకు పోరాటం ఆగదు:కేటీఆర్.

**- మిర్యాలగూడ మహాధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉద్వేగభరిత ప్రసంగం.**



ఉమ్మడి నల్లగొండ బ్యూరో, సెప్టెంబర్ 3,(విజన్ ఆంధ్ర) : "రైతన్న కళ్ల ముందే పంట ఎండిపోతుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు.నీళ్లు విడుదల చేసేవరకు నిద్రపోను, ప్రభుత్వాన్ని నిద్రపోనివ్వను" అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ప్రభుత్వానికి సవాల్ విసిరారు.నీళ్లు లేక కాదు-నిజాయితీ లేక "సాగర్ లో నేడు 180 టీఎంసీల నీరు కళకళలాడుతోంది.కానీ ఎడమ కాలువ కింద రైతు పొలం మాత్రం పగుళ్లు పట్టి ఏడుస్తోంది.ఇది నీటి కొరత కాదు, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి కొరత"అని కేటీఆర్ అన్నారు."కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశానికే అన్నపూర్ణ అయింది.మన మిర్యాలగూడ తెలంగాణ రైస్ బౌల్ గా దేశంలోనే నెంబర్-1 గా నిలిచింది.అలాంటి మాగాణాలునేడునీటికోసం,అలమటిస్తున్నాయంటే ఇది ప్రభుత్వ వైఫల్యం కాదా?"అని ప్రశ్నించారు.రైతు డిక్లరేషన్ ఏమైంది?,"ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్ అని పెద్ద మాటలు చెప్పారు.రెండు లక్షల రుణమాఫీ అన్నారు, బోనస్ అన్నారు,కౌలు రైతుకు భరోసా అన్నారు.ఓట్లు పడ్డాయి,సీట్లు వచ్చాయి.కానీ రైతు గుండెలో మాత్రం ఇంకా గోసే మిగిలింది"అంటూ ఘాటుగా విమర్శించారు.2003 నాటి పోరాట స్ఫూర్తి- మరోసారి,"ఇదే సాగర్ ఎడమ కాలువ కోసం 2003లో నా తండ్రి కేసీఆర్ కోదాడ నుంచి హాలియా వరకు కాళ్లు బొబ్బలు పొక్కేలా నడిచారు.ఆనాడు ప్రభుత్వం మెడలు వంచి నీళ్లు తెచ్చారు.ఆయన స్ఫూర్తితో,ఆయన నడిచిన దారిలోనే నేను మళ్లీ నడవడానికి సిద్ధం.ఇది రాజకీయం కోసం కాదు,రైతు కడుపు నింపడం కోసం" అని ఉద్వేగంగా అన్నారు.రైతులకు భరోసా-అల్టిమేటం,చివరిగా రైతులకు భరోసా ఇస్తూ.."సెప్టెంబర్ 14 వరకు చూస్తాం.షెడ్యూల్ ఇవ్వకపోతే వేలాది మంది రైతులతో నేనే ముందుండి నడుస్తా.మీ పంటకు నీరు వచ్చేవరకు ఈ పోరాటం ఆగదు.అసెంబ్లీలో నిలదీస్తాం,అవసరమైతే బయట నిలబడి కొట్లాడుతాం. రైతుకు అండగా కేసీఆర్ ఉన్నారు,బీఆర్ఎస్ ఉంది" అని భరోసా ఇచ్చారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



మల్కాజిగిరి ,విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 4: అష్టభుజా దేవి ఆలయం వద్ద యశోదా బాలగోకులం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నెల రోజులుగా ప్రతిరోజు నిర్వహించే శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈరోజు తో ముగియడంతో కృష్ణుడి వేషంలో పిల్లలు పెద్దలు స్థానికులు అందరూ పాల్గొన్నారు. యశోద బాలగోకులం ఆధ్వర్యంలో అష్టభుజాదేవి గుడి నుండి శ్రీకృష్ణుడి విగ్రహంతో ఊరేగింపుగా బయలుదేరి విష్ణుపురి మీదగా ఆనంద్ బాగ్ నుండి కానిస్టేబుజా దేవి గుడి వరకు ఊరేగింపు ఘనంగా సాగింది. శ్రీకృష్ణుడు రాధా వేషాలలో పిల్లలు అందరిని అలరించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ శ్రవణ్ విచ్చేశారు , కార్యక్రమంలో యశోద బాలగోకులం సభ్యులు విపిన్, దీపా వాసుదేవన్ , బాబు , కన్నన్ , దాసన్ , ఉమేష్ , రవి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

**- కృష్ణాష్టమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

**- చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలకు ప్రశంసలు**




కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర): శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గణేష్‌నగర్ డివిజన్‌లోని చెరుకుపల్లి కాలనీ, పాపయ్య యాదవ్‌నగర్‌లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెరుకుపల్లి కాలనీలో శ్రీ వంశీకృష్ణ యాదవ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 32 ఏళ్లుగా కొనసాగుతున్న వేడుకల్లో పాల్గొన్న ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పాపయ్య యాదవ్‌నగర్‌లో జరిగిన వేడుకల్లోనూ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్మ ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని కోరారు. శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించిన చిన్నారులతో పాటు కూచిపూడి నృత్యాలు ప్రదర్శించిన బాలలను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు కూన శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, కృష్ణ యాదవ్, వెంకటేష్ యాదవ్, లింగం యాదవ్, ఉత్సవ కమిటీ సభ్యులు, పాపయ్యనగర్ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డి చొరవతో గుత్పా, అలీసాగర్ ఆయకట్టుకు సాగునీటి విడుదలకు అనుమతి

**- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఫోన్ లో సంభాషించిన ఎమ్మెల్యే లు**

**- నీటి విడుదలకు అనుమతి..అధికారులకు ఆదేశం**

**- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా రైతులు**



నిజామాబాద్ సెప్టెంబర్04:( విజన్ ఆంధ్ర) నిజామాబాద్ జిల్లాలోని గుత్పా, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల కింద ఉన్న ఆయకట్టు రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు అందించేందుకు నీటి పారుదల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి చొరవతో నిజాంసాగర్ నుంచి గుత్పా, అలీసాగర్ లిఫ్ట్‌లకు నీటిని విడుదల చేసేందుకు శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో ప్రధానంగా వరి పంట సాగవుతుండగా, పంటలు కీలకమైన పొట్టదశలో ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. గుత్పా, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల పరిధిలోని ఆయకట్టుకు నిజాంసాగర్ నుంచే నీటిని విడుదల చేసి, రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని మంత్రిని కోరారు. అలీసాగర్, గుత్పా లిఫ్ట్‌లకు ప్రతి 10 రోజులకు ఒకసారి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం పంటలకు అత్యంత కీలకమైన దశ కావడంతో తక్షణమే నీటి విడుదల చేపట్టాలని వారు మంత్రిని కోరారు. వారి విజ్ఞప్తిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించి, సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే భూపతి రెడ్డి తెలిపారు. ఈ మేరకు అలీసాగర్ ఆయకట్టు పరిధిలోని సుమారు 48 వేల ఎకరాలకు, గుత్పా ఆయకట్టు పరిధిలోని సుమారు 35 వేల ఎకరాలకు కలిపి 83 వేల పైచిలుకు ఎకరాలకు ప్రయోజనం చేకూరేలా నీటిని విడుదల చేయనున్నారు. రోజుకు 1,500 క్యూసెక్కుల చొప్పున 10 రోజుల పాటు నీటిని విడుదల చేసేందుకు నీటిపారుదల శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వరి పంటకు అవసరమైన సమయంలో నీరు అందడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, సాగునీటి విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని భూపతి రెడ్డి తెలిపారు. గుత్పా, అలీసాగర్ ఆయకట్టు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్పందించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డికి జిల్లా రైతులు కృతజ్ఞతలు తెలిపారు. సాగునీటి విడుదలకు అనుమతి లభించడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# రైస్ మిల్లులపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు కొనసాగితే కలెక్టర్‌కు మిల్లుల తాళాలు అప్పగిస్తాం

**- వాస్తవ పరిస్థితులను పరిశీలించి న్యాయం చేయాలి**

**- రైస్ మిల్లర్స్ అసోసియేషన్**




నాగర్‌కర్నూల్ జిల్లా (విజన్ ఆంధ్ర) సెప్టెంబర్ 04 శుక్రవారం : నాగర్‌కర్నూల్ జిల్లాలోని రైస్ మిల్లులపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులను నిలిపివేయాలని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. దాడులు ఆపకపోతే మిల్లుల తాళాలను కలెక్టర్‌కు అప్పగిస్తామని హెచ్చరించారు. జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను డిఫాల్టర్ల నుంచి వసూలు చేయాలని, అందరినీ ఒకే గాటన కట్టి ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి బిల్లాకంటి రవి, కార్యవర్గ సభ్యులు నవీన్, సుధాకర్‌రావు మాట్లాడుతూ... సీఎంఆర్ విషయంలో ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని వాస్తవాలను పరిశీలించాలని కోరారు. రాత్రికి రాత్రే విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మిల్లులపై దాడులు చేయడం, మిల్లర్లను అరెస్టు చేయడం సరికాదన్నారు. జిల్లాలో మొత్తం 145 రైస్ మిల్లులు ఉండగా.. సుమారు 40 మిల్లులు డిఫాల్టర్లుగా ఉన్నాయని అన్నారు. ఇటీవల విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహిస్తూ మిల్లర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు జిల్లాలో ఐదు రైస్ మిల్లులపై దాడులు చేసి విచారణ కొనసాగిస్తున్నారని, కొండారెడ్డిపల్లి గ్రామంలోని ఓ రైస్ మిల్లుపై కేసు నమోదు చేశారని తెలిపారు. పోలీసులు, రెవెన్యూ, పౌరసరఫరాలు, విజిలెన్స్ విభాగాలు కలిసి మిల్లర్ల వ్యవస్థను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత బకాయిలను ప్రస్తుతం నడుస్తున్న మిల్లులపై రుద్దుతున్నారని ఆరోపించారు. వర్కింగ్ చార్జీలు, రవాణా చార్జీలు చెల్లించాలని, వడ్డీ విధింపులోనూ వివక్ష చూపవద్దని కోరారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలు చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అయితే ముందుగా దాడులు నిలిపివేయాలని స్పష్టం చేశారు. 2024-25 సంవత్సరంలో 1.84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి గాను 1.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయిందని మిల్లర్లు తెలిపారు. కేవలం 20 వేల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే మిగిలి ఉందన్నారు. రబీ సీజన్‌లో పోలీసులను పెట్టి బలవంతంగా ధాన్యం లోడ్ చేయించారని ఆరోపించారు. టెస్టింగ్ మిల్లింగ్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సన్నబియ్యం పథకం విజయవంతం కావడంలో రైస్ మిల్లర్ల సహకారం కీలకమని పేర్కొన్నారు. సీఎంఆర్ ఆర్డర్లు ఇవ్వడానికి ప్రభుత్వం మూడు నెలల సమయం తీసుకుందని, ముందుగా దాడులు నిలిపివేయాలని కోరారు. ప్రభుత్వ విధానాల కారణంగా ప్రస్తుతం మిల్లులు మూతపడే పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంఆర్‌పై కలెక్టర్ హామీ ఇచ్చినా అమలు కాలేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల మిల్లర్లు సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మొలకలు వచ్చిన ధాన్యాన్ని కూడా తమకు అప్పగించినప్పటికీ రైతులు, ప్రభుత్వం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సహకరించామని తెలిపారు. గ్రామాల్లో రైతులకు, పేదలకు ఉపాధి కల్పిస్తున్న రైస్ మిల్లర్లపై ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. గోదాములు చూపించకపోవడం కూడా సమస్యలకు కారణమవుతోందని విమర్శించారు. తేమ ధాన్యం వల్లే తమకు నష్టం వస్తోందని, ప్రభుత్వ సొమ్మును ఎగ్గొట్టాలనే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. స్థానిక పరిస్థితులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సూచనలు, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం సేకరణకు సహకరిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో రైస్ మిల్లర్ల యజమానులు ప్రవీణ్, హకీమ్, రాజేష్, మహేష్, వాస వేణు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# కొండ సురేఖ బర్తరఫ్ ను ఖండిస్తూ కళ్ళకు గంతలతో నిరసన



మంచిర్యాల టౌన్ సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర) ఈరోజు మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ మంత్రి పదవి నుండి తొలగించడానికి ఖండిస్తూ కళ్ళకు గంతలతో నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఉన్న జగ్గారెడ్డి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక వర్గం రెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పదవులు అనుభవిస్తూ పార్టీకి వ్యతిరేక కార్యకలాపాలు చేసినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకొని కాంగ్రెస్ అధిష్టానం ఈరోజు బీసీ బిడ్డ కొండ సురేఖ పై తనకు సంబంధం లేని తన బిడ్డ వాక్యాల పట్ల తనపై చర్యలు తీసుకోవడం అమానుషం రాష్ట్ర జనాభాలో 56% ఉన్న బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఖండిస్తున్నాం సామాజిక న్యాయం మాతోటే సాధ్యం అవుతుందని చెప్పి బీసీలకు కాంగ్రెస్ లోనే అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని ప్రగల్బాలు పలుకుతున్న పార్టీ, మరి ఈరోజు బీసీ సమాజానికి సమాధానం చెప్పాలని వారు ప్రశ్నించారు ఇప్పటికైనా కొండా సురేఖ పై తీసుకున్న బర్త్ రఫ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో కొండ సురేఖకు బాసటగా నిలుస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహించడానికి బీసీలుగా బీసీ సంఘాలుగా సిద్ధంగా ఉన్నామని హెచ్చ రించారు ఇట్టి కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, కర్రే లచ్చన్న న్యాయవాది, రాష్ట్ర నాయకులు గజ్జల్లి వెంకటయ్య, తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు మాచర్ల సదానందం, నాయకులు శాఖ పురి భీమ్సేన్, వేముల అశోక్, వేముల కిరణ్, చంద్రగిరి చంద్రమౌళి, ఎండి లతీఫ్, సురేంద్ర చారి, చెలిమెల అంజయ్య, గగ్గూరి రాజన్న తదితరులు పాల్గొన్నారు

## కార్మికుడికి రూ.65 వేల వేతనం ఇప్పించిన బీఆర్‌టీయూ నేత రవి




బాచుపల్లి, సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర): కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి అన్నారు. గచ్చిబౌలిలోని ఓ రెడీమిక్స్ కంపెనీలో పనిచేస్తున్న దిగంబర్‌కు జూలై, ఆగస్టు నెలలకు రావాల్సిన రూ.65 వేల వేతనం చెల్లించకపోవడంతో రవిని ఆశ్రయించాడు. వెంటనే స్పందించిన రవి కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి కార్మికుడికి రావాల్సిన మొత్తం వేతనాన్ని ఇప్పించారు. దీంతో దిగంబర్ కుటుంబ సభ్యులు రవికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో సంక్షేమ సంఘాలకు అండగా ఉంటాం

**- ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**

**- శ్రీనివాస్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే హామీ**



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర): 131-కుత్బుల్లాపూర్ డివిజన్ శ్రీనివాస్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఈశ్వర్ గౌడ్, కమిటీ సభ్యులు విలాస్‌రావు, నర్సాగౌడ్, కృష్ణయ్య, ప్రభు, కృష్ణమోహన్, సత్తిరెడ్డి, వెంకటేష్, మురళి, శంకర్, మల్లికార్జున్, రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

## అన్నెం కోటి రెడ్డికి సంస్థ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు



బాచుపల్లి, సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర): అవంతి నగర్ ఈస్ట్ కాలనీకి చెందిన ప్రముఖ సేవా కార్యక్రమాల నిర్వాహకులు, భక్తి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న అన్నెం కోటి రెడ్డిను సంస్థ వైస్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ జాతీయ వ్యవస్థాపకులు, అధ్యక్షులు ఎ. జైన్ కుమార్ మరియు చైర్మన్ కె.ఎస్. ఆనంద్ రావు సంయుక్తంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన వైస్ ప్రెసిడెంట్ అన్నెం కోటి రెడ్డి మాట్లాడుతూ "మట్టి వినాయకుడిని పూజించండిపర్యావరణాన్ని కాపాడండి" అనే సంస్థ లక్ష్యాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ మన పండుగల విశిష్టతను కాపాడేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన సంస్థ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ, ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని అన్నెం కోటి రెడ్డి ఆకాంక్షించారు.

## కిడ్నీ మార్పిడి చికిత్సకు రూ.5 లక్షల ఎల్.ఓ.సీ అందజేసిన ఏఐసిసి కార్యదర్శి డాక్టర్.ఎస్. ఏ.సంపత్ కుమార్



అలంపూర్ సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర) : అలంపూర్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి మండలం, ఎర్రవల్లి గ్రామానికి చెందిన యం.భగవాన్ జీ రావు కుమారుడు యం.ఉదయ్ సాయి ఇటీవల హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. వైద్య చికిత్సకు అయ్యే ఖర్చుల నిమిత్తం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా రూ.5 లక్షల విలువైన ఎల్ఓసీ పత్రాన్ని మంజూరు చేసింది.ఈ ఎల్.ఓ.సీ పత్రాన్ని అలంపూర్ మాజీ శాసనసభ్యులు, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన అంటే పేద, సామాన్య ప్రజలకు అండగా నిలవడమే లక్ష్యమని అన్నారు. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలు వైద్య ఖర్చుల భారం వల్ల ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వైద్య సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందించిన రూ.5 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీతో తమ కుమారుడి వైద్య చికిత్సకు ఎంతో ఊరట లభించిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుటుంబానికి ఆపద సమయంలో అండగా నిలిచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెబుతూ డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ ఉదయ్ సాయి పూర్తి ఆరోగ్యంతో కోలుకునే వరకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. వైద్య చికిత్సకు సంబంధించి భవిష్యత్తులో కూడా ఏవైనా అవసరాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా వంటా వార్పు - ఉష్కామల శ్రీనివాస్





కాప్రా/సెప్టెంబర్ 04( విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఉష్కామల శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన "వంటా వార్పు" నిరసన కార్యక్రమంలో వంపుగూడ కాలనీ లో నిర్వహించిన వంటా వార్పు ముఖ్య అతిధిగా హాజరైన బైరి నవీన్ గౌడ్ లో.వారికీ సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు నెలకు 2,500, కేసీఆర్ కిట్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలలో తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బద్రుద్దీన్, ఇంద్రయ్య, పల్లెపాత శివలింగం కొండల్ గౌడ్, మహేష్, కొప్పుల కుమార్, గణేష్ ముదురాజ్, సరోజ,తదితరులు పాల్గొన్నారు.

# నేత్ర ప్రపర్వంగా సాగిన "మంజీరనాదం" నాట్య వైభవం



హైదరాబాద్ సెప్టెంబర్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్) : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ప్రముఖ నాట్య శిక్షణా సంస్థ "శివ పార్వతి నాట్య అకాడమీ" వ్యవస్థాపకుడు, డైరెక్టర్, ప్రఖ్యాత నాట్య గురువు చెట్టి నాగ షేకర్,శీలా రమణి నేతృత్వంలో నేత్ర ప్రపర్వంగా నిర్వహించిన "మంజీరనాదం" నాట్య వైభవం కార్యక్రమం ప్రేక్షకులను, నాట్య ప్రియులను విశేషంగా అలరించి సమ్మోహితులను చేసింది. రవీంద్ర భారతి ప్రధాన మందిరం, హైదరాబాద్ వేదికగా గురువారంనాడు ఏర్పాటు చేసిన ఈ "మంజీరనాదం" నృత్యోత్సవంలో నృత్యాన్ని అభ్యసిస్తున్న విద్యార్థులతో పాటుగా గురువు చెట్టి నాగ షేకర్ ఎంతో మధురంగా, కన్నుల పండుగ వివిధ నృత్యాంశాలను చక్కటి అభినయంతో ప్రదర్శించి అందరి హృదయాలను దోచుకున్నారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ నాట్య గురువు డాక్టర్ ఆర్. ప్రసన్న రాణి, ప్రముఖ డాన్స్ డైరెక్టర్ కొరియోగ్రాఫర్ సత్య మాస్టర్ హాజరై మాట్లాడుతూ,తల్లిదండ్రులు పిల్లలకు చదువు తోపాటుగా ఏదో ఒక కళను నేర్పించినట్లైతే ఆ పిల్లలు మంచి ఆరోగ్యంతో, మెరుగైన జీవనశైలితో ఏకాగ్రతతో చదువులో కూడా రాణిస్తారని తెలుపుతూ, చక్కటి నృత్యాలతో అలరించిన ఆకట్టుకున్న కళాకారులను ప్రశంసించారు. ప్రత్యేక అతిథులుగా కె.వి.రమణ రావు, హరినాథ్ రెడ్డి, డా. శ్రీకాంత్ గౌడ్ కొరియోగ్రాఫర్, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ హాజరై కళాకారులను అభినందించి మొమెంటోలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే ప్రముఖ డ్యాన్స్ మాస్టర్లు, గణేష్ మాస్టర్, డాక్టర్ ఎన్. రవి కుమార్, ఈశ్వర్ సమల్, ప్రముఖ నాట్య గురువు ఆకుల వినోద్ కుమార్, థియేటర్ ఆర్టిస్ట్ ఎ.కె. శ్రీదేవి, మెజీషియన్ పానుగంటి వెంకటేష్, జ్యోత్స్న వాసంశెట్టి లను ఈ సందర్భంగా ఘనంగా అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో "శివ పార్వతి నాట్య అకాడమీ" శిష్యులు తమ గురువులు చెట్టి నాగ షేకర్, శీలా రమణి లను ప్రత్యేకంగా సత్కరించి తమ గురుభక్తిని చాటుకున్నారు. ఈ నృత్య వైభవంలో భాగంగా గురువు ఆకుల వినోద్ కుమార్ శిష్యులైన కుమారి ప్రవల్లిక "అదిగో అల్లదిగో"నృత్యాన్ని, కుమారి దీక్షిత "శివ శివ శంకర" నృత్యాన్ని నయనానందకరంగా, అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను రంజింపజేశారు, అందరి ప్రశంశలను అందుకున్నారు.

# కాంగ్రెస్ ను గద్దె దించడమే లక్ష్యం

**- కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్యంపై బీఆర్ఎస్ పోరుబాట**

**- గుడిహత్నూర్ నుండి ఇచ్చోడ వరకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భారీ బైక్ ర్యాలీ**



ఆదిలాబాద్ డెస్క్,సెప్టెంబర్ 03 విజన్ ఆంధ్ర : కాంగ్రెస్ ను గద్దె దించడం లక్ష్యం అని బోథ్ ఏమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు గుడిహత్నూర్ కేంద్రం లో భారీ బైక్ ర్యాలీ తీశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆరోపించారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు, పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన కళ్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం హామీ, విద్యార్థులకు స్కూటీల పంపిణీ వంటి హామీలను వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించిన తీరును ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్పష్టం చేశారు. "1000 రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు హామీలు తప్పడ అమలు చేసింది ఏమీ లేదు. ప్రజల హక్కుల కోసం బీఆర్ఎస్ ప్రశ్నిస్తూనే ఉంటుంది. హామీలు నెరవేర్చే వరకు మా పోరాటం ఆగదు" అని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు ఈ కార్యక్రమం లో నియోజవర్గ బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు

# మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే

**- బోథ్ పట్టణ కేంద్రంలో 1000 రోజుల ప్రజా పాలన సంబరాలు**

**- పాల్గొన్న నియోజవర్గ ఇంచార్జి ఆడే గజేందర్**



ఆదిలాబాద్ డెస్క్,సెప్టెంబర్ 04 విజన్ ఆంధ్ర : రైతులు, మహిళలు, యువత, పేదలు, మైనారిటీలు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోంది ఆడే గజేందర్ అన్నారు బోథ్ మండల కేంద్రం లో శుక్రవారం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా బోథ్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మేరుగు భోజన్న ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజా పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రైతులు, మహిళలు, యువత, పేదలు, మైనారిటీలు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది" అని ఆయన పేర్కొన్నారు రాబోయే రోజుల్లో కూడా ప్రభుత్వ సహకారంతో బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని ఆడే గజేందర్ తెలిపారు అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పటాకులు పేల్చి, స్వీట్లు పంచుకొని 1000 రోజుల ప్రజా పాలన సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో లో ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కుర్మే మహేందర్, నక్కలవాడ సర్పంచ్ నవీన్, జిల్లా కార్యదర్శి వినయ్ రెడ్డి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మేరుగు దాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఆశన్న, జిల్లా ఉపసర్పంచ్‌ల ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రమేష్, తాజా మాజీ ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, వార్డు సభ్యులు షేక్ షాకీర్, పద్మారావు, సోహెల్, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ చట్ల ఉమేష్, బీఎల్ఏ2 సూపర్వైజర్ మొహమ్మద్, నాయకులు బొజ్జ సాయన్న, అచ్యుతానంద రెడ్డి, రాజు రెడ్డి, అబూద్, శ్రీకాంత్ రెడ్డి, రఫీమోద్దీన్, చందు, గడ్డల నారాయణ, హసీఫ్, అభి రెడ్డి, రితేష్ రెడ్డి, సద్దాం, మౌలానా, మేరుగు రమణ, వడ్లకొండ సురేందర్, కోమారి దయాకర్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 1000 రోజుల కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

**- హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వంపై గణేష్ బిగాల ఆధ్వర్యంలో వంట-వార్పు, సదస్సులు**



నిజామాబాద్ సెప్టెంబర్04:( విజన్ ఆంధ్ర ) : నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే శ్రీ గణేష్ బిగాల గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాన్ని నిరసిస్తూ నేడు వంట-వార్పు కార్యక్రమం, సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మహిళలకు నెలకు 2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్‌కు ప్రత్యామ్నాయంగా హామీలు, కళ్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం, మహిళలకు స్కూటీలు వంటి అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? మహిళలకు ఇచ్చిన హామీలు ఎక్కడ? అంటూ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రజా సమస్యలను, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్,నగర అధ్యక్షులు, సిర్ప రాజు,మాజీ చీఖణా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి,సుజిత్ సింగ్, నాగారం నర్సింగ్ , నవీద్ ఇక్బాల్ ,జగత్ రెడ్డి, ప్యాట సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటినుంచి వెళ్లిపోయిన వృద్ధురాలు క్షేమంగా కుటుంబానికి అప్పగింత

**- జీడిమెట్ల పోలీసుల చొరవతో కుటుంబ సభ్యులకు చేరిన 80 ఏళ్ల చంద్రమ్మ**

**- కుటుంబ సమస్యల నేపథ్యంలో ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన వృద్ధురాలిని గుర్తించిన పోలీసులు**



జీడిమెట్ల, సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర): కుటుంబ సమస్యల కారణంగా ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వచ్చిన 80 ఏళ్ల వృద్ధురాలిని జీడిమెట్ల పోలీసులు క్షేమంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల సమయస్ఫూర్తి, చొరవతో వృద్ధురాలు తిరిగి కుటుంబ సభ్యుల చెంతకు చేరడంతో కుటుంబంలో ఆనందం నెలకొంది. జగద్గిరిగుట్టలోని దేవమ్మ బస్తీకి చెందిన చంద్రమ్మ (80), నరహరి భార్య. కుటుంబ సమస్యల నేపథ్యంలో ఆమె ఇంటి నుంచి ఎవరికీ సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లినట్లు తెలిసింది. అనంతరం ఆమె జీడిమెట్ల ప్రాంతంలో తిరుగుతున్నట్లు సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసు సిబ్బంది వెంటనే స్పందించారు. వృద్ధురాలిని గుర్తించిన పోలీసులు ఆమెను జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి వివరాలు సేకరించారు. ఆమె కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం విచారించి, కుటుంబ వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, చంద్రమ్మను ఆమె కుమారుడు ఆలీ యాదగిరికి క్షేమంగా అప్పగించారు. చాలా సేపటి ఆందోళన అనంతరం తమ తల్లి క్షేమంగా తిరిగి ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. వృద్ధురాలిని సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన జీడిమెట్ల పోలీసు సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వృద్ధులు ఇంటి నుంచి బయటకు వెళ్లిన సందర్భాల్లో వారి భద్రతపై కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# ఆరు గ్యారంటీల పేరుతో మహిళలకు అనేక హామీలు ఇచ్చి మహిళలను నిండా ముంచిన రేవంత్ సర్కార్

**- కాంగ్రెస్ ఇచ్చిన 'గ్యారెంటీ కార్డు మోసపూరితం**

**- మోర్తాడ్ వేదికగా వీడియో ఆధారాలతో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కల హామీలను బట్టబయలు చేసిన ఎమ్మెల్యే వేముల**

**- 2500 స్కీమ్ లో ప్రతి మహిళకు రూ. 82,500 కాంగ్రెస్ బాకీ**

**- 2000 నుండి 4000 కు పెంచే పెన్షన్ స్కీమ్ లో ప్రతి పింఛన్‌దారులకు రూ. 66,000 కాంగ్రెస్ బాకీ**

**- బాల్కొండ నియోజకవర్గం లో 5000 మంది మహిళలకు తులం బంగారం' కాంగ్రెస్ బాకీ ?**

**- ఆడపిల్లలకు 'ఎలక్ట్రిక్ స్కూటీలు' ఏవీ?**

**- కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్లను తక్షణమే పునరుద్ధరించాలి..**

**- వేలాది మంది మహిళలు చేతులెత్తించి తీర్మానం**

**- విద్యుత్, ఆర్టీసీ బస్సులలో రాయితీల పేరిట కాంగ్రెస్ సర్కార్ మోసం**

**- ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయ పక్షపాతం వీడి, ప్రజల సమక్షంలో లక్కీడ్రా తీయాలి**

**- గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులను కాంగ్రెస్ బాకీ కార్డులతో నిలదీయండి**

**- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**



నిజామాబాద్ సెప్టెంబర్04:( విజన్ ఆంధ్ర)

ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలను ప్రకటించి, అధికారంలోకి వచ్చాక మహిళలు, వృద్ధులు, విద్యార్థులను నిలువునా ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను గ్రామగ్రామాన ప్రజలు నిలదీయాలని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మోర్తాడ్ మండల కేంద్రంలో నిర్వహించిన భారీ మహిళా సదస్సు మరియు వంటావార్పు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నిరసనలో భాగంగా మహిళల తో వంటా వార్పు లో పాల్గొన్నారు మరియు మహిళలతో కలిసి ఎమ్మెల్యే వేముల బతుకమ్మ ఆడారు.ఎన్నికల వేళ రేవంత్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క ఇచ్చిన వాగ్దానాల వీడియో క్లిప్పింగులను సభావేదికపై ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించి, ప్రజల సాక్షిగా పాలకుల ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. గత కాంగ్రెస్, టీడీపీ పాలనలో పింఛన్ల మంజూరు తీరు అత్యంత దయనీయంగా ఉండేదని వేముల ప్రశాంత్ రెడ్డి గుర్తుచేశారు. గ్రామంలో ఎవరో ఒకరు మరణిస్తే తప్ప మరొకరికి పింఛన్ రాని దుస్థితి ఉండేదని, ఊరికి కేవలం 50 నుంచి 100 మందికి మాత్రమే నామమాత్రంగా రూ. 200 పింఛన్ ఇచ్చేవారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ గారు మానవీయ కోణంలో ఆలోచించి, పింఛను మొత్తాన్ని రూ. 1,000కి, ఆపై రూ. 2,000కి పెంచి గౌరవప్రదమైన జీవనాన్ని అందించారని తెలిపారు. అంతేగాక, దేశంలో ఎక్కడా లేని విధంగా బీడీ కార్మికులకు మోర్తాడ్ గడ్డపై నుంచే మొట్టమొదటిసారిగా కేసీఆర్ పింఛను మంజూరు చేశారని గుర్తుచేశారు. నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్ల భారాన్ని తగ్గించేందుకు కళ్యాణలక్ష్మి పథకం ద్వారా రూ. 1,00,116 అందించడమే కాకుండా, తాగునీటి కోసం మహిళలు పడుతున్న గోసను తీర్చేందుకు మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటి ముంగిటకే నల్లా నీటిని తీసుకొచ్చారని వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచుతూ నాణ్యమైన వైద్యాన్ని, ప్రసవానంతరం 16 వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్, రూ. 12,000 ఆర్థిక సాయం, న్యూట్రిషన్ కిట్లతో పాటు పేద విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య, సన్నబియ్యం భోజనాన్ని అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని, ఎల్బీ స్టేడియంలో తొలి సంతకం పెడతామని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా ప్రజలను నట్టేట ముంచారని వేముల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాటి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఇంటింటికీ తిరిగి ఇచ్చిన గ్యారెంటీ కార్డులను వేదికపై ప్రదర్శిస్తూ ప్రభుత్వం ప్రజలకు పడ్డ బకాయిల లెక్కలను ఎమ్మెల్యే వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఇప్పటివరకూ గడిచిన సమయానికి లెక్కగడితే ప్రతి మహిళకు ప్రభుత్వం రూ. 82,500 బాకీ పడింది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికుల పింఛను రూ. 2,000 నుంచి రూ. 4,000కు పెంచుతామని చెప్పి ఎగ్గొట్టారు. పెంచాల్సిన రూ. 2,000 చొప్పున ప్రతి పింఛన్‌దారునికి ప్రభుత్వం సుమారు రూ. 66,000 బకాయి పడింది. అలాగే దివ్యాంగులకు రూ. 6,000 పింఛన్ ఇవ్వకుండా మొండిచేయి చూపారు. ప్రతి ఇంటికీ రూ. 500కే సిలిండర్ ఇస్తామని చెప్పి, క్షేత్రస్థాయిలో మెజారిటీ ప్రజలకు మొండిచేయి చూపారు. రాయితీ మొత్తం కింద ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సుమారు రూ. 16,500 బాకీ ఉంది. కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ. 1,00,116తో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి మాట తప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి బాల్కొండ నియోజకవర్గంలోనే సుమారు 5,000 మంది ఆడబిడ్డల పెళ్లిళ్లు జరగ్గా, ఒక్కరికీ తులం బంగారం అందలేదు. ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం పేరుతో కాంగ్రెస్ సర్కార్ ప్రజలను తీవ్ర మోసానికి గురిచేస్తోందని వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. 200 యూనిట్ల లోపు వాడకం ఉన్నప్పుడు ఉచితం ఇచ్చి, వేసవిలో వాడకం 200 యూనిట్లు దాటితే టారిఫ్ రేట్లను రెట్టింపు చేసి వేల రూపాయల బిల్లులను బలవంతంగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో నిరంతరాయంగా 24 గంటల కరెంట్ లభిస్తే, ప్రస్తుత పాలనలో రోజుకు నాలుగైదు సార్లు కరెంట్ కోతలు విధించడం శోచనీయమన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పెట్టి, ఆర్టీసీ బస్సు సర్వీసులను సగానికి తగ్గించారని, పల్లెల్లో రద్దీ పెంచి పురుషులపై చార్జీలను రెట్టింపు చేసి కుటుంబాలపైనే అంతిమ భారం మోపుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర బడ్జెట్, అప్పుల స్థితిగతులపై అవగాహన ఉందని వీడియోల్లో స్వయంగా చెప్పిన రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కలు.. ఇప్పుడు అధికారం చేపట్టాక కేసీఆర్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ గారు చేసిన అప్పులతో కాళేశ్వరం, మిషన్ భగీరథ, రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన స్వల్ప కాలంలోనే సుమారు రూ. 4 లక్షల కోట్ల అప్పులు చేసి ఒక్క రోడ్డు గుంత పూడ్చలేదని, ఒక్క చెరువు తవ్వలేదని ఎద్దేవా చేశారు. ఏటా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగ యువతను నమ్మించి, మూడేళ్లలో కేవలం 17 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కాంగ్రెస్ కార్యకర్తలకే ప్రాధాన్యమిస్తూ అధికారులు ఏకపక్షంగా జాబితాలు రూపొందిస్తున్నారని ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో మోర్తాడ్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను రూపాయి లంచం లేకుండా పేదలకు తాళాలు అందజేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం కేటాయించే ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా ప్రజలందరి సమక్షంలో 'లక్కీ డ్రా' ద్వారా మాత్రమే అర్హులైన పేదలకు అందించాలని, లేనిపక్షంలో ఊరుకోబోమని హెచ్చరించారు.

మహిళా సదస్సులో ఏకగ్రీవ తీర్మానాలు ప్రభుత్వానికి డిమాండ్లు: సభకు వేలాదిగా తరలివచ్చిన మహిళల ఆమోదంతో చేతులెత్తించి ప్రభుత్వానికి పలు కీలక డిమాండ్లను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విడుదల చేశారు

1. పేద బాలింతలకు ఆసరాగా నిలిచే కేసీఆర్ కిట్, పోషకాహార కిట్లను తక్షణమే పునరుద్ధరించాలి.
2. మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 చొప్పున పేరుకుపోయిన రూ. 82,500 బకాయిలను వెంటనే జమ చేసి, వచ్చే నెల నుంచి క్రమం తప్పకుండా చెల్లించాలి.
3. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు పింఛను పెంపు బకాయి రూ. 66,000 తక్షణమే చెల్లించి, నెలకు రూ. 4,000 పింఛన్ అందించాలి. అర్హులైన 57 ఏళ్లు నిండిన వారికి, కొత్త కోడళ్లకు, కొత్తగా పీఎఫ్ పొందుతున్న బీడీ కార్మికులకు నూతన పింఛన్లు వెంటనే మంజూరు చేయాలి.
4. కళ్యాణలక్ష్మి కింద పెళ్లిళ్లు చేసుకున్న ఆడబిడ్డలందరికీ ఎన్నికల్లో వాగ్దానం చేసిన తులం బంగారాన్ని వెంటనే పంపిణీ చేయాలి.
5. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన నిరుపేదలందరికీ రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని పూర్తిస్థాయిలో అందించాలి; స్థలం లేని నిరుపేదలకు స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలి.

ఈ డిమాండ్ల తీర్మాన పత్రాన్ని ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపుతున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను బాకీ కార్డులతో నిలదీసి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హెచ్చరించారు. తదనంతరం మహిళలతో కలిసి సహపంక్తి భోజనం చేసారు. ఈ కార్యక్రమంలో వేలాది గా మహిళలు స్వచ్ఛందంగా తరలి వచ్చారు.. అలాగే నియోజక వర్గ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ స్థాపన దివస్ వేడుకలు



మక్తల్, సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లా స్థానిక మక్తల్ పట్టణంలోని మక్తల్ ట్యాంక్ బండ్ నుండి చందాపూర్ వరకు ఇరువైపులా ఉన్న రోడ్డన గతంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ మార్గ్ గా నామకరణం చేయడం జరిగిందని, అలాగే వాసవి మాత చౌరస్తా నేతాజీ మార్గ్ , అంబేద్కర్ చౌరస్తా, బాలగంగాధర్ తిలక్ మార్గ్ నందు ఓంకార ధ్వజ విష్కరణ చేశారు. నారాయణపేట్ రోడ్డు నందు విశ్వహిందూ పరిషత్,బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఘనంగా స్థాపన దివాస్ జరుపుకొన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శ్రీకృష్ణ జన్మాష్టమి రోజే విశ్వహిందూ పరిషత్ ని ఆవిర్భవించడం జరిగిందని,విశ్వహిందూ పరిషత్ అనేక కార్యక్రమాలు తీసుకొని హిందువులలో చైతన్యం చేస్తూ హిందూ జాగృతికి అహర్నిశలు శ్రమిస్తుందని విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షులు కే. సత్యనారాయణ గౌడ్ అన్నారు. రామ మందిరం అయోధ్య శ్రీకృష్ణ దేవాలయం తిరుమల తిరుపతి దేవాలయం రక్షణకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వాకిటి భీమన్న, పట్టణ గౌరవాధ్యక్షులు జుట్ల హనుమంతు, పట్టణ మల్లికార్జునరావు, బజరంగ్ దళ్ ప్రఖండ సంయోజక్ రాహుల్, పరుశరం, తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్ ను ఢీకొని ఆర్టీసీ బస్సు బోల్తా డ్రైవర్ మృతి

**- పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు**


కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 4(విజన్ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం లో జుక్కల్ సమీపంలో ఆర్టీసీ బస్సు ప్రమాదంపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి చేశారు. బస్సు డ్రైవర్ మృతి తీవ్రంగా కలిచివేసింది క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం జుక్కల్ ఎక్స్ రోడ్ దాటి బిచ్కుంద సమీపంలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డిపోకు చెందిన బస్సు నంబర్ యా340030 (ఎక్స్‌ప్రెస్), సర్వీస్ నంబర్ దీజఖ3, హైదరాబాద్ నుంచి బిచ్కుంద వెళ్తుండగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో బిచ్కుంద సమీపంలో రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాద ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఎండీ, జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుతం పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో బస్సు డ్రైవర్ అంజనేయులు బస్సు కింద చిక్కుకుని మృతి చెందడం తనను తీవ్రంగా కలిచివేసిందని మంత్రి పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.బస్సులో మొత్తం 13 మంది ప్రయాణికులు ఉన్నారని, వారందరూ సురక్షితంగా బయటపడ్డప్పటికీ కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. గాయపడిన ప్రయాణికులను అంబులెన్స్‌ల ద్వారా సమీపంలోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు నాణ్యమైన వైద్యం, మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అవసరమైన అన్ని వైద్య సహాయ చర్యలను తక్షణమే చేపట్టాలని సూచించారు.అలాగే, ఆర్ఎం నేతృత్వంలో అధికారులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించాలని, బాధితులకు అవసరమైన అన్ని విధాలుగా అండగా నిలవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పూర్తి వివరాలను తెలుసుకుని, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

## దోమకొండ పోలీస్ స్టేషన్లో గణేష్ ఉత్సవాల శాంతి కమిటీ సమావేశం




కామారెడ్డి బ్యూరో/దోమకొండ, సెప్టెంబర్ 4(విజన్ ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా దోమకొండ పోలీస్ స్టేషన్లో గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా, సోదరభావంతో జరగాలనే ఉద్దేశంతో దోమకొండ పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం ఎస్ఐ ప్రభాకర్ నిర్వహించారు. ఈ సమావేశానికి బిక్కనూర్ సీఐ నరేష్ కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దోమకొండ మండలంలోని వివిధ గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ, గణేష్ ఉత్సవం భక్తితో జరుపుకోవాలి.. నిమజ్జనం ప్రతి ఒక్కరి భద్రతతో జరగాలి అని సూచించారు. ఊరేగింపు, నిమజ్జనం సమయంలో విద్యుత్ ప్రమాదాలు, నీటిలో మునిగిపోవడం, ట్రాఫిక్ సమస్యలు వంటి ఘటనలు జరగకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. “పండుగ మన ఆనందం కోసం.. ఒక్క చిన్న నిర్లక్ష్యం ఆ ఆనందాన్ని విషాదంగా మార్చకూడదు” అని అధికారులు సూచించారు. పోలీస్ శాఖ, ఉత్సవ కమిటీలు, గ్రామ పెద్దలు, ప్రజలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సూచనలు, అభిప్రాయాలను అధికారులు స్వీకరించారు.“భక్తి భద్రత సోదరభావం” అనే స్ఫూర్తితో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించి దోమకొండ మండలం ను ఆదర్శంగా మండలం గా నిలిచేల ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు.

## ‘కాంగ్రెస్‘లో చేరిన బీజేపీ నేత కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి



మల్కాజిగిరి, విజన్ ఆంధ్ర, సెప్టెంబర్ 4: నేరేడ్ మెట్ డివిజన్ కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, డివిజన్ మాజీ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా భర్త కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి శుక్రవారం బీజేపీ పార్టీకి గుడ్ బై చెప్పారు. శుక్ర వారం ఆయన, మల్కా జిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో మల్కాజిగిరి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో శరవేగంగా కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలన చూసి తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతునట్లు చెప్పారు. తనను పార్టీలో చేర్చుకున్న మైనంపల్లి హనుమంత రావుకు ఉపేందర్ రెడ్డి ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎస్ ఆర్ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ ఏ కె మురుగేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్యార ప్రవీణ్, శ్యామ్, సి.శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ నిరసన...




కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 4(విజన్ఆంధ్ర) : రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున ఆధ్వర్యంలో మున్సిపల్ ముందర, ఖర్గే గారిని అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిరసన వ్యక్తం చేశారు. జిల్లా నలుమూలల నుండి కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు తరలివచ్చారు. తెలంగాణ రాష్ట్ర సలహాదారు మహమ్మద్ తాళి షబ్బీర్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు, లైబ్రరీ అధ్యక్షులు మద్ది చంద్రకాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పున్న రాజేశ్వర్, డిసిసి అధ్యక్షులు కైలాస శ్రీనివాసరావు హాజరయ్యారు.

– ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అని మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ పోరాడుతోందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పై కుల వివక్షకు పాల్పడిన ఘటనను ప్రశ్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పై కేంద్ర ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తా, నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. దేశంలో కుల వివక్షకు, అంటరానితనానికి, మనిషిని మనిషిగా తక్కువ చేసి చూసే విధానాలకు స్థానం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని గంగా జలాలతో శుద్ధి చేశారంటూ వచ్చిన ఘటన తీవ్రంగా ఖండించదగినదని అన్నారు. ఖర్గే ఒక దళిత నాయకుడు కావడం వల్ల ఆయన పాల్గొన్న ప్రదేశాన్ని శుద్ధి చేయాల్సిన పరిస్థితి వచ్చిందని భావించడం అత్యంత దురదృష్టకరం. ఇది కేవలం ఖర్గే ని అవమానించడం కాదు.. రాజ్యాంగాన్ని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను అవమానించడమే అని షబ్బీర్ అలీ అన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ పోరాటం చేస్తూనే ఉందని, భవిష్యత్తులో కూడా అదే స్ఫూర్తితో పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కులం మనిషి పుట్టుకను నిర్ణయించవచ్చు కానీ అతని గౌరవాన్ని నిర్ణయించదు. ప్రతి భారతీయుడికి ఆత్మగౌరవంతో జీవించే హక్కు ఉంది. రాజ్యాంగం ఇచ్చిన సమానత్వాన్ని ఎవరూ కాలరాయలేరుఅని అన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ గారి గొంతును అక్రమ కేసులతో అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని షబ్బీర్ అలీ ఆరోపించారు. ప్రజల తరపున ప్రశ్నించడం రాహుల్ గాంధీ హక్కు. ప్రశ్నించే గొంతును కేసులతో భయపెట్టాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరింత బలంగా ప్రజల మధ్య నిలబడతారు. రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి” అని డిమాండ్ చేశారు. ఖర్గే ని అవమానించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

– కేసీఆర్ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలి షబ్బీర్ అలీ

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ఇప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా కూడా ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారు. ప్రజల కోసం పనిచేయని నాయకుడికి ప్రతిపక్ష నాయకుడి పదవి ఎందుకు? ప్రజల సమస్యలను పట్టించుకోని కేసీఆర్ వెంటనే ప్రతిపక్ష నాయకుడి




పదవికి రాజీనామా చేయాలి” అని షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు.కామారెడ్డి ప్రజలను కేసీఆర్ క్షమాపణ కోరాలని అన్నారు.కామారెడ్డి నుంచి పోటీ చేసిన కేసీఆర్.. ఈ ప్రాంత ప్రజలకు ఏం చేశారు వారి సమస్యల గురించి అసెంబ్లీలో ఏం మాట్లాడారు ప్రజలకు చెప్పాలి.వరదలు, భారీ వర్షాలతో ప్రజలు తీవ్రంగా నష్టపోయిన సమయంలో బాధితులను పరామర్శించడానికి కూడా కేసీఆర్ రాలేదు. కేటీఆర్ రాలేదు. బీఆర్ఎస్ నాయకత్వం ప్రజల పక్కన నిలబడలేదు” అని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి భారీగా నిధులు ఉన్నాయని చెబుతున్నప్పటికీ, కామారెడ్డి ప్రజలకు కనీస సహాయం కూడా చేయలేదని ఆరోపించారు. “బీఆర్ఎస్ ఖాతాలో వందల కోట్ల రూపాయల నిధులు ఉన్నాయని చెబుతున్నారు. కామారెడ్డిలో పోటీ చేసిన కేసీఆర్ ఆ నిధుల నుంచి ఈ ప్రాంత ప్రజలకు ఎంత సహాయం చేశారు? ఒక్క రూపాయి అయినా ఇచ్చారా? ప్రజలు దీనిపై సమాధానం కోరుతున్నారు” అని షబ్బీర్ అలీ ప్రశ్నించారు.

– వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం..

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల మన్ననలు పొందుతున్నాయని షబ్బీర్ అలీ అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏమి చేసింది? కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో ఏమి చేసింది? ప్రజల ముందే చర్చకు మేము సిద్ధంగా ఉన్నాం. పదేళ్ల బీఆర్ఎస్ పాలనను, కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను అభివృద్ధి, సంక్షేమం, విద్య, వైద్యం, రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమం వంటి అన్ని అంశాల్లో పోల్చుకుందాం” అని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులకు మద్దతు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇళ్లు, స్మార్ట్ రేషన్ కార్డులు, విద్యా సంస్థల అభివృద్ధి, ఆరోగ్య రంగంలో మౌలిక వసతుల బలోపేతం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే మా లక్ష్యం” అని షబ్బీర్ అలీ అన్నారు.

– జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ,

కుల వివక్షకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో పోరాడుతోందన్నారు. “రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించింది. దళిత నాయకుడైన ఖర్గే ని అవమానించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. రాహుల్ గాంధీపై అక్రమ కేసులు పెట్టి ప్రజల గొంతును అణచలేరు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుంది” అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

– మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ,


పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. “కేసీఆర్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అధికారాన్ని అనుభవించింది. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటోంది” అని అన్నారు. కుల వివక్ష, రాజ్యాంగ వ్యతిరేక చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, రాహుల్ గాంధీ గారిపై అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, గ్రంధాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, సీనియర్స్ ఇలియాజ్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, ఐరేని సందీప్, పీసీసీ జనరల్ సెక్రటరీ ఇంద్రకరణ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, సహకార సంఘం చైర్మన్లు గూడెం శ్రీనివాస్ రెడ్డి, అంతంపల్లి సుధాకర్ రెడ్డి, భీమ్ రెడ్డి, నవసిలాల్ నాయక్ , అనంత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షు నరేందర్ రెడ్డి, పాత రాజు, అంకం కృష్ణారావు, ఆశబోయిన శ్రీనివాస్ , రాజా గౌడ్ , మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ , మాజీ ఎంపీటీసీ నల్ల శ్రీనివాస్ , బల్యాల సుదర్శన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 1000రోజుల ప్రభుత్వ వైఫల్యాలపై బి.ఆర్.ఎస్ వంటావార్పు

**- డాక్టర్.ఏ.ఎస్ రావునగర్ రాధికా చౌరస్తాలో నిరసన.. రోడ్డుపైనే వంటలు, భోజనాలు**

**- మహిళల నృత్యాలు..!**



కాప్రా/ సెప్టెంబర్ 04 (విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : రాష్ట్ర ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏ.ఎస్.రావునగర్ రాధికా చౌరస్తాలో వంటావార్పు నిర్వహించారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కాసం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రోడ్డుపైనే వంటలు చేసి భోజనాలు చేశారు. .ఈ సందర్భంగా చౌరస్తాలోని అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ పాటలకు అనుగుణంగా మహిళలు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. నాయకులు, కార్యకర్తల నినాదాలు, మహిళల నృత్యాలు, బోనాల సమర్పణతో రాధికా చౌరస్తాలో వంటావార్పు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, బండారి నీలంరెడ్డి, కొత్త రామారావు, షేర్ మణమ్మ, బేతాళ బాలరాజు, మురళి పంతులు, పెద్దాపురం కుమారస్వామి, గంప కృష్ణగుప్తా, శ్రీనివాస్‌గౌడ్, రాజేశ్వరి, సత్తమ్మ, చిన్న యాదవ్, షేక్ అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని విమర్శించారు. బిఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రజల పక్షాన తమ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. లిసింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూలి.. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పేదలు, రైతులు, మహిళలు, యువత సమస్యలపై పాలకులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును ప్రజలకు వివరించేందుకు బిఆర్ఎస్ ఉద్యమాలను కొనసాగిస్తుందని అన్నారు.

కాసం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ

1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో అనేకం కార్యరూపం దాల్చలేదని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. 1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలనకు నిరసనగా శుక్రవారం నాడు డాక్టర్ ఏ ఎస్ రావు నగర్ డివిజన్ రాధిక చౌరస్తాలో వంటావార్పు కార్యక్రమం డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున జరిగింది, ఈ కార్యక్రమానికి లిముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డిలి విచ్చేసి వంట వార్పు కార్యక్రమంలో పాల్గొని, కాంగ్రెస్ వెయ్యి రోజుల అసమర్థ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలో ఉన్నాయని ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజులు లెక్కపెట్టుకొని, ఇంట్లో కూర్చోవాలని, వచ్చే ప్రభుత్వం బిఆర్ఎస్ అని, కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యి అందరికీ న్యాయం చేస్తారని అన్నారు, ఈ కార్యక్రమానికి మహిళలు భారీ ఎత్తున బోనాలతో బతుకమ్మల ఆటతో రాధికా చౌరస్తాకు విచ్చేసి నిరసన తెలిపారు, ఇందుకు మద్దతుగా ప్రజలందరూ రోడ్డుమీద కూర్చుని భోజనం చేసి తమ నిరసన తెలియజేశారు, ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి బేతాళ బాలరాజు షేర్ మన్నెమ్మ, కొండూరు మురళి పంతులు, కందుల లక్ష్మీనారాయణ, కార్యదర్శి కుమారస్వామి మరియు డివిజన్ నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## గురువు కనిపించే దైవం

**- విద్యార్థి భవిష్యత్తుకు దిశా నిర్దేశం**



ములుగు, సెప్టెంబర్ 04 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): “గురువు వెలిగిస్తే విద్యార్థి వెలుగుతాడు, విద్యార్థి వెలిగితే సమాజం వెలుగుతుంది“ అని సైన్స్ ఉపాధ్యాయులు ఓదెల చంద్రమౌళి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. భారతీయ సంస్కృతిలో గురువుకు దైవంతో సమాన స్థానం ఉందని, “గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణుః గురుర్దేవో మహేశ్వరః“ అనే శ్లోకం గురువు గొప్పతనానికి నిదర్శనమని తెలిపారు. గురువు కేవలం పాఠాలు చెప్పేవాడు కాదని, విద్యార్థి ఆలోచన, వ్యక్తిత్వం, భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పి అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఒత్తిడిని వివరిస్తూ, ఉదయం నుండి సాయంత్రం వరకు వందల మంది విద్యార్థుల బాధ్యత, పాఠాలు, రికార్డులు, పరీక్షలు, తల్లిదండ్రుల అంచనాలు, సమాజ ప్రశ్నలు అన్నీ మోస్తూనే తన వ్యక్తిగత బాధలను తరగతి గది బయటే వదిలేస్తారని అన్నారు. AI, ఇంటర్నెట్ సమాచారం ఇవ్వగలవు కానీ, ఆలోచించడం, తప్పు-ఒప్పు గుర్తించడం, విలువలు, బాధ్యత, మనిషిగా నిలబడటం నేర్పేది గురువేనని స్పష్టం చేశారు. ఒక గురువును అవమానించడం అంటే విద్యను, క్రమశిక్షణను అవమానించడమేనని, గురువుకు గౌరవం, విద్యార్థికి ప్రేమ, క్రమశిక్షణలో మానవత్వం ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు జీవితం ఇస్తే, గురువులు దానికి దిశ చూపుతారని, ఇద్దరి లక్ష్యం పిల్లల భవిష్యత్తు కావడంతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు. రోడ్లు లేకపోతే అభివృద్ధి ఆగవచ్చు, టెక్నాలజీ లేకపోతే పురోగతి నెమ్మదించవచ్చు కానీ గురువులు లేకపోతే డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు ఎక్కడి నుంచి వస్తారని ప్రశ్నించారు. ప్రతి వృత్తి వెనుక ఒక గురువు ఉంటారని, గురువు అన్ని వృత్తులకు పునాది వేసే వ్యక్తి అని అన్నారు. భవనాలు నగరాలను నిర్మిస్తే గురువులు పౌరులను నిర్మిస్తారని, దేశ భవిష్యత్తు పార్లమెంటులోనే కాదు ప్రతి తరగతి గదిలో నిర్మించబడుతుందని పేర్కొంటూ గురువులకు శతకోటి వందనాలు తెలిపారు.

## నేపాల్ విపత్తు బాధితులకు శ్రీరామానుజ సేవా ట్రస్టు అండ..!

**- రూ.10.55 లక్షల విరాళం సేకరణ**

**- బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా అందజేత**

కాప్రా/సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : ప్రకృతి విలయంతో తీవ్ర భయానక విపత్తును ఎదుర్కొంటున్న నేపాల్ బాధితుల సహాయార్థం శ్రీరామానుజ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన సహాయ కార్యక్రమానికి దాతలు మానవతా దృక్పథంతో స్పందించారు. ఈ కార్యక్రమానికి ఇప్పటివరకు రూ.10,55,116/- విరాళంగా జమ అయినట్లు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. సేకరించిన మొత్తాన్ని చెక్కు రూపంలో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా, డీ.ఆర్.డీ.ఓ మాజీ చైర్మన్, ప్రధానమంత్రికి రక్షణ సలహాదారు శ్రీ జి. సతీష్ రెడ్డి గారికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ విరాళాన్ని అనంతరం నేపాల్ ప్రధానమంత్రి విపత్తు సహాయ నిధికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.



ప్రకృతి విపత్తు సమయంలో బాధితుల కోసం స్పందించి, తమ వంతు సహాయాన్ని అందించిన ప్రతి దాతకు శ్రీరామానుజ సేవా ట్రస్టు తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. ధనుంజయ శ్రీరామానుజ సేవా ట్రస్టు మాజీ కార్పొరేటర్ లు ప్రభుదాస్ శ్రీనివాస్ రెడ్డి బి.ఆర్.ఎస్. పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ సూర్యాపేటకు తీసుకవచ్చేలా కృషి

**- 22వ రోజు చేస్తున్న నిరాహార దీక్షలకు మద్దతు తెలిపి మాట్లాడిన మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్**



సూర్యాపేట సెప్టెంబర్ 04:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట ప్రజల చిరకాల వాంఛ అయిన జాతీయ రహదారి 65 సమాంతర బుల్లెట్ రైలు కారిడార్ రైల్వే మార్గం సుగమం చేసేలా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, నితిన్ గడ్కరి, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ల సహకారంతో సూర్యాపేట వాసిగా కృషి చేస్తానని మాజీ పార్లమెంటు సభ్యులు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బుల్లెట్ ట్రైన్ కారిడార్ సాధన సమితి ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షకు సిఐటియు మద్దతు తెలిపి 22 వ రోజు దీక్షలో కూర్చున్నారు. ఈ దీక్షకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో నేను ఎంపీగా ఉన్న సమయం లో సూర్యాపేటకు రైల్వే సౌకర్యం కల్పించాలని కోరిన సంగతి గుర్తు చేశారు. 65 జాతీయ రహదారి సమాంతరంగా హైదరాబాద్, సూర్యాపేట, జగ్గయ్యపేట, అమరావతి, చెన్నై విశాఖ పట్టణాల మీదుగా సైంటిఫిక్ గా భూసేకరణ చేసి బుల్లెట్ ట్రైన్స్ సౌకర్యాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాదులో భూముల రేట్లు పెంచడానికే అలైన్మెంట్ మార్చారని ఆరోపించారు. ఎంపీగా ఉన్న సమయంలో చిట్యాలకు డ్రై ఫోర్ట్ ను కూడా మంజూరు చేయించాను అని గుర్తు చేశారు. బిజెపి తరపున సూర్యాపేటకు రైల్వే సౌకర్యాన్ని కల్పించేలా సాధించి తీరుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బుల్లెట్ ట్రైన్ కారిడార్ సాధన సమితి కన్వీనర్ జానకీ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ,బిజెపి జిల్లా నాయకులు చలమల్ల నరసింహ, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, బిజెపి పట్టణ అధ్యక్షుడు బూర మల్సూర్ గౌడ్, అఖిలపక్షాల నాయకులు సీనియర్ జర్నలిస్ట్ భూపతి రాములు, సట్టు నాగయ్య, గండూరి శంకర్, సిఐటియు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆలయాల్లో ఎమ్మెల్యే నాయిని ప్రత్యేక పూజలు...



హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 4 ( విజన్ ఆంధ్ర ): శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , వారి సతీమణి నాయిని నీలిమ రాజేందర్ రెడ్డి శుక్రవారం పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ములుగు రోడ్డులోని ప్రముఖ శ్రీకృష్ణ మందిరం (ఇస్కాన్)ను సందర్శించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.తదుపరి సమీపంలోని శ్రీ షిరిడీ సాయినాథుని ఆలయాన్ని సందర్శించి సాయినాథుడిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి, సౌభ్రాతృత్వం నింపాలని ఆకాంక్షించారు. భగవంతుని ఆశీస్సులతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లో పోలీస్ ఉద్యోగార్థులకు గుడ్‌న్యూస్..

**- 60 రోజుల ఉచిత ప్రత్యేక శిక్షణ: కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్, సెప్టెంబర్ 04 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ అందించింది. కానిస్టేబుల్, సబ్




ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో 60 రోజుల పాటు ప్రత్యేక ఉచిత శిక్షణను అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ కార్యక్రమంలో మొత్తం 200 మంది అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నారు. ఇందులో 100 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు, మరో 100 మంది ఎస్ఐ అభ్యర్థులకు నిపుణులైన అధ్యాపకులతో కోచింగ్ ఇవ్వనున్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో బీసీలకు 25 శాతం, ఎస్సీలకు 25 శాతం, ఎస్టీలకు 25 శాతం, అలాగే ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ మరియు అనాథ అభ్యర్థులకు 25 శాతం చొప్పున కేటాయింపులు ఉంటాయి. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు రూ.3 లక్షల ఆదాయ పరిమితికి సంబంధించిన ఇన్‌కమ్ సర్టిఫికెట్‌తో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లు, పోలీస్ ఉద్యోగానికి దరఖాస్తు చేసిన రసీదు పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థులు పోలీస్ రిక్రూట్‌మెంట్ నిబంధనలకు కచ్చితంగా అనుగుణంగా ఉండాలి. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 05 నుంచి 11వ తేదీ వరకు ఆదిలాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తుల ప్రక్రియ ముగిసిన తర్వాత సెప్టెంబర్ 16న మెరిట్ జాబితాను విడుదల చేస్తారు. ఎంపికైన వారికి సెప్టెంబర్ 17 నుంచి 18 వరకు ధ్రువపత్రాల పరిశీలన (సర్టిఫికెట్ వెరిఫికేషన్) నిర్వహించి, సెప్టెంబర్ 19 నుంచి అధికారికంగా శిక్షణ తరగతులు ప్రారంభిస్తారు.ఈ శిక్షణా శిబిరంలో ఎంపికైన అభ్యర్థులకు ఉచితంగా పుస్తకాలు అందించడంతో పాటు, రోజూ నిపుణులైన ఫ్యాకల్టీ ద్వారా నాలుగు తరగతులు నిర్వహిస్తారు. అంతేకాకుండా, అభ్యర్థుల ప్రతిభను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు వారానికి ఒకసారి పూర్తి స్థాయి పరీక్షలు (గ్రాండ్ టెస్ట్) నిర్వహించనున్నారు. ఈ శిక్షణ తరగతులన్నీ ఆదిలాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్ వేదికగా కొనసాగుతాయి. ఈ ఉచిత శిక్షణకు సంబంధించిన మరిన్ని పూర్తి వివరాల కోసం ఆదిలాబాద్‌లోని బీసీ, ఎస్సీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో లేదా 08732-221280, 9949684959, 9494149416 నంబర్లను సంప్రదించాలని కలెక్టర్ కోరారు. అర్హులైన అభ్యర్థులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# దమ్ముంటే రాజీనామా చేసి ఇండిపెండెంట్ గా పోటీ చెయ్

**- నేనూ ఇండిపెండెంట్ గా పోటీ చేయడానికి సిద్ధం**

**- కొండా సురేఖకు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సవాల్**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 4 ( విజన్ ఆంధ్ర ): దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వరంగల్ తూర్పులో ఇండిపెండెంట్ గా పోటీ చేయాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కొండా సురేఖకు సవాల్ విసిరారు.గురువారం వరంగల్ లోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ తాను కూడా ఇండిపెండెంట్ గా పోటీకి సిద్ధమని, ఇన్నేళ్లుగా ప్రజల రక్తం తాగుతూ కొండా దంపతులు బీసీ కార్డు వాడుకుంటున్నారని విమర్శించారు.ముఖ్యమంత్రిని తిడితే ఊరుకోమని, హై కమాండ్ కు ఫిర్యాదు చేసింది తానేనని అన్నారు. మంత్రి పదవి పోవడం కొండా సురేఖ వాళ్ళ స్వయంకృతాపరాధమేనని, మంత్రి పదవి ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి నే తిట్టడం భావ్యం కాదని అన్నారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలు కొండా దంపతులవేనని, ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ వారిని బ్లాక్ మెయిల్ చేయడం కొండ వారికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు.దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని,నేను కూడా ఇండిపెండెంట్ గా పోటీ చేస్తా ఎవరి భవిష్యత్తు ఏంటో ప్రజలు నిర్ణయిస్తారని సవాల్ విసిరారు. కష్టం వచ్చినప్పుడే బీసీ నినాదం ఎత్తుకుంటారని, ఒక్కరిని కూడా బీసీలను కొండా దంపతులు ఎదగనివ్వలేదని అన్నారు.రామసహాయం సురేందర్ రెడ్డి లాంటి సీనియర్లను విమర్శించడం వారి స్థాయికి తగదన్నారు. సొంత పార్టీ కార్యకర్తలపైనే కేసులు పెట్టించిన నీచ చరిత్ర కొండ సురేఖదని,వరంగల్ లో ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కూడా వారికి సపోర్ట్ చేయరని అన్నారు.కొండా సురేఖ గెలుపు కోసం పనిచేసిన వారిని పట్టించుకోని వారి బుద్ధి ఇక్కడ అందరికీ తెలుసని,కుడా చైర్మన్ పదవి గుండు సుధారాణికి ఇవ్వడం అధిష్టాన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని చెప్పారు.ఇంకా మరికొందరికి పని చేసిన కాంగ్రెస్ కార్యకర్తలకు పదవులు రావాల్సి ఉందని, ఇప్పుడు అవి వస్తాయని బస్వరాజు సారయ్య అన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్,బస్వరాజ్ శ్రీమాన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు నల్గొండ రమేష్, వరంగల్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమలక్ష్మి, చాగంటి శ్రీనివాస్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబాన్ని క్షేమంగా కాపాడిన పోలీసు సిబ్బందిని అభినందించిన ఎస్పీ రాజేష్ చంద్ర



కామారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 4 (విజన్ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా పోలీసు యంత్రాంగం సకాలంలో స్పందించి, అప్రమత్తంగా వ్యవహరించడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులతో సహా తండ్రి ప్రాణాలు సురక్షితంగా కాపాడబడ్డాయి.కమ్మర్‌పల్లి నివాసి, ప్రస్తుతం లింగంపేటలో పాత ఇనుప సామాను వ్యాపారం చేసుకుంటున్న చిత్తారి రాజు, సెప్టెంబర్ 03 అర్ధరాత్రి సమయంలో మద్యం సేవించిన అనంతరం భార్యతో గొడవపడి, ఆవేశంలో తన ముగ్గురు పిల్లలను వెంటబెట్టుకుని "చనిపోతాను" అంటూ టాటా ఏస్ వాహనంలో ఇంటి నుంచి బయలుదేరాడు.ఈ విషయాన్ని గుర్తించిన లింగంపేట బ్లూకోట్స్ సిబ్బంది వెంటనే స్పందించి పోలీస్ కంట్రోల్ రూమ్ (పి సి ఆర్)కు సమాచారం అందించారు. పి సి ఆర్ ద్వారా సదాశివనగర్ పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం చేరగానే ఏ ఎస్ ఐ జగదీష్ వెంటనే అప్రమత్తమై ప్రధాన రహదారులపై గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో వేగంగా వెళ్తున్న టాటా ఏస్ వాహనాన్ని గుర్తించి నిలిపివేసి పరిశీలించగా, అందులో రాజు తన ముగ్గురు పిల్లలతో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే లింగంపేట పెట్రోలింగ్ సిబ్బంది కూడా అక్కడికి చేరుకుని రాజుకు కౌన్సెలింగ్ ఇచ్చి, పిల్లలతో సహా అందరినీ క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.సమాచారం అందిన వెంటనే లింగంపేట బ్లూకోట్స్, పి సి ఆర్, సదాశివనగర్ పెట్రోలింగ్ సిబ్బంది సమన్వయంతో సకాలంలో స్పందించడం వల్ల నలుగురి ప్రాణాలకు ముప్పు తప్పింది. ఈ సందర్భంగా సిబ్బంది చూపిన చొరవ, అప్రమత్తత, బాధ్యతాయుతమైన విధినిర్వహణను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ప్రశంసించారు జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, మాట్లాడుతూ,"జీవితంలో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు లేదా మానసిక ఒత్తిళ్లు ఎదురైనా ఆవేశంలో ఆత్మహత్య వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దు. ఏ సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. కష్టకాలంలో కుటుంబ సభ్యులు, మిత్రులు లేదా పోలీసులను సంప్రదించి సహాయం పొందాలి. ప్రతి ఒక్కరి ప్రాణం ఎంతో విలువైనది. ప్రజల రక్షణ, భద్రతకే పోలీసులు తొలి ప్రాధాన్యత ఇస్తారు" అని పేర్కొన్నారు.అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు వెంటనే పోలీసులను సంప్రదించాలని, సమస్యలను ఆవేశంతో కాకుండా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని జిల్లా పోలీసులు సూచించారు.అత్యవసర సమయంలో లింగంపేట బ్లూకోట్స్, పోలీస్ కంట్రోల్ రూమ్ (పి సి ఆర్), సదాశివనగర్ పెట్రోలింగ్ సిబ్బంది ప్రదర్శించిన అద్భుత సమన్వయం, సమయస్ఫూర్తి, తక్షణ స్పందనను జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ప్రత్యేకంగా అభినందించారు.

# ఆత్మకూర్ (ఎస్) పి.హెచ్.సి.లో సుఖప్రసవం..



సూర్యాపేట సెప్టెంబర్ 04:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సాధారణ (నార్మల్) ప్రసవాలకు నిలయంగా మారుతోంది.శుక్రవారం పి.హెచ్.సి.లో వైద్యాధికారి డాక్టర్ రమ్య నేతృత్వంలో ఒక మహిళకు సురక్షితంగా నార్మల్ డెలివరీ నిర్వహించగా, సదరు మహిళ ఆరోగ్యవంతమైన మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆసుపత్రిలో అందుతున్న మెరుగైన సేవలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**నార్మల్ డెలివరీలపై అవగాహన**

డాక్టర్ రమ్య గారు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది గర్భిణులకు, వారి కుటుంబ సభ్యులకు సాధారణ ప్రసవాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నారు.

సిజేరియన్లకు స్వస్తి

శస్త్రచికిత్సల (సిజేరియన్) జోలికి వెళ్లకుండా, సహజ ప్రసవాలు అయ్యేలా వైద్యురాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుండటంతో స్థానిక ప్రజలు పి.హెచ్.సి.లోనే డెలివరీలు చేయించుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

**సిబ్బందికి ప్రశంసలు**


ఆప్యాయమైన వైద్య సేవలు అందిస్తూ, కాన్పులను విజయవంతం చేస్తున్న డాక్టర్ రమ్య గారిని మరియు ఆసుపత్రి వైద్య సిబ్బందిని ఆత్మకూర్ (ఎస్) ప్రజలు, రోగుల బంధువులు కొనియాడుతున్నారు. ఇందులో డాక్టర్ రమ్య, నర్సింగ్ ఆఫీసర్ మానస, ఒపీ మహబూబా, ఆత్మకూర్ ఏఎన్ఎం అన్నపూర్ణ, ఆశా వర్కర్ మాధవి, సిహెచ్ఓ యాదగిరి, హెల్త్ అసిస్టెంట్: రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

## లక్ష గాజుల అలంకారంలో శ్రీశ్రీశ్రీ జోగులాంబ అమ్మవారు



అలంపూర్ సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ లోని 5వ శక్తి పీఠం శ్రీ జోగులాంబ అమ్మవారు శుక్రవారం లక్ష గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం శ్రావణ మాసం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# మద్దూరులో అభివృద్ధి పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి







నారాయణపేట, సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లా,కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండల కేంద్రంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. మద్దూరుకు చేరుకున్న ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ ప్రియాంక హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల భవన నిర్మాణ నమూనా చిత్రపటాన్ని పరిశీలించిన ముఖ్య మంత్రి, భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం, నిర్మాణ విస్తీర్ణం, తరగతి గదులు, ప్రయోగశాలలు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 4 ఎకరాల స్థలంలోని 13,670 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఈడబ్ల్యూఐడీసీ ఎం.డీ. గణపతిరెడ్డి ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం భవనం లోపల జరుగుతున్న నిర్మాణ పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. కళాశాల భవనం పక్కన ప్రధాన రహదారి వైపు ఉన్న అదనపు భూమిని సర్వే చేయించాలని, అది పట్టా భూమి అయితే కొనుగోలు చేసి కళాశాలకు విశాలమైన ప్రాంగణం, ప్రహరీ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకకు ముఖ్యమంత్రి సూచించారు. వచ్చే మార్చి నెలలోపు కళాశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురా వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మద్దూరు ప్రాంతంలో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

గురుకుల బాలికల పాఠశాల నిర్మాణ పనుల పరిశీలన

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనుల పరిశీలన అనంతరం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి రోడ్డు మార్గంలో చింతల్ దిన్నే వైపు కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల,కళాశాల నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ ప్రతి పడవద్దని సూచించారు. పనులు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే బాధ్యులపై చర్యలు తప్పవని ముఖ్యమంత్రి హెచ్చరించారు. అయితే గురుకుల పాఠశాల నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి మద్దూరుకు చేరుకున్న సందర్భంగా పట్టణంలో అభిమానులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శ్రీధర్, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్వో రాజేశ్వరి, మద్దూరు మున్సిపల్ చైర్ పర్సన్ సరస్వతీ, మద్దూరు మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నర్సిములు, వీరేశ్ గౌడ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 240 సార్లు రాజీనామా చేస్తావా అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేకు సవాల్



తెలంగాణ స్టేట్ బ్యూరో, సెప్టెంబర్ 04 (విజన్ ఆంధ్ర): కల్వకుర్తి నియోజకవర్గంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వివాదం రాజకీయ దుమారంగా మారింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్వకుర్తిలో ఒక్క డబుల్ బెడ్రూమ్ ఇల్లు కూడా కట్టలేదని, నిరూపిస్తే రాజీనామా చేస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలపై బిఆర్ యస్ నేతలు భగ్గుమన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని వై ఆర్ ఆర్ కాంప్లెక్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం ఎమ్మెల్యేపై ఘాటుగా విమర్శలు చేశారు.

**12.30 కోట్లతో 240 ఇళ్లు నిజం కాదా?**

ఈ సందర్భంగా ఎడ్మ సత్యం మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా 12 కోట్ల 30 లక్షల వ్యయంతో 240 డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మించడం నిజం కాదా అని ప్రశ్నించారు. నిర్మించడమే కాకుండా అర్హులైన 240 మంది పేద లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చి ఇళ్లలోకి పంపించామని, అందుకు సంబంధించిన ఆధారాలను మీడియా ముందు ఉంచారు.

**240 సార్లు రాజీనామా చేస్తావా?**

ఒక్క ఇల్లు కట్టినా రాజీనామా చేస్తానన్నావ్.. ఇక్కడ కళ్లముందే 240 ఇళ్లు ఉన్నాయి, మరి ఇప్పుడు 240 సార్లు రాజీనామా చేస్తావా అంటూ ఎమ్మెల్యే కసిరెడ్డిని ఎడ్మ సత్యం నిలదీశారు. తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే ఎమ్మెల్యే అబద్ధాలు చెబుతున్నారని, ఇచ్చిన సవాల్‌కు కట్టుబడి తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తిలో జరిగిన అభివృద్ధి అంతా బిఆర్ఎస్ హయాంలోనే జరిగిందని, వచ్చేది మళ్లీ కెసిఆర్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కెసిఆర్ గురించి, బిఆర్ఎస్ పార్టీ గురించి తప్పుగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీశైలం, మాజీ కౌన్సిలర్ సూర్య ప్రకాష్ నాయకులు నక్క ప్రదీప్, చింత రవి,గజ్జె శేఖర్ గౌడ్, తహెర్ అలీ తదితరులు ఉన్నారు.

# ఏఎస్ ఐగా జంగయ్య కు పదోన్నతి




మల్కాజిగిరి, విజన్ ఆంధ్ర,సెప్టెంబర్ 4: మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న వై.జంగయ్యకు అసిస్టెంట్ సబ్ ఇన్స్ పెక్టర్ గా పదోన్నతి లభించింది. మల్కా జిగిరి ఇన్స్ పెక్టర్ విజయ్ కుమార్ శుక్రవారం మల్కా జిగిరి పోలీసు స్టేషన్ లో, జంగయ్యకు ఏ.ఎస్.ఐ. స్టార్స్ ను ప్రధానం చేసి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గత 6 సంవత్సరాలుగా ఈ పోలీసు స్టేషన్ లోనే హెడ్ కానిస్టేబుల్ గా ఎంతో భాధ్యతతో తన విధి నిర్వహణ కొనసాగి స్తున్నాడని తెలిపారు. విజయ్ కుమార్, నేడు ఏఎస్ ఐగా పదోన్నతి పొందడం సంతోషంగా ఉందన్నారు. ఏఎస్ ఐ జంగయ్య మాట్లాడుతూ.. తన 27 సంవత్సరాల సర్వీస్ అనంతరం ఏ. ఎస్. ఐ పదోన్నతి లభించిందని చెప్పారు. తనకు ఈ పదవి మరింత భాధ్యతను పెంచిందన్నారు. తన విది నిర్వహణలో మరింత భాధ్యతగా మెదులుతూ, ప్రజలకు మరింత ఓపికగా సేవ చేస్తానని తెలిపారు.

# విజిలెన్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి




కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 05(విజన్ ఆంధ్ర) : అవినీతి నిర్మూలన, పారదర్శకత, నిజాయితీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అధికారులు సూచించారు. కొత్తగూడెం ఏరియాలోని వీకేసీఎం వద్ద కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆధ్వర్యంలో శుక్రవారం విజిలెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు అవినీతి నిర్మూలన, అవినీతి నిరోధక చర్యలు, విధి నిర్వహణలో నిబంధనల పాటింపు, పారదర్శకత, నిజాయితీ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అవినీతి సంస్థ అభివృద్ధితో పాటు సమాజ పురోగతికి కూడా అడ్డంకిగా మారుతుందని, దాని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఉద్యోగులు విధులను నిష్పక్షపాతంగా, నిజాయితీగా నిర్వహిస్తూ సంస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. అలాగే కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ పథకాలు, ఉద్యోగులకు అందుతున్న ప్రయోజనాలు, ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించిన సేవలు, వాటిలో పారదర్శకత ప్రాధాన్యతపై వివరించారు. ఉద్యోగులు అధికారిక సమాచారాన్ని మాత్రమే వినియోగించుకోవాలని, మధ్యవర్తులను ఆశ్రయించకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రీజినల్ కమిషనర్లు వంశీధర్, కనకమ్మ, అసిస్టెంట్ కమిషనర్ చిరంజీవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సులోచన, శ్రీనివాస్, వీకేసీఎం మేనేజర్ మురళి, ఏఐటీయూసీ ప్రతినిధి హీరాలాల్, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రటరీ గోపు కుమారస్వామి, కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ అధికారులు, సింగరేణి అధికారులు, వీకేసీఎం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఊట్కూర్ మండలపిఆర్టియు నూతనకమిటీఎన్నిక.




ఊట్కూర్, సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర) ఊట్కూర్ మండల పిఆర్టియు టిఎస్ ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీ శుక్రవారం ఊట్కూర్ మండల కేంద్రంలోనిమండల పరిషత్ కేంద్ర ప్రాథమిక పాఠశాల లో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ఎన్నికకు ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షులు వై. జనార్ధన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో 2026 – 2028 కాలానికి గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొని సన్మానించి అభినందించారు. పి ఆర్ టి యు టీఎస్ మండల అధ్యక్షులుగా కోరం గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా కోస్గి నరసింహారెడ్డి, గౌరవ అధ్యక్షులుగా ఫజల్ అహ్మద్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్. ఆనంద్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలుగా భ్రమరాంబ, ఉపాధ్యక్షులుగా బాపురం మహేష్, మహిళా ఉపాధ్యక్షులుగా శశిరేఖ, కార్యదర్శులుగా విక్టర్ పాల్, సాయప్ప, మహిళా కార్యదర్శులుగా భార్గవి, భారతి లను ఎన్నుకున్నారు.ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా రఘువీర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎం కుసుమ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు సభా సుల్తానా, పద్మావతి, సుజాత, శ్రీవిద్య, గుర్నాథ్, నారాయణ, భాస్కర్, శశిధర్ రెడ్డి, అబ్దుల్ సలాం, శివరాజ్, గోపాల్, భాస్కర్, స్వరూప రాజ్, సోహెల్, రవి, సత్యపాల్, మహేష్, శ్రీనివాస్, నాగేష్, హాజీ బాబా తదితరులు పాల్గొన్నారు.

# టీకాల వివరాలను యు-విన్ పోర్టల్‌లో తప్పనిసరిగ నమోదు చేయాలి

**- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. జె. సంధ్యా కిరణ్మయి**

**- జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అస్గర్ అలీ**



గద్వాల సెప్టెంబర్ 4( విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సంబంధిత సిబ్బంది టీకాల వివరాలను యు-విన్ పోర్టల్‌లో తప్పనిసరిగ నమోదు చేయాలని సూచనాలు. జాతీయ స్థాయిలో వ్యాక్సినేషన్ కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షించేందుకు, టీకాలు పొందిన ప్రతి చిన్నారి వివరాలను యు-విన్ పోర్టల్‌లో నమోదు చేయడం ఎంతో అవసరమని ఆమె తెలిపారు. పిల్లలకు పుట్టిన నాటి నుంచి 17 సంవత్సరాల వయస్సు వరకు జాతీయ టీకాల కార్యక్రమం ప్రకారం అన్ని రకాల టీకాలను సకాలంలో వేయించాలని సూచించారు. భౌతికంగా టీకాలు వేసిన వెంటనే సంబంధిత వివరాలను యు-విన్ పోర్టల్‌లో నమోదు చేసి, ఎలాంటి పెండింగ్ లేకుండ చూడాలని వైద్యాధికారులకు, సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

# కొండా సురేఖ బర్తరఫ్ సమంజసమే

**- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**




హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 4 ( విజన్ ఆంధ్ర ) : మంత్రి పదవి నుంచి కొండా సరేఖను ముఖ్యమంత్రి బర్తరఫ్ చేయడం ముమ్మాటికీ సమంజసమేనని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన హనుమకొండలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి పదవి అనుభవిస్తూ పార్టీపై పదేపదే విమర్శలు గుప్పిస్తూ, సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే క్రమశిక్షణా చర్యలు కచ్చితంగా ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కొండా సురేఖ చేసిన ఆరోపణలను ఆయన తీవ్ర స్థాయిలో తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం లేదని ఆమె ఇప్పుడు ఆరోపించడంపై మండిపడ్డారు. ప్రభుత్వంలో మూడేళ్లుగా మంత్రులుగా కొనసాగిన తర్వాత, ఇప్పుడు పథకాల అమలుపై విమర్శలు చేయడం ఏమిటని, ఇవాళే ఆ సంగతి గుర్తుకు వచ్చిందా అని నిలదీశారు. పార్టీ లైన్ కు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా అధిష్టానం కఠిన చర్యలు తీసుకోవడం సరైనదేనని ఆయన నాయిని రాజేందర్ రెడ్డి సమర్థించారు.కాగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మొదటి నుంచి కొండా సరేఖ వైఖరిని, ముఖ్యమంత్రి పై వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ వస్తున్నారు. కొండా సరేఖ కూతురు కొండా సుస్మిత పటేల్ సిఎం రేవంత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యల అనంతరం హైదరాబాద్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కొండా సురేఖ వైఖరిని తీవ్రంగా ఖండించారు.

# ప్రభుత్వ బడులుప్రతిభకు నిలయాలు కావాలి

**- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు తపస్ పిలుపు**

నారాయణపేట, సెప్టెంబర్ 4(విజన్ ఆంధ్ర) : నారాయణపేట మండలంమనందరి కృషితో ప్రభుత్వ పాఠశాలల నాణ్యత పెంచి వాటిని ప్రతిభకు నిలయాలుగా నిలపాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల శాఖ ఉత్తమ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా మండల అధ్యక్ష కార్యదర్శులు రవి కుమార్, చిన్న నర్సిములు మాట్లాడుతూ ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి గుర్తింపుగా సెప్టెంబర్ 5 జిల్లా స్థాయి ఉత్తమ పురస్కారానికి ఎంపిక చేయడం అభినందనీయమని అన్నారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జి. నర్సిములు పిడి జెడ్పిహెచ్ఎస్ జాజపూర్, చిన్న నర్సిములు ఎస్ జి టి ఎం పి పి ఎస్ బసిరెడ్డి పల్లి ఎం. బ్యూలా అబెల్ ఎస్ఏ భౌతిక శాస్త్రం జెడ్ పి హెచ్ ఎస్ కోట కొండ, విజయమ్మ ఎస్ ఏ గణిత శాస్త్రం ఎంపీ యుపిఎస్ తిర్మలాపూర్, శ్రీలత ఎస్ జి టి, యం పి ఎస్ బోయిన్ పల్లి, సాయిలు ఎస్ జి టి ఎంపీ యుపిఎస్ బైరంకొండ, ఎండి జాహీరుద్దీన్ ఎస్ ఏ జి యు పి ఎస్ లాల్ మజీద్, యాదమ్మ పి ఈ టి జి ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ నారాయణ పేటకు చెందిన ఉపాధ్యాయులను అభినందించారు. అభినందనలు తెలియజేశారు.

తపస్ అన్నివేళలా మీకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు లక్ష్మణ్, కోశాధికారి అంబర్ నాథ్, జిల్లా నాయకులు దూస సీతారాములు, రవి కుమార్, శంకర్ నాయక్, విజయ, శ్రీహరి, లక్ష్మారెడ్డి, శంకర్ శ్రీనివాస్, శ్యామ్, సంధ్య రాణి, విజయ లక్ష్మి, వెంకటేష్, కృష్ణారెడ్డి, రాజేష్, నారాయణ, చంద్రకాంత్, పవన్, కిరణ్, శ్రీధర్, రాములు, నర్సప్ప, రఘు రామేశ్వర్, లాలప్ప, అశోక్ రెడ్డి, సింధూ, శాంత, సునంద, శ్రీకాంత్ సౌమ్య, శారదా, అండాలు,భాస్కర్, ఆదిత్య, వెంకట్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# 22-ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

**- కాంగ్రెస్ ప్రభుత్వ భూవిధానాలపై**

**మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు**



కౌటాల, సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పర్యటించారు. కౌటాల మండలంలో రైతులు, భూనిర్వాసితులతో సమావేశమైన ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ భూవిధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటి ఎకరాల భూములు వివాదాల్లో చిక్కుకున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా లక్షలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పట్టా భూములను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో రైతులు తమ భూములను వినియోగించుకోలేకపోతున్నారని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో మొత్తం 42,672 ఎకరాల భూములు 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాగజ్‌నగర్‌లో 4,406 ఎకరాలు, కౌటాలలో 6,350 ఎకరాలు, చింతలమానెపల్లిలో 8,878 ఎకరాలు, బెజ్జూర్‌లో 8,325 ఎకరాలు, పెంచికల్‌పేట్‌లో 2,950 ఎకరాలు, దహేగాంలో 5,268 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయని వివరించారు. 22-ఏ జాబితాలో భూములు ఉండటంతో బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని రైతులు తన దృష్టికి తీసుకొచ్చారని హరీశ్‌రావు తెలిపారు. దీంతో రైతులు అప్పులపాలై తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బింబాయి అనే రైతు తనకు వారసత్వంగా వచ్చిన రెండు ఎకరాల భూమిని ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చారని హరీశ్‌రావు దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. "తాతల కాలం నుంచి మా కుటుంబంలో ఉన్న భూమిని కాపాడాలి.. నా భూమిని విడిపించండి సార్" అంటూ పలువురు రైతులు తనను కోరుతున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై కూడా హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. లక్షలాది మంది పేదలు, రైతుల ఆస్తులను 22-ఏ జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రైతుల భూముల సమస్యను పరిష్కరించడంలో విఫలమైన రెవెన్యూ మంత్రిని వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కొండా సురేఖ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వేగంగా స్పందించినట్లే, లక్షలాది మంది రైతుల భూముల సమస్యపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రైతుల ఆస్తులను ఇబ్బందుల్లోకి నెట్టిన రెవెన్యూ శాఖపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఎన్నికల సమయంలో అసైన్డ్ భూములతో పాటు అన్ని భూములను విక్రయించుకునే వెసులుబాటు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను పక్కనపెట్టి రైతుల భూముల చుట్టూ వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న 22-ఏ నిబంధనల సమస్యను పరిష్కరించాలని, రాష్ట్రవ్యాప్తంగా నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాలో ఉన్న సుమారు 1.50 లక్షల ఎకరాల భూముల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల భూముల సమస్యపై శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ నెల 7న జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో 22-ఏ భూముల సమస్యను ప్రస్తావించి రైతుల పక్షాన గట్టిగా పోరాడతామని తెలిపారు. అన్నదాతలను ఇబ్బందులకు గురిచేసే చర్యలను ప్రభుత్వం వెంటనే నిలిపివేసి, 22-ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.


# బీసీలను అణగదొక్కే రాజకీయ కుట్రలను తీవ్రంగా కండిస్తున్నాం

**- బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 04,(విజన్ ఆంధ్ర ) : బీసీ సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖను ఆమె కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలకు బాధ్యురాలిని చేస్తూ మంత్రి పదవి నుంచి తొలగించడాన్ని బీసీ సమాజ్ తీవ్రంగా ఖండిస్తోందని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ అన్నారు.బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ఒక బీసీ మహిళా మంత్రిని మంత్రి పదవి నుంచి తొలగించే విషయంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరును బీసీ సమాజ్ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో బీసీలకు ఒక విధానం, రెడ్డి సామాజిక వర్గానికి మరో విధానం కొనసాగుతోందని ఆయన ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు బహిరంగంగా పార్టీని విమర్శించిన సందర్భాలు అనేకం ఉన్నప్పటికీ, వారిపై ఇదే తరహాలో కఠిన చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని బహిరంగంగా విమర్శించిన అనేక సందర్భాలు ఉన్నప్పటికీ, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకుల విషయంలో ఒక విధంగా, బీసీ నాయకుల విషయంలో మరో విధంగా వ్యవహరించడం ఎంతవరకు సమాంజసం అని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీలో రెడ్ల రాజ్యం నడుస్తోందని, బీసీలను రాజకీయంగా అణగదొక్కేందుకు కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయని నరెడ్ల శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. బీసీలకు రాజకీయంగా ఎదిగే అవకాశం వచ్చిన ప్రతిసారీ వారిని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ ధోరణిని బీసీ సమాజ్ ఎంతమాత్రం సహించబోదని స్పష్టం చేశారు. బీసీలను ఓట్ల కోసం ఉపయోగించుకుని, అధికారం విషయంలో మాత్రం అణగదొక్కే రాజకీయాలను కాంగ్రెస్ పార్టీ విడనాడాలని, బీసీలపై వివక్షకు స్వస్తి పలకాలని అన్ని సామాజిక వర్గాలకు సమాన న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఇప్పటికైన తెలంగాణలోని బీసీ మంత్రులు, బీసీ ప్రజాప్రతినిధులు, బీసీ నాయకులు కళ్లుతెరిచి కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలను గమనించాలని అయన సూచించారు.బీసీలను అణగదొక్కే రాజకీయాలకు తెలంగాణ ప్రజలు తప్పకుండా గుణపాఠం చెబుతారని,బీసీల రాజకీయ చైతన్యం ఇక ఆగదని స్పష్టం చేశారు. ఈ సమావేశం లో బీసీ సమాజ్ జిల్లా ఉపాధ్యక్షులు వైద్య భాస్కర్ బొలిశెట్టి లక్ష్మణ్, జిల్లా నాయకులు బియ్యాల సత్తయ్య, జక్కం రవీందర్, బీసీ సమాజ్ పట్టణ నాయకులు వెన్నంపల్లి మురళి, గుండ్ల లక్ష్మణ్, ఎండి షఫీ, కొడుకా మోహన్, పల్లపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# విద్యా పరిపాలనలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు విశిష్ట ప్రతిభా పురస్కారం



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 04,(విజన్ ఆంధ్ర ) : విద్యా పరిపాలనలో విశిష్ట ప్రతిభా పురస్కారం2026"కు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగిత రాణా ఉత్తర్వులు జారీ చేశారు. 202627 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు పెంపు లక్ష్య సాధనలో మంచిర్యాల జిల్లా విశిష్ట ప్రతిభ కనబరిచింది. 202526లో 43 వేల 72 మంది విద్యార్థులు ఉండగా, 202627లో ఈ సంఖ్య 45 వేల 626కు పెరిగి 2 వేల 554 మంది అదనంగా చేరారు. 202425తో పోలిస్తే రెండేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు 10.34 శాతం పెరిగింది. జిల్లాలోని 282 ప్రభుత్వ పాఠశాలలలో 10 శాతానికి పైగా అదనపు నమోదు సాధించగా, మందమర్రి, నస్పూర్, జైపూర్, హాజీపూర్, భీమారం మండలాలలో 10 శాతానికి పైగా నమోదు పెరిగింది. అలాగే 202627లో 4 వేల 346 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను వీడి ప్రభుత్వ పాఠశాలలలో చేరడం ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులలో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య, విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎం ఐ ఎస్, సి సి ఓ లు, సి ఆర్ పి ల సమన్వయంతో చేపట్టిన కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణ, సమష్టి కృషి ఈ విజయానికి దోహదపడింది. సెప్టెంబర్ 5న కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ పురస్కారం మంచిర్యాల జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖతో పాటు మంచిర్యాల జిల్లాకు రాష్ట్రస్థాయిలో లభించిన విశిష్ట గుర్తింపు.

# మహిళా కండక్టర్ పై అసభ్యకర వార్త రాసిన విలేఖరిపై చర్యలు తీసుకోవాలి

**- టిజిఎస్ ఆర్ టిసి తెలంగాణ మజ్దూర్ యూనియన్ డిమాండ్**

నారాయణ పేట, సెప్టెంబర్ 4 ( విజన్ ఆంధ్ర) : గద్వాల డిపోకు చెందిన మహిళా కండక్టర్ పై అసభ్యకరమైన పదజాలంతో వార్త రాసిన విలేఖరిపై కఠిన చర్యలు తీసుకోవాలని టిజిఎస్ ఆర్ టిసి తెలంగాణ మజ్దూర్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మహబూబ్ నగర్ రీజినల్ సెక్రటరీ మధుసూదన్, నారాయణపేట డిపో సెక్రెటరీ నర్సింలు శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఆర్టిసి కండక్టర్లు ఎంతో అంకి తభావంతో విధులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథ కాన్ని విజయవంతం చేయడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నా రు. అలాంటి సిబ్బందిని కించపరిచేలా, ముఖ్యంగా మహిళా కండక్టర్ పై అసభ్య పదజాలంతో విమర్శిస్తూ వార్త రాయడం సరికాదన్నారు.

ఆర్టిసి బస్సుల్లో కండక్టర్లు, డ్రైవర్లు, వికలాంగులు, వృద్ధులు, మహిళలు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక సీట్లు కేటాయించడం సంస్థ నిబంధనల్లో భాగమని తెలిపారు. ఈ విష యాన్ని తెలుసుకోకుండా కండక్టర్ సీటుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం విలేఖరి అవగాహన లేమికి నిదర్శనమన్నారు. వాస్తవాలను తెలుసుకోకుండా సిబ్బందిపై బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలు చేయడం జర్నలిజం విలువలకు విరుద్ధమన్నారు. మహిళా కండక్టర్తో పాటు యావత్ ఆర్టిసి కండక్టర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసేలా వార్త రాసిన విలేఖరిపై పోలీసు కేసు నమోదు చేసి కఠిన చర్య లు తీసుకోవా లని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆర్టిసి యాజమాన్యం సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానం



హైదరాబాద్, సెప్టెంబర్ 04 (విజన్ ఆంధ్ర) : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో ఓయూ వీసీ నివాస హాలులో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ కు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎక్సలెన్స్ అవార్డును ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ నారాయణ ముదిరాజ్ ప్రదానం చేశారు. ఉపాధ్యాయులే విజయవంతమైన జీవితానికి పునాది అని వీసీ కుమార్ అన్నారు. రిజిస్ట్రార్ ప్రొ.నరేశ్ రెడ్డి, కామర్స్ విభాగం సీనియర్ ప్రొ.పాట్రిక్, ప్రొ.జితేందర్ కుమార్ నాయక్, ప్రొ.శేఖర్, ప్రొ.బి.శ్రీనగేష్, ప్రొ.మంగు, ప్రొ.భాగ్యవతి, డా.రవితేజ, డా.అక్తర్ అలీ, డా.ఏ.అనిత, డా.పి.సుప్రియ, మేజర్ ఎస్.కె.శివప్రసాద్, ఇట్ట ఉదయశ్రీ రెడ్డి, కోఆర్డినేటర్లు జీ.వేణుగోపాల్, బిచ్చుకారి సూర్య, రామ్ గోపాల్ రెడ్డి తదితరులు వీసీ కుమార్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా అభ్యాస జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు

మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 04,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్‌లో గల మంచిర్యాల గార్డెన్‌లో అభ్యాస జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలకు మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తూ, విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. కొత్తగా కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థులకు ఫ్రెషర్స్ డే శుభాకాంక్షలు తెలియజేస్తూ, విద్యార్థి దశలో క్రమశిక్షణ, పట్టుదల, కృషితో ముందుకు సాగి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని కోరారు.అనంతరం కొక్కిరాల సురేఖ ను కళాశాల యాజమాన్యం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, స్థానిక కార్పొరేటర్ చింతపండు శ్రీనివాస్, టిపిసిసి సభ్యులు నస్పూర్ పట్టణ ఇంఛార్జి నూకల రమేష్, కళాశాల కరస్పాండెంట్ రమణ, ప్రిన్సిపల్ ఆర్. శ్రీనివాస్, డైరెక్టర్లు సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ సుధాతి- గిరీష్ , మానయ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


# ఈ వి ఎం గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 04,(విజన్ ఆంధ్ర )ద: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల ఈ వి ఎం గోదామును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పోలీసు సిబ్బంది సమన్వయం తో పటిష్టమైన బందోబస్తు చేపట్టడంతో పాటు 24 గంటలు సి.సి. కెమెరాల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. భద్రత సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలుపుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కుడా ఛైర్మన్ గుండు సుధారాణి



హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 4 ( విజన్ ఆంధ్ర ) : వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన శ్రీమతి గుండు సుధారాణి.. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హనుమకొండ రామకృష్ణ కాలనీలోని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నివాసానికి వెళ్లిన ఆమె, ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి.. కుడా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న గుండు సుధారాణికి శాలువా కప్పి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# గీతాంజలి స్కూల్స్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి



మహబూబాబాద్, జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 5 (విజన్ ఆంధ్ర ): మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో సందడి చేశారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు ఉత్సాహంగా ఉట్టి కొట్టగా పూలవర్షం కురిపించడంతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. జన్మాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. డైరెక్టర్లు రామకృష్ణ, మమత చిన్నారులను ఆశీర్వదించారు. ప్రిన్సిపాల్ నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రియాంక సర్కార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నల్లమల అందాలకు అక్షర రూపం సోమశిల గాన గంగ

**- రేలారే ప్రసాద్ కలం నుంచి జాలువారిన ప్రకృతి గీతం నేడు పూర్తి పాట విడుదల**




విజన్ ఆంధ్ర(04) హైదరాబాద్ : నల్లమల ప్రకృతి అందాలను, సోమశిల సోయగాలను అక్షరాల్లో అద్భుతంగా ఆవిష్కరిస్తూ ప్రముఖ యువ కవి, గాయకుడు రేలారే ప్రసాద్ రచించి, ఆలపించిన సోమశిల పూర్తి పాట నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది, బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఈ పాటను ఘనంగా విడుదల చేయనున్నారు, ప్రకృతి ఒడిలో పరవళ్లు తొక్కే గంగమ్మను, నల్లమల అందాలను తన హృదయంలో ఇమిడించు కొని రేలారే ప్రసాద్ ఈ గీతాన్ని రచించారు. ప్రకృతి ప్రేమ, పుడమిపై బాధ్యత, మనిషికి ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని తన సాహిత్యం, స్వరంలో ప్రతిబింబించారు, ఈ సందర్భంగా రేలారే ప్రసాద్ మాట్లాడుతూ. పుడమి ప్రకృతి మనకు ఎంతో ఇచ్చాయి. వాటిని కాపాడి, భావితరాలకు తిరిగి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది అన్నారు, ఇప్పటికే విడుదలైన సోమశిల ప్రోమో సాహిత్య, సంగీతాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది, దీంతో పూర్తి పాటపై మరింత ఆసక్తి నెలకొంది, నేడు ప్రసాద్ ల్యాబ్‌లో జరిగే పాట విడుదల కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, సాహితీ వేత్తలు, కళాకారులు, సంగీతాభిమానులు హాజరు కానున్నారని రేలారే ప్రసాద్ తెలిపారు. సాహిత్య, సంగీత అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు

# మహాలక్ష్మి ఆలయంలో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్





ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఆదిలాబాద్ పట్టణంలోని మా లక్ష్మీవాడ మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ , వార్డు కౌన్సిలర్ మీరాబాయి ప్రేమ్ తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరమైన వాతావరణంతో తీర్చిదిద్దడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటడం ఎంతో అవసరమన్నారు. ఆలయానికి ప్రతిరోజూ అనేక మంది భక్తులు పూజా కార్యక్రమాల కోసం వస్తుంటారని, ప్రస్తుతం నాటిన మొక్కలు భవిష్యత్తులో పెద్దవిగా పెరిగి భక్తులకు చల్లని నీడను అందించడంతో పాటు ఆలయ ప్రాంగణానికి మరింత ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



ఆదిలాబాద్ జిల్లా ( విజన్ ఆంధ్ర బ్యూరో) : శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి లుఇస్కాన్ టెంపుల్‌తో పాటు గోపాలకృష్ణ మఠాన్ని సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడిని దర్శించుకొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఇస్కాన్ టెంపుల్ లో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ల తో కలిసి మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ , మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి లుమాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, సంతోషం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షిస్తూ , పుర ప్రజలు సుఖసంత్సల్తో సుఖంగా ఉండాలని, మరొక్కసారి భగవంతుణ్ణి కోరామన్నారు.పంటలు సమృద్ధి గా పండాలని,వర్షాలు బాగా కురవాలని కోరారు.ప్రజలకు జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

# భర్తను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న భార్య.. ఎన్టీఆర్ కాలనీలో కలకలం..!

**- వివాహేతర సంబంధం ఉందంటూ భార్య ఆరోపణలు..**

**- ఇద్దరు పిల్లలతో తనను ఇంటి నుంచి వెళ్లగొట్టాడని ఆవేదన..**

**- ఆరు సంవత్సరాలుగా సంబంధం కొనసాగుతోందని ఆరోపణ..**

**- ఒకే గదిలో భర్తను మరో మహిళతో చూసి కన్నీరుమున్నీరైన భార్య..**





సూర్యాపేట సెప్టెంబర్ 04:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో గురువారం రాత్రి చోటుచేసుకున్న ఘటన తీవ్ర చర్చకు దారితీసింది. బొడ్రాయి బజార్ సమీపంలోని శ్రీ లక్ష్మి శ్రీనివాస కిరాణా మర్చంట్స్ యజమాని చిల్లంచర్ల సోమేశ్వర్ తన షాపులో పనిచేస్తున్న ఉమతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని ఆయన భార్య ఆరోపించింది.తన కుటుంబాన్ని కాపాడుకోవాలని ఎన్నోసార్లు ప్రయత్నించినా పరిస్థితిలో మార్పు రాలేదని భార్య ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. భర్త మరో మహిళ ఇంటికి వెళ్లాడని తెలుసుకున్న ఆమె గురువారం రాత్రి తీవ్ర ఆవేదనతో అక్కడికి చేరుకున్నట్లు సమాచారం. అక్కడ భర్తను ఉమతో ఒకే గదిలో చూసిన ఆమె.. తట్టుకోలేక కన్నీరుమున్నీరైనట్లు స్థానికులు చెబుతున్నారు.ఆరు సంవత్సరాలుగా భర్తకు ఉమాతో వివాహేతర సంబంధం ఉందని, ఆమెను షాపులో యజమానిలా చూసుకుంటూ ఆరు సంవత్సరాలుగా డబ్బులు, సుమారు 20 తులాల బంగారం ఇచ్చాడని భార్య ఆరోపించింది. మరోవైపు తనను, ఇద్దరు పిల్లలను ఇంటి నుంచి వెళ్లగొట్టి తమ జీవితాలను రోడ్డున పడేశాడని ఆమె వాపోయింది."భర్తే దిక్కనుకున్న నాకు.. ఇద్దరు పిల్లలతో ఇప్పుడు ఎవరు దిక్కు..?" అంటూ ఆమె కన్నీరుమున్నీరైనట్లు స్థానికులు తెలిపారు. భర్తపై పెట్టుకున్న నమ్మకం కళ్లముందే కూలిపోవడంతో తీవ్రంగా కుంగిపోయిన ఆమె.. పిల్లల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.కుటుంబ బాధ్యతలను విస్మరించి మరో మహిళ ఇంటికి వెళ్లడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.ప్రతి రోజు అతను ఆమె ఇంటికి రాత్రి పూట వచ్చేవాడని స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. అనంతరం ఆమె పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు అక్కడికి చేరుకుని సోమేశ్వర్, ఉమను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం తెలుస్తోంది..

# సవ్యసమాజం తలదించుకునేలా శిరీష హత్య

**- నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు**

**- మంత్రి పొంగులేటి**




కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 05(విజన్ ఆంధ్ర) : గిరిజన యువతి ఊకే శిరీష హత్య, అనంతరం లైంగిక దాడి ఘటన అత్యంత దారుణమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడికి చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శుక్రవారం ములకలపల్లి మండలం చౌటిగూడెంలోని శిరీష స్వగ్రామానికి వెళ్లిన మంత్రి.. మృతురాలి తల్లి, అన్న, వదిన, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తూ కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో వెళ్లిన శిరీష మృతి ఆ కుటుంబానికి తీరని లోటని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మృతురాలి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్స్‌తో పాటు రూ.5 లక్షల చెక్కును మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్‌లోని పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శిరీష హత్యకు సంబంధించిన అధికారితో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. శిరీష హత్య జరిగిన వసతి గృహాన్ని తక్షణమే తనిఖీ చేసి, ఆసుపత్రికి అనుసంధానమైన వసతి గృహాల్లో భద్రతా చర్యలపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అవసరమైతే సంబంధిత ఆసుపత్రిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎఫ్ఐఆర్‌లో ఆసుపత్రి, వసతి గృహాలకు సంబంధించిన వ్యక్తుల పేర్లు ఎందుకు చేర్చలేదనే అంశాన్ని పరిశీలించి, అవసరమైతే అదనపు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమై శిరీష కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. మృతురాలి తల్లి ఆవేదన, ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేకపోయానని, ఆమె మనోవేదన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. మంత్రి వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, ములకలపల్లి తహసీల్దార్ స్వాతి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సూర్యాపేటకు రైల్వే మార్గం ఏర్పాటు చేయాలి

**- కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి**

**- ఉమ్మడి నల్గొండ జిల్లా క్రైస్తవ సంఘాల నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్**




సూర్యాపేట సెప్టెంబర్ 04:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లా కేంద్రానికి రైల్వే మార్గం ఏర్పాటు చేయాలని ఉమ్మడి నల్గొండ జిల్లా క్రైస్తవ సంఘాల నాయకులు, ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత బిషప్ దుర్గం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో రైతు బజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుల్లెట్ ట్రైన్ పాస్టర్స్ ఆధ్వర్యంలో బుల్లెట్ ట్రైన్ కోసం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేంతవరకు మా మద్దతు ఉంటుందని భారతదేశంలో రైల్వే వ్యవస్థ ప్రారంభమై దశాబ్దాలు గడిచినా సూర్యాపేట ప్రాంత ప్రజలకు ఇప్పటికీ రైల్వే సౌకర్యం అందకపోవడం దురదృష్టకరమన్నారు. సూర్యాపేట మీదుగా రైల్వే మార్గం ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ మీదుగా విజయవాడ వరకు రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా భువనగిరి నుంచి వచ్చే రైల్వే మార్గాన్ని చిట్యాల మీదుగా సూర్యాపేట ప్రాంతానికి అనుసంధానం చేయాలని కోరారు.సూర్యాపేట జిల్లా కేంద్రం భౌగోళికంగా ఎంతో కీలకమైన ప్రాంతంలో ఉందని, భద్రాచలం, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాలను అనుసంధానించేలా రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రైల్వే మార్గం లేకపోవడం వల్ల ప్రజలు రోడ్డు రవాణాపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు.గతంలో ప్రకటించిన ప్రతిపాదనలు, రూట్ మ్యాప్ ప్రకారం సూర్యాపేటకు రైల్వే మార్గం ఏర్పాటు చేయాల్సి ఉండగా, ప్రస్తుతం ఆ మార్గాన్ని మార్చే ప్రయత్నం చేయడం సరైనది కాదన్నారు. సూర్యాపేట జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం గుర్తించి రైల్వే మార్గాన్ని మంజూరు చేయాలని కోరారు.తాను 45 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో రైల్వే కోసం ప్రజలు ఎదురుచూస్తున్న పరిస్థితిని చూస్తున్నానని, తమ తాతలు, తండ్రుల కాలం నుంచి సూర్యాపేటలో రైల్వే మార్గం వస్తుందని ఎదురుచూస్తున్నప్పటికీ నేటికీ అది సాకారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.సూర్యాపేటకు రైల్వే మార్గం సాధించే విషయంలో అవసరమైతే ఢిల్లీ స్థాయిలో పోరాటం చేసేందుకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని బిషప్ దుర్గం ప్రభాకర్ తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని క్రైస్తవ సంఘాలను ఏకం చేసి త్వరలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ శ్యాంప్రసాద్ జలగం జేమ్స్ చింత మనిషే, మార్క్, కొండేటి లాజర్, ఎం రూబేన్, పంది మార్క్, కొమ్ము హోసన్న, మామిడి కృష్ణోఫర్, పిట్టల సామెల్, రెంటల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ముక్కోటి ఉత్సవాల్లోపు ఉత్తర ద్వార పనులు పూర్తి చేయాలి

**- గోదావరి పుష్కరాల నాటికి ఘాట్ల అభివృద్ధి పనులు సిద్ధం చేయాలి**

**- మంత్రి పొంగులేటి**



భద్రాచలం, సెప్టెంబర్ 05(విజన్ ఆంధ్ర) : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి ఆలయ అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భద్రాద్రి జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి ఐటీడీఏ పీఓ రాహుల్, ఆలయ ఈఓ దామోదర్, అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వచనాల మధ్య స్వామివారిని దర్శించుకుని మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చిత్రకూట మండపం, గోశాల, అన్నదాన సత్రం, విస్తా కాంప్లెక్స్, శివాలయ మార్గం, ఉత్తర ద్వార దర్శనం, మాడ వీధులు తదితర ప్రాంతాల్లో పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టర్లు, ఆర్కిటెక్ట్‌లతో మాట్లాడి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జరిగే ముక్కోటి ఉత్సవాల్లోపు ఉత్తర ద్వార అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరిగే శ్రీరామనవమి ఉత్సవాల్లోపు మిగిలిన ప్రధాన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే 2027 జూన్‌జూలైలో జరిగే గోదావరి పుష్కరాల నాటికి గోదావరి ఘాట్లు, పరివాహక ప్రాంత అభివృద్ధి పనులు పూర్తిచేయాలని సూచించారు. ఆలయ పరిసరాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.276 కోట్లు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. నిర్మాణాల్లో నాణ్యతా లోపాలకు తావులేకుండా, దశాబ్దాల పాటు నిలిచేలా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఆలయ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అగ్రికల్చర్ అడ్తి అసోసియేషన్ నూతన భవనానికి శంకుస్థాపన..



సూర్యాపేట సెప్టెంబర్ 04:(విజన్ ఆంధ్ర) : అగ్రికల్చర్ అడ్తి అసోసియేషన్ సభ్యుల సంక్షేమానికి, మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త మార్కెట్ సమీపంలో అగ్రికల్చర్ అడ్తి అసోసియేషన్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్కెట్‌కు వచ్చే రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, అడ్తీలకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. నూతన భవనం నిర్మాణం పూర్తయితే అసోసియేషన్ సభ్యులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. మార్కెట్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ సెక్రటరీ ముక్రం, మార్కెట్ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, అగ్రికల్చర్ అడ్తి అసోసియేషన్ అధ్యక్షుడు తుడి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల రవి, ఉప్పల నరసింహారావు, ఇమ్మడి శ్రీనివాస్, సోమ సోమేశ్వరరావు, బోనగిరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# చిట్టెంపర్ణికా రెడ్డికి మంత్రి పదవి, వాకిటి శ్రీహరికి డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలి.

**- జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం.డి.సలీం**



నారాయణపేట, సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర) : యువతకు ప్రాధాన్యత నిస్తూ నారాయణపేట యువ ఎమ్మెల్యే డాక్టర్. చిట్టెం పర్ణికరెడ్డికి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని,అలాగే బీసీ వర్గాలకు సముచిత ప్రాతి నిధ్యం కల్పించేలా మంత్రి వాకిటి శ్రీహరికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించాలని జిల్లా కాంగ్రె స్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.డి.సలీం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో సలీం మాట్లాడుతూ.కేవలం 30 ఏళ్ల వయసులోనే ఎమ్మెల్యే గా సంచలన విజయం సాధించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న డా.పర్ణికా రెడ్డికి మంత్రి పదవి కల్పిస్తే యువత, మహిళలు,కొత్త తరం నాయకత్వానికి కాంగ్రెస్ పార్టీ మరింత ప్రోత్సాహం ఇచ్చినట్లవుతుందని అన్నా రు.అత్యంత వెనుకబడిన నారాయణపేట జిల్లా నుంచి ఇప్పటికే మంత్రి వాకిటి శ్రీహరి ప్రాతినిధ్యం వహిస్తున్నారని,బడుగు బలహీన వర్గాల నాయకు డిగా ఉన్న ఆయనకు రాష్ట్రంలో గణనీయమైన జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గానికి సము చిత ప్రాధాన్యతనిస్తూ ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వా లని కోరారు. దీనివల్ల బీసీ వర్గాలకు మరింత రాజకీ య ప్రాతినిధ్యం లభించ డంతో పాటు సామాజిక న్యాయానికి బలం చేకూరు తుందనిపేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యంత వెనుక బడిన నారాయణపేట జిల్లా అభివృద్ధి కోసం, యువతఆకాంక్షలు,మహిళలు,బీసీ వర్గాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని దృష్టిలో ఉంచుకునిడా. చిట్టెం.పర్ణికారెడ్డికి మంత్రి పదవి,మంత్రి వాకిటి శ్రీహరికి ఉప ముఖ్య మంత్రి పదవి కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు.

# గారెపల్లి అయ్యప్పవాడలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



కాటారం, సెప్టెంబర్ 4 (విజన్ ఆంధ్ర) : గారెపల్లి అయ్యప్పవాడలో పడకంటి అంజలిప్రకాశ్ దంపతుల నివాసంలో మహిళలు సామూహికంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు శ్రీకృష్ణుడిని భక్తిశ్రద్ధలతో పూజించి, భక్తి పాటలు ఆలపిస్తూ హారతులు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఇకపై ప్రతి సంవత్సరం జన్మాష్టమి వేడుకలను మరింత ఘనంగా నిర్వహించుకోవాలని మహిళలు నిర్ణయించారు. తొలిసారిగా జన్మాష్టమి వేడుకలను నిర్వహించిన నిర్వాహకులను అయ్యప్పవాడ కాలనీవాసులు అభినందించారు. అలాగే నాలుగో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు సామూహికంగా పసుపు, బొట్టు కార్యక్రమాన్ని నిర్వహించి, పరస్పరం వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పడకంటి అంజలిప్రకాశ్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

# 30 ఏళ్ల విధేయత.. 30 నెలల నిరీక్షణ..

## - ఇకనైనా వంశీకృష్ణకు మంత్రి పదవి దక్కేనా?



తెలంగాణ స్టేట్ బ్యూరో, సెప్టెంబర్ 04 (విజన్ ఆంధ్ర): కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. నల్లమల అడవి బిడ్డలా, పార్టీ జెండాను భుజాన వేసుకుని తిరిగిన నాయకుడు చిక్కుడు వంశీకృష్ణ. తండ్రి చిక్కుడు రామయ్య వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని, ముప్పై ఏళ్లుగా కాంగ్రెస్ కోసం కుటుంబాన్ని సైతం పణంగా పెట్టిన నేత. కానీ, పార్టీ కోసం అన్నీ ఇచ్చిన ఆ కుటుంబానికి తగిన గుర్తింపు దక్కడం లేదన్న ఆవేదన నేడు అచ్చంపేట గడ్డ మీద నుంచి బలంగా వినిపిస్తోంది.

కష్టకాలంలో పార్టీకి అండగా:

కాంగ్రెస్ పార్టీకి అత్యంత కష్టకాలం వచ్చినప్పుడు సైతం వంశీకృష్ణ పార్టీని వీడలేదు. పదవులు ఆశించకుండా, కార్యకర్తలకు అండగా నిలబడ్డారు. అలాంటి వ్యక్తిని మంత్రివర్గంలోకి తీసుకోవడం ద్వారా కష్టపడే కార్యకర్తలకు భరోసా ఇచ్చినట్లు అవుతుందని శ్రేణులు అంటున్నాయి. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ నాయిని జైపాల్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

"వంశీకృష్ణ అంటేనే భరోసా" – నాయిని జైపాల్:

"అచ్చంపేట నియోజకవర్గంలో వంశీకృష్ణ అంటే ఒక బ్రాండ్. అర్ధరాత్రి ఆపదొచ్చినా 'నేనున్నా' అంటూ పేదోడి గుడిసె ముందు నిలబడే నాయకుడు. పాలమూరు బిడ్డ అయిన మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి వంశీకృష్ణ అత్యంత ఆప్తుడు, నమ్మినబంటు. అయినా ఇప్పటివరకు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడం బాధాకరం. నల్లమలలోని 20 మండలాల ప్రజల ఆకాంక్ష ఒక్కటే.. మా బిడ్డకు మంత్రి పదవి రావాలి. అచ్చంపేట సమగ్ర అభివృద్ధి జరగాలంటే, వెనుకబడ్డ నల్లమల బిడ్డల తలరాతలు మారాలంటే వంశీకృష్ణకు క్యాబినెట్ హోదా ఇవ్వాల్సిందే. ఇది ఒక్క వ్యక్తికి ఇచ్చే పదవి కాదు, లక్షలాది మంది అచ్చంపేట ప్రజలకు ఇచ్చే గౌరవం" అని జైపాల్ డిమాండ్ చేశారు. పార్టీ అధిష్టానం, సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, నల్లమల బిడ్డల ఆకాంక్షను నెరవేర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి..

## - లక్ష రూపాయల ఆర్థిక సాయం






స్టేట్ బ్యూరో,సెప్టెంబర్ 04 (విజన్ ఆంధ్ర): మానవత్వం ఇంకా బతికే ఉందని నిరూపించారు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు & టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి. కల్వకుర్తి మండలం ముకురాల గ్రామానికి చెందిన సంకి నిరంజన్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న నిరంజన్ అనారోగ్యానికి గురికావడంతో ఆదాయం నిలిచిపోయి, కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. కనీస అవసరాలు తీర్చుకోవడం కూడా కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి వెంటనే స్పందించారు. మానవతా దృక్పథంతో ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. కుటుంబ జీవనోపాధి కోసం రూ.1,00,000 (ఒక లక్ష రూపాయలు) ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో బాధితుడి భార్య శివలీలకు అందజేశారు. "కష్టకాలంలో మీకు మేమున్నాం" అంటూ భరోసా ఇవ్వడమే కాకుండా, ఆర్థికంగా అండగా నిలిచి పెద్ద మనసు చాటుకున్నారు. ఈ సహాయం తమ కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చిందని, ఆపద సమయంలో అండగా నిలిచిన రాఘవేందర్ రెడ్డి కి బాధితుడు సంకి నిరంజన్, భార్య శివలీల, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లయ్య, సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్, శరత్, నరసింహ, కృష్ణయ్య, జంగయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఉమామహేశ్వరి

చిలిపిచేడ్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 04 : మెదక్ జిల్లా ఉత్తమ




ఉపాధ్యాయురాలు చిట్కుల్ కస్తూర్బా గాంధీ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉమామహేశ్వరి హిందీ సిఆర్టి. ఈనెల ఉపాధ్యాయు దినోత్సవం రోజు జిల్లా కలెక్టర్. జిల్లా విద్యాధికారి ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు 18 సంవత్సరాలుగా 2008 నుండి పాఠశాలలో పనిచేయుచున్నారు. క్రమశిక్షణ 100% రిజల్ట్ తేవడంలో ఎంతో కృషి చేస్తూ విద్యార్థినిలకు అర్థమయ్యే విధంగా సరళంగా బోధిస్తూ మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా రకూడా ఎంపిక కావడం జరిగింది ప్రస్తుతం 2026 ఉత్తమ జిల్లా ఉపాధ్యాయురాలు కేజీబీవీల తరపు నుండి ఎంపిక కావడం పట్ల పాఠశాల స్పెషల్ ఆఫీసర్ అంజలి తోటి టీచర్లు జిల్లాకు పాఠశాల నుండి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు ఉమామహేశ్వరి మరిన్ని గొప్ప అవార్డులను పొందాలని పాఠశాల విద్యార్థినిలు సిబ్బంది , తల్లిదండ్రులు ఆకాంక్షిస్తున్నారు.

# డ్యూటీలో రీల్స్ చేస్తే ఉద్యోగానికే ఎసరు?

## ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త కోడ్ ఆఫ్ కండక్ట్!




తెలంగాణ స్టేట్ బ్యూరో, సెప్టెంబర్ 04 (విజన్ ఆంధ్ర): ప్రభుత్వ ఉద్యోగుల సోషల్ మీడియా పిచ్చికి కేంద్రం చెక్ పెట్టబోతోందా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. పోలీసులు, టీచర్లు, ప్రభుత్వ అధికారులు డ్యూటీలో, యూనిఫామ్ లో రీల్స్ చేస్తూ, టిక్ టాక్ లు, ఇన్ స్టాగ్రామ్ లో ఫేమస్ అవ్వాలని చూస్తున్న ధోరణిపై కేంద్ర ప్రభుత్వం సీరియస్ అయినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగుల సోషల్ మీడియా వినియోగంపై కొత్త 'కోడ్ ఆఫ్ కండక్ట్'







తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

### కొత్త నిబంధనలు ఏంటి?

1. డ్యూటీలో రీల్స్ కు నో ఎంట్రీ: విధుల్లో ఉన్న సమయంలో లేదా యూనిఫామ్ ధరించి వ్యక్తిగత రీల్స్, వీడియోలు చేయడం, లైవ్ లు పెట్టడం పూర్తిగా నిషేధించే అవకాశం ఉంది. ఆఫీసు, పోలీస్ స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాలను బ్యాక్ గ్రౌండ్ గా పెట్టి వీడియోలు చేయడంపై ఆంక్షలు విధించనున్నారు.

2. హోదాను వాడుకుని పాపులారిటీ?: తమ అధికారిక హోదా, యూనిఫామ్ అడ్డం పెట్టుకుని సోషల్ మీడియాలో ఫాలోవర్లను పెంచుకోవడం, ఇన్ ఫ్లుయెన్సర్ గా మారడంపై నిషేధం ఉండనుంది.

3. ప్రభుత్వ విధానాలపై విమర్శలు: ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ, వివాదాస్పద రాజకీయ పోస్టులు పెడుతూ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కామెంట్లు చేస్తే కఠిన చర్యలు తప్పవు.


4. వాణిజ్య ఆదాయంపై ఆంక్షలు: సోషల్ మీడియా ద్వారా యూట్యూబ్, ఇన్ స్టా నుంచి వాణిజ్యపరంగా డబ్బు సంపాదించడం, ప్రకటనలు చేయడంపై కూడా నిషేధం విధించే యోచనలో కేంద్రం ఉంది.

### ఉల్లంఘిస్తే ఏమవుతుంది?

ఈ నిబంధనలు ఖరారైతే ఉల్లంఘించిన ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తప్పవు. మెమోలు, ఇంక్రిమెంట్లలో కోత, ప్రమోషన్ల నిలిపివేత, అవసరమైతే సస్పెన్షన్ వరకు చర్యలు ఉండే అవకాశం ఉందని సమాచారం. మొత్తానికి సోషల్ మీడియా పిచ్చితో ఉద్యోగాన్ని పణంగా పెట్టుకోవద్దని కేంద్రం హెచ్చరిక జారీ చేయబోతోందని చెప్పవచ్చు.

# డయాబెటిస్ బాధితులకు ఫిజీషియన్ల వాకింగ్ గైడ్!!

- షుగర్ స్పైక్స్‌కు నడకే అడ్డుకట్ట
- డయాబెటిస్‌కు పోస్ట్‌ప్రాండియల్ వాకింగ్
- అసిడిటీ, గ్యాస్‌కు నడకతో ఉపశమనం
- గుండె ఆరోగ్యానికి పోస్ట్‌మీల్ వాకింగ్
- మితమైన వేగంతో నడకే మేలు
- కండరాల కదలికతో గ్లూకోజ్ వినియోగం
- హెల్త్ అంశంపై విజన్ ఆంధ్ర ప్రత్యేక కథనం..



హైదరాబాద్(హెల్త్ డెస్క్), సెప్టెంబర్ 4: భోజనం తర్వాత కేవలం 15 నిమిషాల నడక.. డయాబెటిస్ ఉన్నవారికి రక్తంలో షుగర్ పెరుగుదలను అదుపులో ఉంచే సులభమైన అలవాటుగా వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మందులతో పాటు ఈ చిన్నపాటి నడకను రోజువారీ జీవితంలో భాగం చేసుకుంటే ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపే




అవకాశం ఉందని తాజా పరిశోధనలు చెబుతున్నాయి. డయాబెటిస్ బాధితులకు భోజనం తర్వాత చేసే ఈ 'పోస్ట్‌ప్రాండియల్ వాకింగ్' ఇన్సులిన్ ఆధారపడటాన్ని తగ్గించడంలో అద్భుత ఔషధంగా పనిచేస్తుందని వెల్లడైంది.

### శరీరంలో ఏం జరుగుతుంది?

### (సైంటిఫిక్ విశ్లేషణ, డాక్టర్ల సూచన)

సాధారణంగా భోజనం చేసిన 30 నుంచి 60 నిమిషాల వ్యవధిలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు గరిష్ట స్థాయికి (గ్లూకోజ్ స్పైక్) చేరుకుంటాయి. ఆ సమయంలో నడవడం వల్ల శరీరంలో కీలక మార్పులు చోటుచేసుకుంటాయి:

### గ్లూకోజ్ ట్రాన్స్పోర్టర్ టైప్ -4 యాక్టివేషన్

సాధారణంగా రక్తంలోని గ్లూకోజ్ కణాల్లోకి వెళ్లడానికి ఇన్సులిన్ అవసరం. అయితే నడిచేటప్పుడు అస్థిపంజర కండరాలు (స్కెలెటల్ మజిల్స్) సంకోచించడం వల్ల కణాల్లో ఉండే గ్లట్-4 అనే ప్రొటీన్లు నేరుగా స్పందిస్తాయి. ఇన్సులిన్‌తో పెద్దగా నిమిత్తం లేకుండానే కండరాలు గ్లూకోజ్‌ను నేరుగా ఇంధనంగా గ్రహిస్తాయి.

### ఇన్సులిన్ సెన్సిటివిటీ పెంపు

శరీర కణాల ఇన్సులిన్ నిరోధకత (ఇన్సులిన్ రెసిస్టెన్స్) తగ్గి, ఇన్సులిన్ సున్నితత్వం పెరుగుతుంది. దీనివల్ల ప్యాంక్రియాస్ (క్లోమం) పై భారం తగ్గుతుంది. హెచ్.బి.ఏ1సి నియంత్రణలి భోజనం తర్వాత పెరిగే చక్కెర అదుపులో ఉండటం వల్ల దీర్ఘకాలిక రక్త చక్కెర సూచీ అయిన హెచ్.బి.ఏ1సి స్థిరంగా తగ్గుతుంది.

### ప్రధాన ప్రయోజనాలు

గ్లూకోజ్ స్పైక్స్ నివారణ భోజనం తర్వాత చక్కెర ఆకస్మికంగా పెరగకుండా (పోస్ట్‌ప్రాండియల్ స్పైక్స్) అడ్డుకట్ట పడుతుంది.

జీర్ణక్రియ వేగవంతం ఆహారం సులభంగా జీర్ణమై అసిడిటీ, గ్యాస్, కడుపుబ్బరం సమస్యలు తొలగిపోతాయి.

### గుండె ఆరోగ్యం

ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలు అదుపులోకి వచ్చి రక్తపోటు నియంత్రణలో ఉంటుంది.

### నిపుణుల కీలక సూచనలు

**సమయం:** భోజనం ముగిసిన 15 నుంచి 20 నిమిషాల వ్యవధిలో నడక ప్రారంభించాలి.
**వ్యవధి:** కనీసం 10 నుండి 15 నిమిషాల పాటు సాధారణ లేదా మితమైన వేగంతో నడిస్తే సరిపోతుంది.
**జాగ్రత్త:** తిన్న వెంటనే బరువైన వ్యాయామాలు, వేగంగా పరుగెత్తడం చేయకూడదు; కేవలం సాధారణ వేగంతో నడవడమే శ్రేయస్కరం.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ విజన్ ఆంధ్ర**

# మాజీ మహారాష్ట్ర సీఎం సుశీల్ కుమార్ షిండేకి 86వ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖ వ్యాపారవేత్త కొమ్మగోని శ్రీనివాస్ గౌడ్



వంగూరు సెప్టెంబర్ 04 (విజన్ ఆంధ్ర): మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర హోంశాఖ మంత్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ గవర్నర్ శ్రీ సుశీల్ కుమార్ షిండే 86వ జన్మదినం సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త కొమ్మగోని శ్రీనివాస్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొమ్మగోని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. "సుశీల్ కుమార్ షిండే గారి 86వ జన్మదినం సందర్భంగా హార్దిక శుభాకాంక్షలు. ప్రజా జీవితంలో, జాతీయ సేవలో మీరు అందించిన విశేష కృషి స్ఫూర్తిదాయకం. మాజీ ముఖ్యమంత్రిగా, మాజీ కేంద్ర రక్షణ శాఖ మంత్రిగా, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ గా మీరు చేసిన సేవలు ఎల్లప్పుడూ గౌరవంతో గుర్తుండిపోతాయి" అని పేర్కొన్నారు. "ఈ శుభదినాన ఆ భగవంతుడు మీకు సంపూర్ణ ఆరోగ్యం, సంతోషం, శాంతి, సుదీర్ఘమైన జీవితాన్ని ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నాను. మీ జ్ఞానం, ఆప్యాయత, ఆశీస్సులు మరెన్నో ఏళ్లు మాకు మార్గదర్శకంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు.

# యాదాద్రీశుడిని దర్శించుకున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్



యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 4(విజన్ఆంధ్ర) : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, ఆలయ అధికారులు ఆలయ సంప్రదాయాల ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం అర్చకులు వేద మంత్రాలతో వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి లడ్డు ప్రసాదాన్ని చైర్మన్‌కు అందజేశారు.




# యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహుడి సన్నిధిలో విదేశాంగ శాఖ జాయింట్ సెక్రటరీ

యాదగిరిగుట్ట,సెప్టెంబర్ 4(విజన్ఆంధ్ర) : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి సన్నిధికి భారత విదేశాంగ శాఖ జాయింట్ సెక్రటరీ అల్పనా దూబే శుక్రవారం విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు అర్చకులు ఆలయ సంప్రదాయల ప్రకారం ఘన స్వాగతం పలికారు.అనంతరం ప్రధానాలయంలో స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వేదపండితులు వేదమంత్రాలతో వేదాశీర్వచనం అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి భవాని శంకర్ స్వామివారి చిత్రపటం,లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.



EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.